www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 28-9-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 181 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి మ.2.27 తదుపరి సప్తమి; నక్షత్రం: జ్యేష్ఠ తె.3.55 తదుపరి మూల; వర్జ్యం: ఉ.7.22-9.10, దుర్ముహూర్తం: సా.4.27-5.15, అమృతఘడియలు: సా.6.05-7.52, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.02 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సినీ హీరో విజయ్ సభలో పెను విషాదం..

కన్నీటి కరూర్

తొక్కిసలాటలో 38 మంది దుర్మరణం.. వందమందికి పైగా క్షతగాత్రులు

- తమిళనాడు కరూర్‌లో టీవీకే ప్రచార సభ.. ఉదయం నుంచే జనం పడిగాపులు
- నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చిన విజయ్.. ఇరుకు రోడ్డులో కిక్కిరిసిన జనం
- సభ ముగియగానే అదుపుతప్పిన పరిస్థితి.. ఒకరిమీద ఒకరు పడి తొక్కిసలాట
- హుటాహుటిన కరూర్ చేరుకున్న సీఎం స్టాలిన్.. హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ





ప్రమాద స్థలి నుంచి ఓ మృతదేహం తరలింపు; ఆస్పత్రిలో ఓ బాలుడి వద్ద రోదిస్తున్న మహిళ



కరూర్‌లో విజయ్ ప్రచార సభలో కిక్కిరిసిన జనసందోహం

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాట పెను విషాదం చోటుచేసుకుంది. ఒక రాజకీయ సభ... మృత్యు వేదికగా మారింది. తమిళ సినీ నటుడు, తమిళ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మరణ మృదంగం మోగింది. లెక్కకు మిక్కిలిగా జనం తరలివచ్చారు. దారులు మొత్తం కిక్కిరిసిపోయాయి. పరిస్థితి అదుపు తప్పి... తొక్కిసలాటకు దారి తీసింది. అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... ఈ విషాదంలో 38 మంది మరణించారు. వంద మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు

మిగతా 9వ పేజీలో...

మృతులకు రాష్ట్రపతి, ప్రధాని సంతాపం | నా గుండె బద్ధలైంది: విజయ్

42% జీవో ఎలా ఇస్తారు?



ప్రస్తుత పంచాయతీరాజ్ చట్టం కింద రిజర్వేషన్లు 50 శాతం మించరాదు

సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం లేదు.. బీసీలకు రిజర్వేషన్లు మంచి ఉద్దేశమే

చేసేదేదో చట్ట ప్రకారం ఉండాలి.. జీవో 9ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు

స్టే ఇవ్వకుండానే విచారణ 8కి వాయిదా.. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా విచారణ ఆగదు

ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టీకరణ.. అసెంబ్లీకి శాసనం చేసే అధికారముంది: ప్రభుత్వం

స్థానిక ఎన్నికలపై ముందుకే!.. న్యాయ సలహాతో నేడో రేపో షెడ్యూల్

బీసీలకు 13 జిల్లా పరిషత్‌లు, ఎస్సీలకు 6, ఎస్టీలకు 4, జనరల్ 8.. గెజిట్ జారీ

11

హైదరాబాద్ మూసారాంబాగ్ వద్ద రోడ్లను పూర్తిగా కప్పేసిన మూసీ వరద



కళ్లు మూసి తెరిచేలోగా..

వరదతో మూసీ పరీవాహక ప్రాంతాల్లో అల్లకల్లోలం

వేల ఇళ్లు మునక.. అంతా 10-20 నిమిషాల్లోనే

జలదిగ్బంధంలో మహాత్మాగాంధీ బస్ స్టేషన్

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం.. ప్రమాదాల్లో ఇద్దరి మృతి

10

ఆపదలో ఆదుకునే మిత్రుల్లా పోలీసులు!



ప్రజలకు అనుకూలమైన పోలీసింగే లక్ష్యం

తప్పు చేసినవారికి శిక్షలు పడితేనే నేరస్థుల్లో భయం

పోలీసులు పక్కాగా సాక్ష్యాధారాలు కోర్టుల ముందు ఉంచాలి

సివిల్ పంచాయితీలకు పాల్పడితే చర్యలు తప్పవు

సైబర్ నేరాల కట్టడికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలవాలి.. పునరావాసం కల్పిస్తాం

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కాబోయే డీజీపీ శివధర్‌రెడ్డి

2



గ్రూప్-1కు ఎంపికైన అభ్యర్థికి నియామకపత్రం ఇస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం

పదేళ్ల పాలకులు..

నమ్మక ద్రోహులు

అధికారమిస్తే నిరుద్యోగులను నట్టేట ముంచారు

పదేళ్లలో గ్రూప్-1 నిర్వహించలేని అసమర్థులు

మేం ప్రకటిస్తే.. కడుపులో విషంతో అడ్డుకునే కుట్ర

40 ఏళ్లలో చేయనిది 19 నెలల్లో పూర్తిచేశాం

గ్రూప్-1 అధికారులుగా బాధ్యతతో ఉండండి

తెలంగాణ అంటే ఏంటో దేశానికి చూపించండి

తల్లిదండ్రులను విస్మరిస్తే జీతంలో కోత: సీఎం

562 మందికి నియామక పత్రాల అందజేత

పర్యాటకంలో పెట్టుబడులు పెట్టండి

లాభాలు తెప్పించే బాధ్యత తీసుకుంటాం

పర్యాటక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

రూ. 15,279 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

తుమ్మిడిహెట్టిపై వచ్చే నెలలో మహారాష్ట్రకు సీఎం!

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ నేతలు.. ప్రజలకు నమ్మకద్రోహం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. జీవితాలను బాగు చేస్తారని ప్రజలు ఓటేస్తే.. రాష్ట్రాన్ని కొల్లగొట్టారని, కొలువులు ఇస్తారని నిరుద్యోగులు అధికారం కట్టబెడితే.. వారిని నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. కొలువులన్నీ కేవలం ఒక్క కుటుంబానికే దక్కాయన్నారు. నియామకాల కోసం సాధించుకున్న రాష్ట్రంలో.. పదేళ్లలో కనీసం ఒక్క గ్రూప్-1 కూడా నిర్వహించలేని అసమర్థత కేసీఆర్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. శనివారం శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క,

మిగతా 13వ పేజీలో...

హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్

» హైదరాబాద్ సీపీగా సజ్జనార్.. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విజయ్.. ఒకే సారి 23 మంది ఐపీఎస్‌ల బదిలీ



సీవీ ఆనంద్ సజ్జనార్

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా శివధర్‌రెడ్డిని నియమించిన ప్రభుత్వం.. గంటల వ్యవధిలోనే కీలక స్థానాల్లో ఉన్న ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఒకేసారి 23మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సీపీగా ఉన్న సీవీ ఆనంద్‌ను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఆర్టీసీ ఎండీగా ఉన్న సజ్జనార్‌ను హైదరాబాద్ కమిషనర్‌గా బదిలీ చేసింది. త్వరలో పదవీ విరమణ చేయనున్న హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తాకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎగ్జిక్యూటివ్ వీసీగా బాధ్యతలు అప్పగించింది. ఇక, ఏసీబీ డీజీగా ఉన్న విజయ్‌కుమార్‌ను ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించింది. సీఐడీ ఏడీజీ చారుసిన్హాకు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీగా ఉన్న షికా గోయల్‌ను విజిలెన్స్ డీజీగా నియమించినా, తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌చార్జి పదవిలోనే ఉండాలని ఆదేశించింది. హోంగార్డ్స్ విభాగం ఏడీజీ స్వాతి లక్రాకు ఎస్‌పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్‌కు ఏడీజీ పర్సనల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించి, ఆ పదవిలో ఉన్న అనిల్ కుమార్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాల ఏడీజీగా నియమించింది. ఫైర్ సర్వీసు డీజీగా ఉన్న నాగిరెడ్డిని ఆర్టీసీ ఎండీగా బదిలీ చేసింది. పౌరసరఫరాల శాఖ ఎండీగా ఉన్న దేవేంద్రసింగ్ చౌహాన్‌ను మల్టీజోన్-2 ఏడీజీగా నియమించింది. హైదరాబాద్ అదనపు కమిషనర్‌గా ఉన్న విక్రమ్ సింగ్ మాన్‌ను ఫైర్ సర్వీసెస్ డీజీగా, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ క్రైమ్స్ అదనపు కమిషనర్‌గా శ్రీనివాసులును నియమించింది. త్వరలో మరింత మంది ఐపీఎస్‌ల బదిలీలు జరగనున్నాయని సమాచారం.

ఆపదలో ఆదుకునే మిత్రుల్లా పోలీసులు!

ప్రజలకు అనుకూలమైన పోలీసింగే లక్ష్యం.. తప్పు చేసినవారికి శిక్షలు పడితేనే నేరస్తుల్లో భయం

» సైబర్ నేరాల కట్టడికి అవగాహన కార్యక్రమాలు
» మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి
» మహిళా పోలీసులకు ప్రాధాన్య పోస్టులు ఇస్తాం
» 'ఆంధ్రజ్యోతి'తో కాబోయే డీజీపీ శివధర్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అనుకూలంగా, ఆపదలో ఆదుకునే మిత్రుల్లా పోలీసుల పని తీరు ఉండాలని నూతన డీజీపీగా నియమితులైన బత్తుల శివధర్‌రెడ్డి సూచించారు. పోలీసులను తమ స్నేహితులుగా ప్రజలు భావించేలా ఉండాలనేది తన లక్ష్యమని చెప్పారు. తప్పు చేసినవారికి సకాలంలో శిక్షలు పడితేనే.. నేరాలకు పాల్పడేవారిలో భయం పెరుగుతుందని చెప్పారు. అదే సమయంలో బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. వచ్చేనెల ఒకటో తేదీన డీజీపీగా బాధ్యతలు స్వీకరించబోతున్న శివధర్‌రెడ్డి శనివారం ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రతి పోలీసు అధికారి నిజాయితీ, క్రమశిక్షణ, నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని కోరారు.

మహిళా భద్రత కోసం ఏం చేయబోతున్నారు?

రాష్ట్రంలో మహిళల భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఇప్పటికే గణనీయమైన కృషి చేసింది. బాధిత మహిళల్లో భరోసా కల్పించి, ధైర్యాన్ని ఇచ్చేలా పోలీసు చర్యలు ఉండాలని కోరుకుంటున్నా. మహిళలకు సంబంధించిన కేసులతో పాటు ఇతర క్రిమినల్ నేరాల్లో నేరస్తులకు సకాలంలో శిక్షలు పడితేనే బాధితులకు పోలీసు వ్యవస్థ మీద నమ్మకం పెరుగుతుంది. దర్యాప్తు అధికారులు పక్కాగా సాక్ష్యాధారాలను సేకరించి, కోర్టు ముందుంచి నేరగాళ్లకు శిక్షలు పడేలా చూడాలి.

పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి ఏం చేయనున్నారు?

సైబర్ నేరాలను కట్టడి చేయడానికి బహుముఖ వ్యూహం అవసరం. ఎక్కడో ఉండి, మరెక్కడో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారికి గోప్యతే కీలకం. ఆ గోప్యతను ఛేదించడం పోలీసుల ముందున్న ప్రధాన సవాల్. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. దొరికిన ఏ చిన్న అవకాశాన్ని వదలడం లేదు. అదే స్థాయిలో పోలీసులకు సాంకేతిక అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. చదువుకున్నవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతుండటం ఆందోళనకరం.

హైదరాబాద్‌లో ట్రాఫిక్‌పై ఏం చర్యలు చేపడతారు?

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ సమస్య ఒక్క పోలీసు విభాగంతోనే పరిష్కారం కాదు. వివిధ శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలు గుర్తించి, సకాలంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మున్సిపల్, విద్యుత్, టెలికం, వాటర్ బోర్డు, సాగునీటి శాఖల అధికారులతోపాటు ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. ఒకరు రోడ్డు వేస్తూ, మరొకరు గుంతలు తవ్వుతూ ఉంటే సమస్యలు పరిష్కారం కావు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం లా అండ్ ఆర్డర్ పోలీసులను కూడా భాగస్వాములను చేస్తాం.

మావోయిస్టుల అంశంలో మీ వైఖరి?

వాస్తవంగా తెలంగాణలో మావోయిస్టుల సంఖ్య తగ్గిపోయింది. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వారు 70 మంది వరకు ఉన్నారు. వారిలో పదిమందే తెలంగాణవారు. మిగతా ఇతర రాష్ట్రాల వారే. మేం లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాం. మిగిలిన మవోయిస్టులంతా ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీని గమనించి జనజీవన స్రవంతి లోకి రావాలి. వేధింపులు లేని జీవితం అందిస్తాం. ఇటీవల మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సోనూ రాసిన లేఖ ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది. మావోయిస్టు ఉద్యమం చివరిదశకు చేరిందని స్పష్టమవుతోంది.

సివిల్ పంచాయితీలు చేసే పోలీసులపై చర్యలుంటాయా?

పోలీసుస్టేషన్లలో పంచాయితీలు ఉండవు. అలా సివిల్ పంచాయితీలకు పాల్పడేవారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తాం. క్రమశిక్షణ గీత దాటితే వేటు తప్పదు. అది చిన్నవారైనా, పెద్దవారైనా సరే. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసు స్టేషన్లకు రావొచ్చు. ప్రజలను వేధించాలని చూస్తే ఎవరినీ క్షమించేది లేదు.

షిఫ్టుల విధానాన్ని నిజాయితీగా అమలు చేయగలరా?

పోలీసులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించడానికి ప్రయత్నిస్తాం. హైదరాబాద్ వంటి చోట్ల పూర్తి స్థాయిలో ఏడాదంతా షిఫ్ట్ పద్ధతి అమలు చేయడం వీలుకాదు. పండుగలు, ఆకస్మిక విపత్తులు వచ్చినపుడు షిఫ్టు పద్ధతి అమలు చేయలేకపోతున్నాం. దీనిపై సమీక్షిస్తాం. పోలీసులకు కుటుంబంతో గడిపే అవకాశం ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తాం. పోలీసు కుటుంబాల సంక్షేమం మా ప్రధాన బాధ్యత కూడా.

మహిళా పోలీసులకు సరైన పోస్టింగ్‌లు లభిస్తున్నాయా?

దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలో మహిళా పోలీసుల సంఖ్య తక్కువగా ఉన్నారు. మహిళా పోలీసుల సంఖ్య పెంచడానికి ప్రయత్నిస్తాం. మహిళా పోలీసు అధికారులకు పురుష అధికారులతో సమానంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల్లో పోస్టింగ్‌లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. స్టేషన్లలో అన్ని వసతులు కల్పిస్తాం. మహిళా పోలీసుల ఇబ్బందులు, సమస్యలపై ఫోన్ చేసినా, లేఖ రాసినా స్పందిస్తా. ప్రభుత్వం ఇప్పటికే మహిళా పోలీసు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించింది. పాతబస్తీ వంటి కీలకమైన చోట మహిళా ఐపీఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించాం.

సిరిసిల్ల కలెక్టర్ సందీప్ ఝాపై వేటు

రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పోస్టింగ్

మరో నలుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. మరో నలుగురు ఐఏఎస్ అధికారులను కూడా బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17న సిరిసిల్లలో నిర్వహించిన ప్రజా పాలనా దినోత్సవానికి శాసన సభ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ ఝా ముందస్తుగా హాజరు కావాల్సి ఉండగా.. ఆలస్యంగా వచ్చారు. దీనిపై ఆది శ్రీనివాస్ సీఎంవోలో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సీఎస్ కూడా కలెక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. తాజాగా ఆయన్ను సిరిసిల్ల నుంచి బదిలీ చేసి.. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. ఇది అప్రాధాన్య పోస్టు అన్న అభిప్రాయాలున్నాయి. కాగా, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీకి సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) ముఖ్యకార్యదర్శి(పొలిటికల్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు జీఏడీ బాధ్యతలు చూసిన వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును రెండు పోస్టుల నుంచి బదిలీ చేసి వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. రవాణా శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్‌ను బదిలీ చేసి, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శిగా నియమించారు. సహకార సొసైటీల రిజిస్ట్రార్‌గా, మార్కెటింగ్ డైరెక్టర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరితకు సిరిసిల్ల కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్న కె.హరితకు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు.

దసరా శుభాకాంక్షలు

అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి బుచ్చినయమ్మ, దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గమాయమ్మ కృతాబ్ధి ఇచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్


దసరా శుభాకాంక్షలు



LED TV's, Air Conditioners లపై తగ్గించిన 18% GST తో కొనుగోలుచేయండి,

దానిపైన దసరా ప్రత్యేక తగ్గింపు

సోనోవిజన్ దసరా సేల్



6% పైన అదనపు డిస్కౌంట్ లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్



ప్రతి ₹ 2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి

₹100/- నుండి ₹1,00,000/- వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి.

(సెలక్టెడ్ మోడల్స్ పై)

స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు

రూ. 1,00,000/- విజేత

శ్రీ పన్నాల అనిరుధ్ గారు
బొటానికల్ గార్డెన్, హైదరాబాద్.
7674076393

రూ. 1,00,000/- విజేత

శ్రీ మణి కుమార్ గారు
దేవినగర్, విజయవాడ.
8008109777

రూ. 1,00,000/- విజేత

శ్రీ బి. బాల వెంకటేశ్వర గారు
మాధవధార, విశాఖపట్నం
8885334220

రూ. 1,00,000/- విజేత

శ్రీమతి యం. కృష్ణ వేణి గారు
ఆర్.ఆర్.అప్పారావు స్ట్రీట్, విజయవాడ
9618209926

రూ. 1,00,000/- విజేత

శ్రీమతి పి. కృష్ణ కుమారి గారు
స్నేహపురి కాలని, గాజువాక
8985077199

రూ. 1,00,000/- విజేత

శ్రీ ఆర్. సంతోష్ శివకుమార్ గారు
సాగర్ నగర్, విశాఖపట్నం.
6302643557

రూ. 1,00,000/- విజేత

శ్రీ నక్కా గిరిబాబు గారు
బుచ్చయ్య నగర్, రాజమండ్రి
9347308113

రూ. 1,00,000/- విజేత

శ్రీ పి. శ్రీనివాస్ గారు
సీతమ్మధార, విశాఖపట్నం.
9177701617

రూ. 1,00,000/- విజేత

శ్రీమతి యస్. సింధుచౌదరి గారు
నెహ్రూ నగర్, ఖమ్మం.
7799756667

రూ. 1,00,000/- విజేత

శ్రీమతి ఎ. హేమలత గారు
కింగ్స్ కోర్ట్, నెల్లూరు.
9849072387

రూ. 50,000/- విజేత

శ్రీ బి. దీపక్ గారు
కొయ్యన్‌పేట, విజయనగరం.
9666191965

రూ. 50,000/- విజేత

శ్రీ హర్ష రామినేని గారు
క్రాంతినగర్, జీవకోన, తిరుపతి.
8099084808

రూ. 50,000/- విజేత

శ్రీమతి యం. హేమ గారు
బైపాస్ రోడ్, మంగళగిరి.
8885343511

రూ. 50,000/- విజేత

శ్రీ జి. విజయ్ కుమార్ గారు
కూకట్‌పల్లి, హైదరాబాద్.
9885000727

రూ. 50,000/- విజేత

శ్రీ వి. విఠల్ గారు
బన్‌సవాడ, నిజామాబాద్.
7661803318

రూ. 50,000/- విజేత

శ్రీ యం. వెంకటేశ్వరరావు గారు
చినపరిమి, తెనాలి
8019999059

LG

Life's Good.

Celebrate Festivities with Reduced Prices

GST

28% >>> 18%*



Festive Offers*

3 YEAR* WARRANTY (On Select LG TVs) | Up to 26%* CASHBACK Max ₹26000 ON SELECT CREDIT / DEBIT CARDS | Up to 30%* OFF ON LG SOUNDBAR (With Select 4K TVs) | FIXED EMI Starting from ₹2999* | LG BEST Care Ask for AMC Starting from ₹18 per day*

Powered by Microsoft Copilot | α11 4K AI Processor Gen2 | AI Voice ID Chatbot | Dolby VISION·ATMOS | webOS Re:New Program

LG BEST Care | LG 24 x 7 CUSTOMER CARE 08069379999 www.lg.com/in/support | LG WhatsApp No. 9711709999 | LG Service India Mobile App Available at Google Play | www.facebook.com/lgindiapage/ | www.x.com/lgIndia | To know more about LG, visit www.lg.com/in | For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com | Scan to know more about LG AI TV

Regd. Office: LG Electronics India Limited, A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044 CIN No. U32107DL1997PLC220109

*T&C Apply. Unless mentioned otherwise, offers are valid till 31st Oct 2025 or till the stock lasts, whichever is earlier. Offers are available on selected products only, kindly check with store manager for offers before purchase. **3 Year Warranty** is applicable on select LG OLED TVs. This includes 1 Year standard warranty and next 2 Year free of Cost promotional warranty. Labour cost is chargeable for 2nd & 3rd year. **Cashback up to 26% or max ₹26000** (whichever is lower) is applicable on select TVs and will be posted to the consumer account after 90 days from end of offer period, unless instant cash back is active in the store. Cashback on Credit and Debit card, EMI / Non EMI transactions depends on bank to bank. **1 EMI Off & FIXED EMI** (starting from ₹2999) is applicable on select TV models. Cashback & EMIs are at the sole discretion of Bank/Finance Company and is governed by their TnC. LG India Ltd. expressly disclaims any liability in any manner whatsoever. **LG Best Care AMC plan starting from ₹18 per day applicable on** 106cm (42) OLED TVs for 2 years Platinum plan. For more information on the plans, please visit www.lg.com/in. AMC price mentioned is in Indian Rupee and exclusive of taxes. LG reserves the right to modify, alter, withdraw or extend the offer at any point of time without any prior notice or justification. Offer cannot be clubbed and gifts cannot be redeemed for cash at any point of time. Products are available for purchase without the offers as well. Offer is applicable only on retail sales at select outlets in select cities and may not applicable on institutional sales, B2B, B2C, online channel, E- commerce, Government sales etc. and other modes of sales transactions which do not specifically fall under the category of retail sales. LG decision regarding all matters under offers shall be final and binding and no claims shall be entertained in this regard. All disputes are to be settled /adjudicated in Delhi Courts only. LG shall not be responsible for any loss or damage, if it has to alter, modify or withdraw this offer in compliance with any law, ruling, order, regulation, requirement or instruction of any Central/State Government, or for any other unavoidable reason beyond their control. This offer is subject to Force Majeure conditions including but not limited to Pandemic, Epidemic, and Natural Disasters Etc. Features are subject to change and may vary from model to model. Logos shown in the creative belong to respective trademark owners only. Product images shown are for representative purpose only. Actual products may differ. Products are available without these offers as well. For more information, please visit www.lg.com/in or contact retailer/store manager.

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

మా నూతన ప్రారంభమైన షోరూంల కు ఆహ్వానం

ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురు, వినాయక్ నగర్, నిజామాబాద్ - 8712648766, 67 , 68.	అదాలత్ సర్కిల్, హనుమకొండ, వరంగల్. 8712648718, 19, 20.	కుడకుడ రోడ్, సూర్యాపేట. 8712648761, 62, 63	ప్రకాశం బజార్, నల్గొండ. 8712648715, 16, 17

వి. పార్క్ ఎదురుగా, సీతారాంపురం, జగిత్యాల రోడ్, కరీంనగర్. 8712635843, 44, 45.	వేములవాడ రోడ్, మంకమ్మ తోట, కరీంనగర్ - 8712635841, 42.	Opp. వైష్ణవి గ్రాండ్ హోటల్, ఆర్ & బి సాగర్ రోడ్, మిర్యాలగూడ. ఫోన్ : 8712635848, 49, 50	పర్ణశాల ఎదురు, వైరా రోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38	కస్పాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634	వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635	కొత్తగూడెం. 9154867825, 26, 27

పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181, 9154281183, 84	మెట్రోస్టేషన్ దగ్గర, బిగ్‌బజార్ ప్రక్కన, కూకట్‌పల్లి, హైదరాబాద్. 9154281180, 81, 82	హైదర్‌నగర్, మియాపూర్, హైదరాబాద్. 7331149363, 64, 65	మలక్‌పేట, హైదరాబాద్. 9154281187, 8333924932, 33	ఎల్.బి.నగర్, హైదరాబాద్. 9154281188, 8333924940, 41	బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్, హైదరాబాద్. 8712648707, 708, 709	ప్యారడైజ్ కాలని, షాద్‌నగర్, ఫారూఖ్ నగర్, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 8712648701, 02, 03.	గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ 8712635851, 52, 53

కాకతీయులపై కొత్త వెలుగులు

కోదాడలోని ముస్లిం శ్మశానవాటికలో లభించిన తొమ్మిది గుత్తుల రాగి పలకల మీద రాసివున్న శాసనాల ఆధారంగా కాకతీయ వంశావళిని తిరగ రాయాల్సిన అవసరం ఉంది. ఆ శాసనప్రతులింకా వెల్లడి కాలేదు కానీ, వాటిలోని విశేషాలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారాను, గత నెల 27న జూమ్ మీటింగులో ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారాను మైసూరులోని ఏఎస్సై శాసనాధ్యయన శాఖ డైరెక్టరు కె.మునిరత్నంరెడ్డి వెల్లడించారు. వాటి ద్వారా తెలిసిన శాసనాంశాలను యథార్థమని అంగీకరిస్తే... కాకతీయుల వంశావళిని తిరిగి రాయవలసి వస్తుంది.

కోదాడ మొదటి రాగిశాసనంలో పేర్కొన్నట్టుగా విగ్రహవెట్టి, సకలశ్రీ, గుండ-1, ఎఱ్ర, అతని కుమారులు గుండ-2, బేతియ, గోనకలు- ఇది తొలి కాకతీయుల వరుస. తర్వాత కాకతీయ వంశక్రమం కాకర్త్య గుండన నుంచి మారలేదు ఇప్పటివరకు. కోదాడ తొలి రాగిశాసనం 'విగ్రహవెట్టి' అని పేర్కొంటే, మాంగల్లు శాసనం 'సామంతవొద్ది సంజ్ఞామ్' అంటున్నది. 'సామంతవిష్టి' అని 2వ బేత(1090) కాజీపేట దర్గా శాసనం కూడా చెప్తున్నది. వెట్టి, వొద్ది, విష్టి సమానార్థకాలు. విష్టి (వెట్టి) వంశం కాదు, అదొక అధికార పదవి. విష్టి అనే పదం రాష్ట్రకూట రాజప్రతినిధి 'శంకరగండరస'కు కూడా ఉంది. వెట్టి చేయించే అధికారులే సామంతవెట్టి.

విష్టి పన్ను వసూలు చేసే రాష్ట్రకూట పాలనా యంత్రాంగం ఉన్నతాధికారులు తమ కుటుంబాలను 'విష్టి' పేరుతో పిల్చుకున్నారు. (ఐఏపీ, వరంగల్: ఆకునూరు శాసనంలో విట్టి నారాయణ, 38) 'విష్టి' విధానం వాకాటక, రాష్ట్రకూట, చాళుక్య శాసనాల ద్వారా తెలుస్తున్నది. ఒకప్పుడు రాజులకు మాత్రమే 'విష్టి' చేయించే అధికారం కాలక్రమేణా సామంతులు, అధికారులు, భూస్వాములు, మంత్రులకు లభించింది.



కాకర్తి గ్రామ నామం 2, 3వ కోదాడ రాగిశాసనాల్లో పేర్కొన్నారు. ఆ గ్రామంలో సకలశ్రీ పేరు మీద సకలేశ్వరాలయం, గుండ-1 పేరు మీద గుండేశ్వర భట్టారకాలయం నిర్మితమైనట్టు ఆ శాసనాల వల్ల తెలుస్తున్నది. కాకర్తి ఎక్కడుందో తేలలేదు. మునిరత్నం జూమ్ మీటింగు వల్ల తెలిసిన వివరాలను బట్టి కోదాడ రాగి శాసనాల్లో పేర్కొన్న దానగ్రామాలు 12 (+4 మధిర గ్రామాలు), వాటి సరిహద్దు గ్రామాలు 77. ఇవి ఎక్కడున్నాయో వెతికిపట్టుకుంటే కొండపల్లి విషయంలో ఏయే గ్రామాలెక్కడున్నాయో తెలుస్తుంది. కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశీలనలో కొన్ని సరిహద్దు గ్రామాలు యాతవాకిళ్ల, ఘట్టికల్లు, కుడకుడ, లోచెరువులు, మూసీనది సూర్యాపేట జిల్లాలోనూ, అలాగే పాలేరు, జువ్విపాడు (జూపెడ) ఖమ్మం జిల్లాలో ఉన్నట్లు తెలిసింది. మిగతా గ్రామాలు ఈ పరిసరాల్లోనే గుర్తించే అవకాశముంది.

ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర-సంస్కృతి సంపుటాలలో 'మధ్యయుగ ఆంధ్ర దేశం' (క్రీ.శ. 1000-1324) సంపుటి, పే.108లో నల్గొండ జిల్లా 2వ శాసన సంపుటి, శాసం.25 క్రీ.శ. 1149నాటి శాసనంలో ఉన్న కొండపల్లి నాడు నేల కొండపల్లి మండలం కూడి ఉన్నటువంటిది. ఈ విభాగం కందూరుచోడుల సిరికొండ రాజ్యంలో భాగంగా ఉండేదని తెలుస్తోంది. అంటే ఈ కొండపల్లి విజయవాడ సమీపంలోని కొండపల్లి కోట కాదనేది విస్పష్టం. కాకతీయుల తొలి నివాసం తెలంగాణలోనే ఉందని చెప్పవచ్చు. కాకతీయుల శాసనాలన్నింటిలోను పేర్కొన్న కాకతిపురం హన్మకొండనే... అందులో విభేదమవసరం లేదు. తొలినాళ్ళ కాకర్తి ఏదన్నది వెతికితే సరిపోతుంది.

పోతే దుర్జయుడు కాకతీయుల మూలపురుషుడా? దుర్జయుడనే పురాణ పురుషుడు భాగవత పురాణాన్ని బట్టి మాంధాత కుడితొడ నుంచి పుట్టినవాడు. దుర్జయ నామం వంశమూలకంగా చెప్పుకుంటున్నవారు అతని వంశపారంపర్యంగా వచ్చిన పాలకులు కాదు. దుర్జయుడు తీరాంధ్రప్రాంతాల పాలకులందరికీ వంశకర్తగా చెప్పుకున్న శాసనాలెన్నో ఉన్నాయి. ఏ దుర్జయుడు? 2వ బేతరాజుకు శైవదీక్షనిచ్చిన గురువులు రాసిన శాసనంలో 'దుర్జయ' నామం వచ్చింది. రెండవసారి మైలమ గురువు ధర్మశంభు రాయించిన బయ్యారం శాసనంలో మళ్ళీ 'దుర్జయ' నామం కనిపించింది. కొలనుపాక శాసనంలో ఇంకొకసారి దుర్జయుని పేరొస్తుంది. మధ్యలో ఎవరి శాసనాల్లోనూ దుర్జయవంశం అని చెప్పుకున్న దాఖలాలు లేవు. దుర్జయుని పేరు కాకతీయులకున్న ప్రశస్తుల్లో అతిశయంగా చెప్పబడ్డదే తప్ప నిజంగా వంశం పేరు కాదనిపిస్తున్నది.

వెన్ననృపుడని చెప్పింది బయ్యారం శాసనం. అది వేయించింది మైలమాంబ. అంతకు ముందు శాసనాలలో వెన్నరాజు పేరెందుకు లేదు? గూడూరు శాసనంలో 'బొటంటి వెన్నడను సంభవుడయ్యె' అని ఉంది. అతనిని ఎఱ్ర భూపతి కొడుకుగా పేర్కొన్నారు. ఆధార శాసనాలేవీ అంతకుముందు బయటపడలేదు. ఇప్పుడు కోదాడ శాసనాలు పేర్కొన్న విగ్రహవెట్టే వెన్నడుగా చెప్పబడ్డాడేమో. అయితే అతని కొడుకు ఎఱ్ర కాదు సకలశ్రీ, అతని కొడుకు 1వ గుండ అని కొత్త శాసనాలు వెల్లడిస్తున్నాయి.

ఊహలెప్పుడు చరిత్రను నిర్మించలేవు. తేల్చిన ఆధారాలతోనే చరిత్ర మళ్ళీ రాసుకోవాలి. తామెప్పుడో చెప్పిన సంగతులకే విధేయంగా ఉండనవసరం లేదు. కొత్త చరిత్ర తెలిసినపుడు పాత చరిత్రను తిరిగి రాసుకోవడం చరిత్రకారుల కనీస బాధ్యత.

శ్రీరామోజు హరగోపాల్
కన్వీనర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం

మహిళలతోనే పుస్తకాల భవితవ్యం

అమెరికా రచయిత, ప్రజావక్త, తాత్విక యాత్రికుడు ఎరిక్ వీనర్ 2007లో 'పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఎందుకు చదువుతారు?' (వై ఉమెన్ రీడ్ మోర్ దేన్ మెన్) అనే వ్యాసం రాశారు. 'రెండు సంవత్సరాల క్రితం విఖ్యాత బ్రిటిష్ నవలా రచయిత ఇయాన్ మెక్‌ఈవాన్ ఒక ప్రయోగాన్ని నిర్వహించారు. ఒక మధ్యాహ్నం ఇయాన్, ఆయన కుమారుడు లండన్‌లోని ఒక పార్క్‌లో పిచ్చాపాటీలో ఉన్న జనాల మధ్యకు వెళ్లి పుస్తకాలు ఉచితంగా ఇవ్వడం ప్రారంభించారు. కొద్ది నిమిషాలలోనే తండ్రీ కొడుకులు 30కి పైగా నవలలు ఉచితంగా ఇచ్చివేశారు. తీసుకున్నవారు దాదాపుగా అందరూ మహిళలే. వారందరూ ఎంతో ఉత్సుకతతో ఆ కానుకలు అందుకున్నారు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే పురుషులు మాత్రం ఈ పుస్తక దానంపై కనుబొమలు ముడిచారు. దాతల ఉద్దేశాన్ని సంశయించారు. పుస్తక పఠనంపై అయిష్టతను చాటుకున్నారు' అని వీనర్ ఆ వ్యాసంలో రాశారు. ఆ ప్రయోగానుభవంతో 'మహిళలు చదవడం మానివేసినప్పుడు నవలా రచన అంతమవుతుంది' అనే ఒక అభిప్రాయానికి ఇయాన్ వచ్చారని వీనర్ ముక్తాయించారు. మరి, మహిళలు విశేష చదువరులు అయినా సాహిత్య స్రష్టలయిన విద్యావతుల గురించి మనం మాట్లాడుకోవలసినంతగా ఎందుకు మాట్లాడుకోవడం లేదు?

ఈ ఏడాది కొంతమంది భారతీయ రచయిత్రులకు ప్రపంచ సాహిత్య జగత్తులో విశేష గౌరవాదరాలు లభిస్తున్నాయి. బాను ముస్తాక్ కథా సంకలనం 'హార్ట్ ల్యాంప్'కు అంతర్జాతీయ బుకర్ పురస్కారం లభించింది. దక్షిణ భారతీయ రచయిత్రి ఒకరికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం ఇదే మొదటిసారి. కర్ణాటకలో ముస్లిం మహిళల జీవితాల గురించి కన్నడ భాషలో బాను ముస్తాక్ ప్రతిభావంతంగా రాసిన కథలను అంతే ప్రతిభావంతంగా దీపా భస్తీ ఆంగ్లంలోకి అనువదించారు. బుకర్‌తో లభించిన విశేష గౌరవాదరాలకు రచయిత్రి, ఆమె అనువాదకురాలు పూర్తిగా అర్హులే. వర్తమాన భారతీయ సాహిత్యచరిత్రలో బాను, దీపా కలిసికట్టుగా అంతర్భాగమయ్యారు.

రెండు దశాబ్దాల క్రితమే తన నవల 'The Inheritance of Loss'కు బుకర్ పురస్కారాన్ని పొందిన మరో భారతీయ రచయిత్రి కిరణ్ దేశాయి. ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్‌లో నివసిస్తున్నారు. ఆమె కొత్త నవల 'The Loneliness of Sonia and Sunny' ఈ ఏడాది బుకర్ పురస్కారానికి అత్యంత అర్హమైన నవలల్లో ఒకటిగా ఉన్నది. ఈ నవలా రచనకు ఆమె రెండు దశాబ్దాల సుదీర్ఘకాలాన్ని తీసుకున్నారు. 'ఏ క్రమశిక్షణతో మీరు ఇరవై సంవత్సరాల పాటు ఈ నవలా రచనలో నిమగ్నమయ్యారు?' అని ఆమెను ప్రశ్నించాను. 'ఇన్ని సంవత్సరాల సృజనాత్మక కృషి మూలంగా నాలో ప్రగాఢంగా అంతస్థగితమైన క్రమశిక్షణనే నేను అనుసరించాను. ప్రతి ఉదయం నేను నేరుగా రచనా వ్యాసంగంలో నిమగ్నమవుతాను. నాకు అదొక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. మరింత నిష్ఠగా, మరింత మెరుగ్గా నా సృజనాత్మక కృషికి అది తోడ్పడుతుంది. ప్రతి రోజూ నేను ఒక చీమగా, ఒక తేనెటీగగా, ఒక వానపాముగా పనిచేస్తాను. వాస్తవ జీవితానుభవాలు కళాత్మక జగత్తులోకి పరివర్తనమవుతుంటాయి...'. కిరణ్ దేశాయి తల్లి మేరీ కమ్స్ టు మి' తల్లి మేరీ రాయ్ గురించిన జ్ఞాపకాల సముచ్చయం. తన అసాధారణ బాల్యం గురించి అరుంధతి కథనం పాఠకులను ఏకాగ్ర చిత్తంతో చదివిస్తుంది. బహుశా అది ఒక రచయితను సృష్టించడం గురించి కూడా కావచ్చు. అరుంధతి ఇలా రాశారు: 'జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలు అయిన లక్ష్యాలు, సంకల్పాలు, కుటుంబ సంబంధాలు, స్నేహితులు, శారీరక, మానసిక ఆరోగ్యం, మనశ్శాంతి మొదలైన వాటికి నా జీవితం ఒక పాదసూచిక మాత్రమేనని భావిస్తున్నాను. నా జీవితం ఎప్పుడూ విషాదమయంగా గడవలేదు. తరచు ఉల్లాసకరంగా సాగింది. బహుశా ఇది నాకు నేను చెప్పుకున్న అబద్ధమూ కావచ్చు.



ప్రముఖ రచయిత్రి అనితా దేశాయి తాజా నవల 'రోసారిటా' విశేష ఆదరణ పొందుతోంది. తల్లీకూతుళ్ల మధ్య సంబంధాలు, జ్ఞాపకాలు, ఒంటరితనం మొదలైన విషయాలతో ఆసక్తికరంగా చదివించే ఈ నవల గత ఏడాది ప్రచురితమయింది. స్వేచ్ఛ, కళాత్మక జీవితం అన్వేషణలో భారత్ నుంచి మెక్సికోకు వెళ్లిన ఒక మహిళ గాథే 'రోసారిటా'. ఎనిమిదిన్నర దశాబ్దాల పైబడిన వయసులో అనితా దేశాయి సాహిత్య సృజన నుంచి మనమందరమూ స్ఫూర్తి పొందాలి.

బుకర్ పురస్కార గ్రహీతల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు మనం తప్పనిసరిగా అరుంధతీరాయ్ గురించి ప్రస్తావించుకోవాలి. బుకర్ పురస్కారాన్ని పొందిన ప్రప్రథమ భారతీయ రచయిత్రి ఆమె. 1997లో ఆమె మొదటి నవల 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'కు బుకర్ ప్రైజ్ లభించింది. ఆమె ఇటీవలి పుస్తకం 'మదర్ పవనాలు బలంగా వస్తున్న చోట నా గుడారాన్ని వేసుకున్నాను. ఆ పవనాలు నా హృదయాన్ని నా శరీరం నుంచి నిర్మలం చేస్తాయని ఆశించాను. బహుశా నేను రాయదలుచుకున్నది జీవన ప్రస్థానంలో నాలో రూపొందిన వ్యక్తి నా యువ ఆత్మకు నమ్మక ద్రోహం గురించి.. అదే జరిగివుంటే అదేమీ చిన్న పాపం కాదు. అయితే దాని మంచి చెడ్డల గురించి ఒక నిశ్చిత అభిప్రాయాన్ని వ్యక్తం చేయగల స్థితిలో నేను లేను'.

నేను ఇంతవరకు సాహిత్య సృజన చేస్తున్న మహిళల గురించి ప్రస్తావించాను (ఈ రచయిత్రులు ఇప్పటికే సుప్రసిద్ధులని, వారి గురించి రాయనవసరం లేదని నా స్నేహితుడు ఒకరు వాదించారు. అయితే నేను అతనితో ఏకీభవించలేదు. సాహిత్య రచనలు చేసేవారి గురించి పదేపదే మాట్లాడుకోవల్సి ఉందని నేను విశ్వసిస్తున్నాను). రచయిత్రుల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు

పుస్తక పఠనం, పుస్తక రచన, పుస్తకాల సృష్టి భవిష్యత్తు మహిళలేనా? వారే అయిన పక్షంలో నేను ఒక విషయాన్ని దృఢ విశ్వాసంతో చెప్పగలను: మన జీవితాలను ఆక్రమించుకుంటున్న కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను పుస్తకాలు జయించి చిరకాలం మన భావజగత్తును అలరిస్తాయి.

పుస్తకాలను పాఠకుల వద్దకు తీసుకువెళుతున్న మహిళల గురించి కూడా ప్రస్తావించుకోవడం సముచితంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా అనేక నగరాలు, పట్టణాలలో మహిళలు ప్రారంభిస్తున్న స్వతంత్ర పుస్తక దుకాణాలు, గ్రంథాలయాల సంఖ్య పెరిగిపోతోందని నా స్నేహితులు చెప్పారు. ఈ మహిళల లక్ష్యం ఏమిటి? పుస్తకపఠనంపై ఆసక్తి చూపే విద్యావంతులు అందరికీ పుస్తకాలు అందుబాటులో ఉంచడమే వారి ధ్యేయం. ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయం ఎలా ఉన్నప్పటికీ వివిధ నగరాలలో చాలా మంది మహిళలు పుస్తకాల కొనుగోలుదారులు, పాఠకులతో సంభాషిస్తూ పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్నారు. యువజనులు, వృద్ధులకు కొత్త పుస్తకాలు అందిస్తున్నారు. సృజనాత్మక ఇంద్రజాలంతో సమ్మోగ్ధం చేసే పుస్తకాలకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు. పుస్తక పఠనం, పుస్తక రచన, పుస్తకాల సృష్టి భవితవ్యం మహిళలేనా? నాకు తెలియదు. వారే అయినపక్షంలో ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలి కుమారుడిగా, మహా చదువరి అయిన ఒక మహిళ భర్తగా నేను ఒక విషయాన్ని దృఢ విశ్వాసంతో చెప్పగలను: మన జీవితాలను ఆక్రమించుకుంటున్న కృత్రిమ మేధ (ఏఐ)ను పుస్తకాలు జయించి చిరకాలం మన భావజగత్తును అలరిస్తాయి.

డెరెక్ ఓబ్రియన్
పార్లమెంటు సభ్యుడు (టీఎంసీ)
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

మూసీ వరదల సృష్టే హైదరాబాద్

హైదరాబాద్ నగర నిర్మాణానికి ప్రధాన కారణం దాని నిర్మాత ముహమ్మద్ కులీ కుతుబ్‌షాకు తన ప్రియురాలు భాగమతిపై ఉన్న ప్రేమ అనుకుంటారు చాలామంది. కానీ అసలు కారణం వర్షాలు-వరదలు, వాటి వల్ల పేట్రేగిన ప్లేగు మహమ్మారి బారి నుంచి తన ప్రజలను రక్షించుకోవాలనే రాజకాంక్ష. ప్రస్తుతం మూసీ నది మహానగరాన్ని ముంచెత్తుతున్న నేపథ్యంలో ఒకసారి గతాన్ని గుర్తుచేసుకుందాం.

హైదరాబాద్ నగర నిర్మాణ చిహ్నమైన చార్మినార్‌కు ముహమ్మద్ కులీ కుతుబ్‌షా శంకుస్థాపన చేసిన 19 అక్టోబర్ 1591కి కొన్ని నెలల ముందు ఎడతెరిపి లేని వర్షాలు కురిసి గోల్కొండ కోటలోనూ, మూసీ నదీ తీర ప్రాంతాల్లోనూ గత్తర్ (ప్లేగు) ప్రబలి వందలాదిమంది బలి అయ్యారు. అప్పటికే గోల్కొండ అధిక జనాభాతో కిటకిటలాడుతూ, కొత్త నగరం నిర్మాణం

హైదరాబాద్ నగర నిర్మాణానికి ప్రధాన కారణం దాని నిర్మాత ముహమ్మద్ కులీ కుతుబ్‌షాకు తన ప్రియురాలు భాగమతిపై ఉన్న ప్రేమ అనుకుంటారు చాలామంది. కానీ అసలు కారణం వర్షాలు-వరదలు, వాటి వల్ల పేట్రేగిన ప్లేగు మహమ్మారి బారి నుంచి తన ప్రజలను రక్షించుకోవాలనే రాజకాంక్ష. ప్రస్తుతం మూసీ నది మహానగరాన్ని ముంచెత్తుతున్న నేపథ్యంలో గతాన్ని గుర్తుచేస్తున్న కథనమిది.

గురించి పాలకులు ఆలోచిస్తున్న కాలం అది. మూసీ నది ఒడ్డున ఉన్న చిచిలం (చిన్న శ్రీశైలం) గ్రామస్థులు నాలుగుదారుల కూడలిలో ఒక తాజియా (మహ్మద్ ప్రవక్త మనుమడు హుసైన్‌కు సంబంధించిన సమాధి ప్రతిరూపం) ప్రతిష్ఠించి మహమ్మారి బారి నుంచి తమ ప్రాణాలను కాపాడమని ప్రార్థించారు. ఆ సందర్భంలో గోల్కొండ రాజ్య సుల్తాన్ కులీ కుతుబ్‌షా కూడా నేలమీద మోకరిల్లి అల్లాను దయతో తన ప్రజల ప్రాణాలను కాపాడమని ప్రార్థించాడు. ప్లేగు వ్యాప్తి తగ్గిపోతే "ఈ ప్రదేశంలో ఒక మహత్తరమైన స్మారక చిహ్నం నిర్మిస్తాను. దానివల్ల సమస్త ప్రజలు నీ అద్భుత శక్తిని, అపార కరుణను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటారు" అని ప్రతిజ్ఞ చేశాడు. వెంటనే వర్షాలు తగ్గిపోయాయి, ప్లేగు ఉపశమించింది.

కృతజ్ఞతగా కులీ కుతుబ్‌షా చార్‌మినార్ నిర్మాణాన్ని నగరంలోని నాలుగు దిక్కులను సూచించేదిగా, నగర మధ్య కట్టడంగా మొదలు పెట్టాడు. ప్లేగుపై విజయానికి గుర్తు కాబట్టి ఈ స్మారకంలో ఒక గవాక్షంపై ఎలుక సహజ శత్రువైన పిల్లి విజయదరహాస రూపం చెక్కించారు. అదే పిల్లి జాతికి చెంది, కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై మనుగడ సాగించిన ఈహా మృగం (శిర్దాల్) అనే ఊహా జంతువు రూపాలను మరి కొన్ని గవాక్షాలపై సింహం శరీరంతో, పక్షి ముక్కుతో చెక్కించారు.. చార్మినార్, దాని చుట్టూ ప్రపంచ ప్రసిద్ధమైన నగరం క్రీ.శ. 1597లో అందుబాటులోకి వచ్చాయి.



చార్మినార్ పైకి మెట్ల దారి ద్వారా వెళ్తే ఒక చిన్న మసీదును చేరుకోవచ్చు. ఆ మసీదులోని మిహ్రాబ్ (ప్రార్థనా గవాక్షం) వద్ద అంతకు ముందు వరకూ సంప్రదాయంగా ఉన్న వెలుగుతున్న జ్యోతి ప్రతీక స్థానంలో ఒక అందమైన గులాబీ పువ్వు చెక్కించారు. దీనినే కులీ కుతుబ్‌షాకు తన ప్రియురాలు భాగమతిపై ఉన్న ప్రేమకు చిహ్నమని చెప్తుంటారు. నిజమేనేమో! ఎందుకంటే, ముహమ్మద్ కులీ తన పద్యాలలో ఆమెను తెలంగన్ అని, భాగ్మతి అని, హైదర్ పియారి అని సంబోధించాడు. చార్మినార్ నిర్మించిన ప్రాంతంలో ఉన్న చిచిలం గ్రామస్థురాలు ఆమె. కులీ మనుమడు అబ్దుల్లా కుతుబ్‌షా రాజస్థాన చిత్రలేఖకుడు క్రీ.శ. 1650లో గీసిన చిత్రంలో కూడా చిచిలం ప్రాంతంలో పారే మూసీ నది, దాని ఒడ్డున చిన్న శ్రీశైలం గుడి కనిపిస్తాయి. నగరం నిర్మాణం పూర్తయిన తర్వాత కులీ కుతుబ్‌షా ఇలా ప్రార్థించాడట- "ఓ గొప్ప శ్రోతా! నా ప్రార్థన విను. సముద్రాన్ని చేపలతో నింపినట్టు నా నగరాన్ని ప్రజలతో నింపు". ఈ కొత్త నగరానికి కోటగోడలు లేవు. క్రీ.శ. 1590లలో చిన్న చిన్న సుల్తానులు పోటీలు పడుతూ పరస్పర దాడులు చేసుకుంటున్న కాలంలో ఇలాంటి రక్షణగోడలు లేని నగరం రూపకల్పన జరగడం ఒక విప్లవాత్మక ప్రయోగం.

స్వతంత్రంగా నిలిచిన నాలుగు గవాక్షా (ఆర్చ్)లతో నిర్మితమైన విశాలమైన చార్మినార్, మూసీ నదిపై నిర్మించిన రాతి వంతెన- ఆ నాటి గోల్కొండ రాజ్యశక్తిని ప్రతిబింబిస్తాయి. ఈ నగర నిర్మాణం పూర్తయిన 60 సంవత్సరాలకు నగరానికి వచ్చిన ప్రసిద్ధ యూరోపియన్ ప్రయాణికుడు జీన్ బాప్టిస్ట్ టావెర్నియర్ మూసీ నదిపై ఉన్న రాతి వంతెనను (ఈనాటి పురానా పూల్) పారిస్‌లోని సీన్ నదిపై ఉన్న వంతెనతో పోల్చాడు. అతని సహచరుడు థెవెనాట్ కూడా పారిస్‌లోని లూవ్ర్ రాజసౌధం ముందు ప్రవహించే సీన్ నదిలా మూసీ ఎంతో అందంగా ఉందని ప్రశంసించాడు.

హైదరాబాద్ నగరం పుట్టుకకు హేతువు వర్షాలు-వరదల నుంచి ప్రజల రక్షణ అనే సంక్షేమ కాంక్ష. మరో 311 సంవత్సరాల తర్వాత 1908లో హైదరాబాద్‌లో మళ్ళీ ఎడతెరిపి లేని వర్షాలు కురిసి మూసీ ఉప్పొంగి వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, ఆరవ నిజాం మహబూబ్ అలీ మూసీకి బోనాలెత్తగా వరదలు తగ్గిపోవడం, అనంతరం ఆయన వారసుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో మూసీ, ఈసీ నదులపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్ సాగర్ డ్యామ్‌లను కట్టి, వరదలను అరికట్టడమే కాకుండా హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించడం గమనార్హం. అప్పుడు హైదరాబాద్ నగరంలో కట్టిన భూగర్భ డ్రైనేజీలు, మూసీ ఇరువైపుల కరకట్టలను ఇప్పటికీ చూడవచ్చు. అలా హైదరాబాద్ నగరం మూసీనది వరదలను అరికట్టడంతోనే పుట్టి వృద్ధి చెందింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా మూసీ ప్రక్షాళన, దాని చుట్టూ పర్యాటకవృద్ధి ప్రణాళికలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనుకుంటుండడం గమనార్హం.

ద్యావనపల్లి సత్యనారాయణ

కరేబియన్ 'చక్కెర భూమి'లో భారతీయులు


1870ల నాటికి, భారతీయులు ట్రినిడాడ్‌లోని చక్కెర పరిశ్రమకు నిజమైన వెన్నెముకగా పరిణమించారు. ఎస్టేట్ జీవితం ఆకర్షణీయంగా లేనపుడు స్వతంత్ర రైతులుగా మారేవారు. భూ వినిమయ పథకం ద్వారా తమకు మంజూరు అయిన భూముల్లోనో లేదా కొనుగోలు చేసిన భూముల్లోనో వారు స్థిరపడ్డారు. ట్రినిడాడ్‌ను 'చీనీ డాడ్' (భోజ్‌పురి భాషలో చక్కెర భూమి) అని వారు వ్యంగ్యంగా పిలుచుకునేవారు.

కరేబియన్ ద్వీపాలలో ఒకటి ట్రినిడాడ్. తన మూడవ సముద్రయానంలో క్రిస్టోఫర్ కొలంబస్ 1498లో అక్కడకి చేరుకున్నాక, ఆ ప్రాంతానికి ట్రినిడాడ్ అని పేరు పెట్టాడు. ఈ పేరు క్రైస్తవ త్రిమూర్తులను స్మరించుకునే ట్రినిటీ నుంచి వచ్చింది. ఈ ద్వీపం 4,828 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. కొలంబస్ అక్కడకి చేరకముందే, స్పెయిన్‌కి కూడా వలసరాజ్యం కాక ముందే, టైనో, కాలినాగో తెగల వారు అక్కడ నివసించేవారు. వారిని కరేబ్ ద్వీపవాసులంటారు. ఆ ద్వీపాల సముదాయానికి కరేబియన్ అన్న పేరు వారి మూలంగానే వచ్చింది. దానిని బ్రిటన్ 1797లో స్వాధీనం చేసుకునే వరకూ, స్పానిష్ కాలనీగానే కొనసాగింది. 1962లో స్వతంత్ర దేశంగా అవతరించే వరకూ బ్రిటిష్ చేతుల్లో ఉంది. అత్యంత సారవంతమైన కాలనీగా బ్రిటిష్ వారు దానిని గుర్తించారు.

ఆఫ్రికన్ బానిసత్వం 1834లో పూర్తిగా రద్దయాక, బ్రిటిష్ సామ్రాజ్యంలోని చెరకు తోటలలో పనిచేసేందుకు కార్మికులు దొరకక, అన్ని ప్రాంతాలలోనూ తోటల యజమానులు చెరకు ఉత్పత్తిలో సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. చౌకైన ప్రత్యామ్నాయ, శ్రామిక శక్తి కోసం తోటల యజమానులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మొదట మడైరా, వెనిజులా, తూర్పు కరేబియన్‌ల నుంచి ట్రినిడాడ్‌కు చిన్న సమూహాలుగా కూలీలను తీసుకువచ్చి ప్రయత్నించారు. ట్రినిడాడ్‌లోని వలస పాలన అధికారులు చైనా, భారతీయ కార్మికులతో కూడా ఏకకాలంలో ఈ ప్రయోగాలు చేశారు. భారతీయ కార్మికుల కంటే, చైనా కార్మికులను దిగుమతి చేసుకోవడానికి రెండు రెట్లు ఎక్కువ ఖర్చుతో పాటు, పనికి ఏ మాత్రం సరిపోని ఆ కార్మికుల నుంచి, ఆ వాతావరణానికి ఇమడలేకపోయిన కార్మికుల నుంచి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. యూరోపియన్ ఒప్పంద కార్మికులతో కూడా ఆ పనులేవీ సాధ్యపడలేదు. చివరికి, వారు 1863 నాటికే వలస పాలన స్థాపించిన మరొక కాలనీ, భారతదేశం వైపు పూర్తిగా మొగ్గారు. తోటల యజమానుల దృష్టి కూడా ఇటే పడింది. భారతీయ జనాభాలో 80 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు కాబట్టి, బానిసలుగా ఉన్న ఆఫ్రికన్‌లకు సరైన శ్రామిక ప్రత్యామ్నాయాన్ని భారతీయులు ఇవ్వగలరని వారంతా భావించారు.

అప్పటికే ఏర్పర్చిన ఒప్పంద కార్మిక వ్యవస్థలో భాగంగా, బ్రిటిష్ 30 మే 1845 నుంచి పెద్ద సంఖ్యలో భారతీయ కార్మికుల్ని పంపిన మూడవ దేశంగా, ట్రినిడాడ్ & టొబాగోని చేర్చుకుంది. ఆ వ్యవస్థ ఆ సరికే మారిషస్, గయానాల్లో ఉనికిలో ఉంది. కార్మికులను అలా తీసుకువెళ్లిన తొలి నౌక ఫతేల్ రజాక్ 1845 ఫిబ్రవరి 16న కలకత్తా నుంచి బయలుదేరి 1845 మే 30న, 225 మంది కార్మికులతో ట్రినిడాడ్‌కు చేరింది. భారతీయ కార్మికులను 1917 వరకు, అలా క్రమ పద్ధతిలో ట్రినిడాడ్‌కు రవాణా చేయడానికి, మొత్తం 154 నౌకలు కలకత్తా, మద్రాస్, బొంబాయి నుంచి 320 ప్రయాణాలు చేశాయి. 1845-1917ల మధ్య మొత్తం 1,43,939 మంది భారతీయులు ఒప్పంద విధానంలో ట్రినిడాడ్‌కు వలస వెళ్లారు.

ట్రినిడాడ్ ఒప్పంద కార్మికులలో ఎక్కువ మంది ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రాంతాల వ్యవసాయ, కార్మిక తరగతుల వారే ఉన్నారు. బెంగాల్, దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువ సంఖ్యలో ఉన్నారు. వలస వెళ్లిన వారిలో దాదాపు 85 శాతం మంది హిందువులు, 14శాతం ముస్లింలు. ఒప్పంద కార్మిక వ్యవస్థ కింద నలిగి కష్టతరమైన పరిస్థితులు అనుభవించినప్పటికీ, దాదాపు 90 శాతం మంది భారతీయ వలసదారులు తమ ఒప్పంద కాల వ్యవధి ముగింపులో, ట్రినిడాడ్‌నే తమ శాశ్వత నివాసంగా మార్చుకున్నారు. వలసదారుల్లో అధికశాతం 20-30 వయస్సు మధ్య వారే.



ఒప్పంద ఐదేళ్ల వ్యవధి ముగింపులో, భారతీయ వలసదారులకు పారిశ్రామిక నివాస ధ్రువీకరణ పత్రం మంజూరు చేయబడేది. ఆ వ్యక్తి ఇక ఒప్పందానికి లోబడి లేడని ధ్రువీకరిస్తూ ఇచ్చిన ఒక విధమైన హామీ అది. అయినా భారతదేశానికి ఉచితంగా తిరిగి వెళ్లే అర్హత సంపాదించడానికి, కార్మికులు మరో ఐదేళ్ల పాటు తిరిగి ఒప్పందాన్ని పొందవలసి వచ్చేది. కాలనీలో పదేళ్ల శ్రమను పూర్తి చేయకుండా భారతదేశానికి తిరిగి రావడానికి ఏకైక ప్రత్యామ్నాయం వారివారి స్వంత ఖర్చుతో పయనమవడం. అది కుదరక దాదాపు 75 శాతం మంది ద్వీపంలో శాశ్వత స్థిరనివాసులుగా ఉండిపోయారు. మిగిలినవారు పొదుపుగా దాచుకున్న దానితో భారతదేశానికి తిరిగి వచ్చారు. అలా దాదాపు 20 శాతం మంది మాత్రమే స్వదేశానికి తిరిగొచ్చారు.

1870ల నాటికి, భారతీయులు ట్రినిడాడ్‌లోని చక్కెర పరిశ్రమకు నిజమైన వెన్నెముకగా నిరూపించుకున్నారు. భారతీయులకు, ఎస్టేట్ జీవితం ఆకర్షణీయంగా లేనపుడు స్వతంత్ర రైతులుగా మారడానికి పెద్ద సంఖ్యలో ఎస్టేట్‌ల నుంచి తరలివెళ్లడం ప్రారంభించారు. భూ వినిమయ పథకం ద్వారా వారికి మంజూరు అయిన భూముల్లోనో లేదా ప్రాంతం నుంచో, వారు కొనుగోలు చేసిన భూముల్లోనో వారు స్థిరపడ్డారు. 1902 నాటికి, ట్రినిడాడ్‌లోని ఉత్పత్తి అయిన చెరకులో సగానికి పైగా స్వతంత్ర చెరకు రైతులతోనే ఉత్పత్తి అయింది. వారిలో అత్యధికులు భారతీయులు. అందుకే వారు ట్రినిడాడ్‌ను 'చీనీ డాడ్' (భోజ్‌పురి భాషలో చక్కెర భూమి) అని వ్యంగ్యంగా పిలుచుకోవడం మొదలుపెట్టారు.

1884 తర్వాత ఒక కొత్త ప్రజా కార్యరూపం అకస్మాత్తుగా అక్కడ ఏర్పడింది. అది కాలనీల ప్రముఖ పత్రికలకు లేఖలు రాయడం రూపంలో బయటకొచ్చింది. భారతీయుల్లో అలా మొదటి లేఖ రాసినవాడు "A Son of India" అనే కలంపేరుతో 1888లో ట్రినిడాడ్‌లోని San Fernando Gazette అనే పత్రికలో రాయడం ప్రారంభించాడు. అది కాలనీలో ప్రముఖమైన క్రియోల్ (నల్లజాతీయులు) పత్రిక. చదువుకున్న క్రియోల్స్, వారి హక్కుల కోసం పోరాడే పత్రిక. ఆ లేఖల్లో ప్రస్తావించిన ప్రధాన అంశాల మూలంగా, 1889 నాటికి, "కూలీ" అనే పదం అవమానకరంగా భావించబడింది. అప్పటికే ఏర్పడ్డ 'కూలీ మిషన్' 'ఈస్ట్ ఇండియన్ మిషన్'గా పేరు మార్చబడింది. ఈ లేఖలు భారతీయ ప్రజా ఉద్యమం, ట్రినిడాడ్‌లో భారతీయ సముదాయ ఉనికిని, విద్య, పౌరసత్వం, సాంస్కృతిక గౌరవం వంటి అంశాల ఆధారంగా ప్రజా వేదికల ద్వారా వ్యక్తీకరించడానికి పునాది వేశాయి.

1881లోనే ట్రినిడాడ్‌లో భారతీయులు 'కాశీ పూరి' ఆలయం నిర్మించుకున్నారు. భారతీయ పేర్లతో మందిరాలు, హోటళ్లు, విద్యాలయాలు, కాలేజీలు ఉన్నాయి. హిందూ పండుగలను సైతం జరుపుకుంటారు. 30 ఏళ్లకు పైగా ప్రజాజీవితంలో ఉన్న ట్రేడ్ యూనియన్ ప్రతిపక్ష నాయకుడు బాస్డియో పాండే అక్కడ ప్రధానమంత్రిగా ఎన్నికైన మొదటి భారతీయుడు. అతడి నేతృత్వంలోని యునైటెడ్ నేషనల్ కాంగ్రెస్ సభ్యురాలు కమలా పెర్సాద్ బిస్సెస్సర్ అటార్నీ జనరల్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు అక్కడి ప్రధానమంత్రిగా ఆమె ఆహ్వానం మీదనే, ఇటీవల మన ప్రధాని మోదీ ట్రినిడాడ్ వెళ్లారు. అప్పటి వారి వారసులు అలా అక్కడ అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. అక్కడి జనాభాలో 38 శాతం భారతీయ వారసులే ఉన్నారు.

కరేబియన్‌లో భారతీయ ఉనికికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఏకైక వ్యక్తి నవలా రచయిత వి.ఎస్. నైపాల్, 2001లో సాహిత్యానికి ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని గెలుచుకున్నాడు. భారతీయ వారసత్వం, ట్రినిడాడ్ టొబాగో జీవనశైలిలో అంతర్భాగం అయింది. సాహిత్యంలో భారతీయ వారసులు వారి మూలాల్ని మరచిపోలేని రచనలు చేస్తున్నారు. రమాబాయి ఎస్పినెట్ సంపాదకత్వంలో, 'క్రియేషన్ ఫైర్' కరేబియన్ మహిళల కవిత్వ సంకలనంలో 115 మంది కరేబియన్ మహిళా కవయిత్రుల (దాదాపు 200 కవితల) ఉత్తేజకరమైన సంకలనం కూడా వెలువడింది.

కరేబియన్ ద్వీపంలో ట్రినిడాడ్ మాత్రమే, మే 30, 1845న వచ్చిన మొదటి ఒప్పంద కార్మికుల రాకను పురస్కరించుకుని వారసత్వ దినోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఒప్పంద కార్మికుల రాకను జరుపుకుంటున్న మరొక దేశం మారిషస్. చాలా మంది నాల్గవ, ఐదవ తరం ఇండో-కరేబియన్లు తమ పూర్వీకుల మూలాలను వెతుక్కుంటున్నారు. భారతదేశంలోని వారి పూర్వీకుల ఇళ్లు/గ్రామాలను సందర్శిస్తున్నారు. కాస్మోపాలిటన్ కరేబియన్‌లో వారు తమను తాము ఎలా పిలుచుకున్నా, అక్కడి వారు తమను ప్రత్యేకమైన వ్యక్తులుగా చూస్తున్నారనే వాస్తవాన్ని మాత్రం తప్పించుకోలేకపోతున్నారు.

ముకుంద రామారావు
కవి, వలసజీవితాల చరిత్రకారుడు (99083 47273)

బలాన్నిచ్చే బతుకమ్మ
ఫలహారాలు
• ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
• తొమ్మిది రోజులు.. తొమ్మిది రకాలు..
• తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం
7





• కులగణన సర్వే ప్రాతిపదికన బీసీలకు కేటాయింపు
• 68.2 శాతానికి పెరిగిన బీసీల జనాభా నిష్పత్తి
• డ్రా పద్ధతి ద్వారా నిర్ణయించిన అధికారులు
• గతంలో కన్నా పెరిగిన బీసీల సీట్లు
• ఆశావహుల్లో వెల్లివిరుస్తున్న సంతోషం
• గ్రామాల్లో మొదలైన స్థానిక సంస్థల సందడి
6

హనుమకొండ జడ్పీ చైర్‌పర్సన్

ఎస్సీ మహిళ

- **ఉమ్మడి జిల్లా జడ్పీలకు రిజర్వేషన్లు ఖరారు**
- **2 ఎస్టీలకు, 2 ఎస్సీలకు 1 బీసీకి, 1 జనరల్‌కు రిజర్వు**

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం శనివారం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లా పరిషత్‌లలో రెండు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి బీసీకి రిజర్వు కాగా, ఒకటి జనరల్ అయింది. మూడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు కేటాయించారు. మూడు జనరల్‌గా ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చినప్పటికీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులను రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని రిజర్వు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ వర్గానికి ఒక్క స్థానమే దక్కింది.

హనుమకొండ జిల్లా పరిషత్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, వరంగల్ జిల్లా జిలా పరిషత్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. జనగామ ఎస్సీ మహిళ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ జనరల్, ములుగు ఎస్టీ మహిళకు, మహబూబాబాద్ జనరల్ రిజర్వు అయింది.



జయహో.. దీప్తి జీవాంజీ

అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ కైవసం



ఢిల్లీలో జరిగిన పోటీల్లో గెలిచిన సిల్వర్ మెడల్ చూపుతున్న దీప్తి జీవాంజీ

పర్వతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజీ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. శనివారం ఢిల్లీలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో 55.16 సెకన్ల సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేసి రాణించింది. ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలలో ఆర్డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రాంమోహన్ రావు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.



Rate of Interest On Deposits (W.E.F 01-10-2025)

PERIOD	INTEREST	
	GENERAL	SENIOR CITIZENS
30 - 45 Days	4.50 %	-
46 - 90 Days	5.00 %	-
91 - 180 Days	6.00 %	-
181 Days to upto 1 Year	6.50 %	-
Above 1 Year to upto 2 Years	7.50 %	8.00 %
Above 2 Years to upto 3 Years	8.00 %	8.50 %
Above 3 Years to upto 5 Years	8.25 %	8.75 %
Above 5 Years	7.50 %	8.00 %



గుర్తింపు లేకుండా వైద్యం చేస్తున్న వారిపై కేసు

మడికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, మెడికల్ కౌన్సిల్ గుర్తింపు, అర్హత లేకుండా రోగులకు వైద్యం చేస్తున్న వైద్యులపై శనివారం మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం...ప్రభుత్వ, మెడికల్ కౌన్సిల్ గుర్తింపు, ఎంబీబీఎస్ అర్హత లేకుండా సెలైన్‌లు, ఇంజక్షన్లు ఇస్తూ రోగులకు స్వంత వైద్యం చేస్తున్నారని మడికొండలో ఏల్పుల జయరామ్, ఇ.భాగ్యలక్ష్మి నిర్వహిస్తున్న సాయిశ్రీ ప్రథమ చికిత్స కేంద్రం, అలాగే తాడెం రాజయ్య నిర్వహిస్తున్న శ్రీజ క్లీనిక్‌లను కొద్ది రోజుల కిందట విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ వారు తిరిగి అలాగే వైద్యం చేస్తున్నారంటూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్య కుమార్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ లాలయ్య ఫిర్యాదు మేరకు జయరామ్, భాగ్యలక్ష్మి, రాజయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తప్పిపోయిన బాలుర అప్పగింత



బాలురను తల్లికి అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్

మడికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన బాలురను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం... కడిపికొండకు చెందిన ఎండీ.షబానా.. తన ఇద్దరు కుమారులు అబ్దుల్ రహీమ్, అబ్దుల్ మక్సూద్ కనిపించడం లేదని శుక్రవారం అర్ధరాత్రి 100కు డయల్ చేసి చెప్పింది. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్ ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్‌లతో రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. చివరకు బాలురిద్దరూ కడిపికొండలోని పాఠశాల వద్ద పడుకొని ఉన్నట్లు గుర్తించారు. శనివారం ఉదయం తల్లి షబానాకు బాలురిద్దరినీ అప్పగించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎవరు.. ఎక్కడ?!

- ఖరారైన జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు
- కులగణన సర్వే ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఖరారు
- డ్రా పద్ధతి ద్వారా నిర్ణయించిన అధికారులు

హనుమకొండ/వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రిజర్వేషన్ల వివరాలను శనివారం అధికారికంగా విడుదల చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ శుక్రవారం జీవో 9 జారీ అయిన మేరకు రెండు జిల్లాల్లో రిజర్వేషన్లను అధికారులు డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. కులగణన సర్వే ప్రకారం 68.2శాతం మేరకు పెరిగిన బీసీల జనాభా నిష్పత్తి ప్రాతిపదికగా జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీల విషయంలో 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకున్నారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా పరిధిలోని 12 గ్రామీణ మండలాల పరిధిలోని మొత్తం 12 జడ్పీటీసీ, 12 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలులోకి కావడంతో గతంలోకన్నా వారికి రిజర్వు అయిన స్థానాల సంఖ్య రెండు అదనంగా పెరిగాయి. గతంలో మూడు స్థానాలు ఉండగా, ప్రస్తుతం అయిదు అయ్యాయి. గతంలో ఎస్సీలకు 5 ఉండగా రెండుకు తగ్గింది. ఎస్టీలకు గతంలో లాగానే ఈసారి కూడా ఒక్క స్థానం కూడా దక్కలేదు. జనరల్ స్థానాలు నాలుగు యథాతథంగా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
ఆత్మకూరు	బీసీ జనరల్	బీసీ (జనరల్)
భీమదేవరపల్లి	బీసీ మహిళ	బీసీ (మహిళ)
దామెర	బీసీ జనరల్	బీసీ(మహిళ)
ధర్మసాగర్	జనరల్ మహిళ	జనరల్ (మహిళ)
ఎల్కతుర్తి	ఎస్సీ జనరల్	ఎస్సీ(మహిళ)
హసన్‌పర్తి	ఎస్సీ మహిళ	ఎస్సీ (జనరల్)
ఐనవోలు	ఎస్సీ జనరల్	ఎస్సీ (జనరల్)
కమలాపూర్	బీసీ మహిళ	బీసీ (జనరల్)
నడికుడ	జనరల్	జనరల్
పరకాల	జనరల్	జనరల్
శాయంపేట	బీసీ జనరల్	బీసీ (జనరల్)
వేలేరు	జనరల్ మహిళ	జనరల్ (మహిళ)


డ్రా తీస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

డ్రా ద్వారా మహిళా రిజర్వేషన్లు ఖరారు

ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో మహిళలకు సంబంధించిన రిజర్వేషన్లను కలెక్టర్ స్నేహ శబరీష్ డ్రా తీయడం ద్వారా ఖరారు చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో కలెక్టర్ 12 ఎంపీపీ, 12 జడ్పీటీసీ స్థానాలల్లో మహిళా స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లను డ్రా తీశారు. ముందుగా ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ల డ్రా తీయగా, అనంతరం జడ్పీటీసీ స్థానాల డ్రా తీశారు. రిజర్వేషన్ల ప్రకటన, మహిళా రిజర్వేషన్ స్థానాలకు డ్రా ప్రక్రియ మొత్తం వీడియో తీశారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో రవి, డీఆర్‌డీవో మేన శ్రీను, డీటీవో శ్రీనివాస్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, కొలను సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిశాంత్, రజనీకాంత్, శ్యామ్ సుందర్, కొట్టే ఏసోబు, ప్రవీణ్ కుమార్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీ, వార్డుల రిజర్వేషన్లు ఖరారు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల వారీగా సర్పంచ్, ఎంపీటీసీ, వార్డులకు రిజర్వేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారులు ఖరారు చేశారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 12 మండలాలకు సంబంధించి 210 సర్పంచ్, 129 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లను ప్రకటించి, ఇందులో మహిళా రిజర్వేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఆర్‌డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్, ఆయా మండలాల ఎంపీడీవోల సమక్షంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ ఖరారు చేశారు. అదే విధంగా జిల్లాలో మొత్తం 1,986 వార్డు స్థానాల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేశారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు అధికారులు రిజర్వేషన్లను కేటాయించారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన 11 ఎంపీపీ, 11 జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామిరెడ్డి ఆధ్వర్యంలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, సాంఘిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన (ఎస్‌ఈఈఈపీసీ) ప్రకారం బీసీ రిజర్వేషన్ నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 11 జడ్పీటీసీ స్థానాలకు ఎస్సీలకు 2 స్థానాలు, ఎస్టీలకు 2 స్థానాలు, బీసీలకు 5 స్థానాలు, జనరల్ 2 స్థానాలు కేటాయించారు. వీటిలో 5 స్థానాలను మహిళలకు కేటాయించారు. ఇక 11 ఎంపీపీ స్థానాలకు గాను ఎస్సీలకు 2 స్థానాలను, ఎస్టీ 2, బీసీలకు 5, జనరల్ స్థానాలు 2 కేటాయించారు. వీటిలో సైతం 5 స్థానాలను మహిళలకు కేటాయించినట్లు అదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను గెజిట్‌లో ప్రచురిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదలైన సందడి

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. రిజర్వేషన్లపై ఉత్కంఠ తొలగడంతో అన్ని పార్టీల ఆశావహులు ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం అవుతున్నారు. ఏ స్థానం ఏ వర్గానికి రిజర్వు అయింది, జనరల్, మహిళల స్థానాల విషయంలో స్పష్టత రావడంతో రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నాయి. ఆశావహులు కూడా తమ గాడ్‌ఫాదర్లను ఆశ్రయించి ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టారు. ఇంకా కొన్ని గంటల్లో ఎన్నికల షెడ్యూల్ జారీకానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతున్నది. ప్రభుత్వం తొలుత జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయానికి రావడంతో ప్రాదేశిక ఎన్నికలపై దృష్టి పెట్టిన ఆశావహులు ఆ దిశగా పావులు కదడం మొదలు పెట్టారు. ఆశావహుల్లో చాలామంది ఇప్పటికే గ్రామాల్లో పరోక్షంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన తర్వాత ఇది మరింత జోరందుకోనున్నది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల్లో ప్రాదేశిక ఎన్నికల జోష్ అప్పుడే కనిపిస్తోంది. ఈ పార్టీ నేతల్లోనే పోటీ తీవ్రంగా ఉండనున్నది. ఎమ్మెల్యేలు రిజర్వేషన్ల వివరాలను తెప్పించుకొని అభ్యర్థుల ఎంపిక విషయంలో స్పష్టతకు రావడానికి కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా బీసీ సీట్లు పెరిగినందు వల్ల వారిలో గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో పడ్డారు. ఎమ్మెల్యేలు ఈ పాటికే ఆశావహుల్లో గెలుపు సత్తా కలిగిన నేతల వివరాలను సేకరించి పెట్టుకున్నట్టు తెలిసింది.

19న విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు

వరంగల్ కార్పొరేషన్/వడ్డెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు అక్టోబరు 19న నిర్వహించనున్నట్టు ఎన్నికల నిర్వహణ అధికారులు ఆర్.బుచ్చయ్య, జి.నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలు హనుమకొండ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లోని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. అక్టోబరు 4న నామినేషన్లు, 5న నామినేషన్ల పరిశీలన, జాబితా ప్రకటన, 7వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 19న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రక్రియతో పాటు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తారని వారు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విశ్రాంత పోలీసు అధికారులు, అర్హులైన సభ్యులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పలువురికి గాయాలు

మడికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన శనివారం మడికొండలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పకు చెందిన ఆటోడ్రైవర్ ఎం.డి.రబ్బానీ తన ఆటోలో కొందరు ప్రయాణికులను తీసుకుని మడికొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ దాటగానే ఆటో వీల్ ఊడిపోయి ఆగిపోయింది. అదే సమయంలో వెనుకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ పనులను వేగవంతం చేయాలి

వీసీలో ఆదేశించిన సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలు ఉంటే తెలియజేసే ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ పనులను వేగవంతం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి 16 సర్కిళ్ల విద్యుత్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి శనివారం ఆయా సర్కిళ్ల ఎస్‌ఈ, డీఈ, డీఈ టెక్నికల్, డీఈ యంఆర్‌టీ, ఎస్‌ఏలతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ ద్వారా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని పునరుద్ధరణ పనులను వేగవంతం చేయవచ్చన్నారు. 11 కేవీ ఫీడర్‌లను వేరు చేయడం ద్వారా ఫీడర్‌లోని అంతరాయాలను తగ్గించవచ్చన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డిజిటలైజేషన్ చేయడం ద్వారా ఎంత లోడ్ పడుతుందో సులువుగా తెలుసుకోవచ్చని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు భారం పడకుండా తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆటోమేటిక్ రీడింగ్ తీసుకునే హెచ్‌టీ సర్వీసులకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం పనుల పురోగతిపై చర్చిస్తూ సబ్ స్టేషన్‌లను స్కాడాకు అనుసంధానించడం ద్వారా విద్యుత్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకొని సత్వరమే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. రెవెన్యూ కలెక్షన్‌లను 100 శాతం వసూళ్ల చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు సదరల్‌లాల్, అశోక్, వెంకటరమణ, సీజీఎం చరణ్‌దాసు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కట్ర్యాలలో కొండచిలువ కలకలం


చెరువులో లభ్యమైన కొండచిలువ

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్ర్యాల గ్రామంలో మత్స్యకారుడి వలకు కొండచిలువ చిక్కడం కలకలం సృష్టించింది. శనివారం స్థానిక ఊర చెరువులో దేశబోయిన కుమార్ చేపల వలను తీస్తుండగా అందులో కొండచిలువ చిక్కుకుంది. రాత్రి చెరువులో వల వేసి, ఉదయం తీయడం మత్స్యకారులు రోజువారీగా చేస్తుంటారు. ఈ తరుణంలోనే వలను తీస్తుండగా అప్పటికే వలలో చిక్కుకున్న 10 ఫీట్ల కొండ చిలువ ఊపిరి ఆడక చనిపోయింది. దీంతో దానిని మత్స్యకారుడు వెలికి తీశాడు. చనిపోయిన కొండ చిలువను చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చారు.

కిడ్నీలోని 1,820 రాళ్ల తొలగింపు

- క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం
- యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అత్యంత క్లిష్టమైన అరుదైన కిడ్నీ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసి ఒకే కిడ్నీ నుంచి 1,820 రాళ్లను తొలగించినట్లు హనుమకొండలోని శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్ వైద్యుడు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా లింగాల గణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన చెందిన దినసరి కూలీ కడకండి పరశురాములు ఈనెల 23న కిడ్నీ నొప్పితో తమ ఆస్పత్రిలో చేరాడని తెలిపారు. ఈ కేసు డూప్లెక్స్ మొయిటీ (ఒకే కిడ్నీలో ద్వంద మూత్రపిండం) కిడ్నీలో 1,820 రాళ్ల ఉన్నాయని నిర్ధారించి ఆ తరువాత మల్టీ ట్రాక్ పీసీఎన్‌ఎల్ అనే పద్ధతిలో ఒకే సిట్టింగ్‌లో మొత్తం రాళ్లను తొలగించినట్లు వెల్లడించారు. రోగి తమ వద్దకు రాక ముందు హనుమకొండ, హైదరాబాద్‌లాంటి నగరాల్లోని అనేక ఆస్పత్రులను సంప్రదించగా అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ అని, రెండు నుంచి మూడుసార్లు ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, అయినప్పటికీ రాళ్ల మొత్తం తొలగించే అవకాశం లేదని స్పష్టం చేశారని తెలిపారు. ఇవన్నీ చేసేందుకు రూ.3.5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పడంతో రోగి భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. ఆ తరువాత తమ ఆస్పత్రిని సంప్రదించగా ఆరోగ్యశ్రీలో ఉచితంగా కిడ్నీలోని 1,820 రాళ్లను తొలగించినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రోగిని 72 గంటలలోపు పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేయగా రోగితోపాటు రోగి బంధువులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.


మాట్లాడుతున్న యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ


సీసీ కెమెరాలో రికార్డు అయిన నిందితుడు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఓ మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకుపోయిన ఘటన జరిగింది. శనివారం సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపిన ప్రకారం... ఎక్సైజ్‌కాలనీకి చెందిన ఎం.సరస్వతి ఇంటి సమీపంలో ఉన్న కిరాణం షాపులో పని చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి పుట్టిన రోజు గిఫ్ట్‌ల కోసం వచ్చి వెళ్లాడని, పావుగంట తర్వాత ఆ వ్యక్తే మెస్‌డోర్ నుంచి వచ్చి సరస్వతి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు ఎత్తికెళ్లి ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు తెలిపారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంజిత్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేయండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

పూర్తిచేసిన స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి బండ్‌పై వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్మార్ట్‌సిటీ పనుల పరిశీలనలో భాగంగా శనివారం వడ్డెపల్లి, భద్రకాళి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తర్వాత పోతననగర్ శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ పథకంలో మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వడ్డెపల్లి బండ్‌పై టైల్స్‌తో పాటు గ్రావెల్‌ను గుంతలలో నింపాలన్నారు. ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఈఈ రవికుమార్, స్మార్ట్‌సిటీ పీఎంసీ ఆనందం పాల్గొన్నారు.


వడ్డెపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రపంచ రేబిస్ దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ సయుక్తాధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో రేబిస్ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రేబిస్ దినోత్సవం సందర్భంగా నివారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని పెట్‌పార్క్‌లో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. పశువైద్యశాఖ జేడీ రాధాకృష్ణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ అధికారి గోపాల్‌రావుతోపాటు డాగ్ బ్రీడర్స్ పాల్గొన్నారు.

సాంకేతికపరమైన వృత్తి నైపుణ్యం కీలకం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఐటీఐ కళాశాలలో ఏటీసీ సెంటర్ ప్రారంభం


ఏటీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికపరమైన వృత్తి నైపుణ్యం జీవన ప్రమాణాలకు చాలా కీలకమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రూ.22కోట్లతో ములుగురోడ్‌లోని ఐటీఐ కళాశాలలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను శనివారం వరంగల్ ఎంపీ కడియం కావ్యతోకలిసి ఎమ్మెల్యే నాయిని ప్రారంభించారు. ఈసందర్భంగా వర్చువల్‌లో రాష్ట్రంలోని 65 సెంటర్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడగా ఎమ్మెల్యే, ఎంపీ వీక్షించారు. కార్యక్రమంలో వరంగల్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చందర్, హనుమకొండ, కాజీపేట ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బలాన్నిచ్చే బతుకమ్మ ఫలహారాలు

- ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
- తొమ్మిది రోజులు తొమ్మిది రకాలు
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

వర్ధన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆడపడుచుల్లో బతుకమ్మ పండుగా ఆరోగ్యకాంతులను వెలిగిస్తోంది. బతుకమ్మ ఆడిన తర్వాత సద్ది పేరుతో 'ఇచ్చినమ్మ వాయినం... పుచ్చుకుంటినమ్మ వాయినం' అంటూ అతివలు ఫలహారాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటారు. వీటిలో అనేక పోషక విలువలు ఉన్నాయంటున్నారు వైద్యులు. ఆటపాటలు, మానసికోల్లాసమే కాదు శరీరానికి కావాల్సిన అనేక పోషకాలను ఫలహారాల రూపంలో బతుకమ్మ అందిస్తోంది.

బతుకమ్మ సద్దిలో ఐరన్

భారతీయ మహిళల్లో ఐరన్ లోపం కనిపిస్తోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రభావం పిల్లల్లోనూ ఉంటోంది. బతుకమ్మ వేడుకల్లో తయారు చేసుకునే సద్దిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల ఫలహారాలను తయారు చేస్తారు. ఇందులో సత్తుపిండి, సద్ద ముద్దలు, నవ్వులు, కొబ్బరి, పల్లిపొడి లేదా ముద్దలు తదితర ఫలహారాలు ఉంటాయి. ఇవన్నీ పండుగ సమయానికి చేతికి వచ్చే చిరుధాన్యాలు. వీటిని తింటే ఆరోగ్యకరమని పెద్దలు చెబుతున్నారు.





నువ్వుల ముద్దలు

బతుకమ్మ పండుగలో నువ్వులు ప్రాధాన్యం అంతాఇంతా కాదు. వీటితో పొడి చేస్తారు. నవ్వుల్లో ఎమినోయాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ముఖ్యమైనవి. జింక్, కాల్షియం ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది.

పెసర ముద్దలు

పెసళ్లను ఉడకబెట్టి బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు. ఇవి జీర్ణశక్తిని పెంచుతాయి. జీర్ణ సంబంధిత వ్యాధులనూ తగ్గిస్తాయి.

కొబ్బరి పొడి, పెరుగన్నం, పులిహోర

కొబ్బరిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మహిళల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. పెరుగన్నం, పులిహోర ఇటీవల సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలు కలుపుతున్నారు. పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు. చింతపండు గుజ్జుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. పెరుగులో పోషక విలువలు మెండు. అన్నం కలిపి కమ్మనైన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇందులో ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లా విటమిన్, విటమిన్ బి-6, బి12, వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కొవ్వు తక్కువగా ఉండే పెరుగులో లాక్టోబసిల్లై అధికంగా ఉంటుంది. అపెండిసైటీస్, డయేరియా, డిసెంట్రీ వంటి వ్యాధులకు కారణమయ్యే బాక్టీరియాను లాక్టిక్ యాసిడ్ నాశనం చేస్తుంది. పెరుగులో ఉండే విటమిన్ నిరోధక శక్తిని పెంచుతుంది.

సద్దుల్లో పోషకాలు

బతుకమ్మ ఉత్సవాలు వస్తే అందరికీ సద్ద ముద్దలు (సజ్జ ముద్దలు) గుర్తుకొస్తాయి. ఈ పేరుతోనే పెద్దబతుకమ్మ సద్దుల బతుకమ్మ అని పేరు వచ్చిందని చెబుతారు. సందె వేళలో చేసే బతుకమ్మ కాబట్టి సద్దుల బతుకమ్మ అంటారని మరో చరిత్ర. సజ్జలను పిండిగా పట్టించి బెల్లం కలిపి ముద్దలు చేస్తారు. కొందరు వీటికి నెయ్యి కూడా కలుపుతారు. వీటిలో పీచు పదార్థాలు ఎక్కువ. కార్బోహైడ్రేట్స్ తక్కువ. ప్రోటీన్లు, కాల్షియం అధికంగా ఉంటాయి. త్వరగా జీర్ణమవుతుంది. దీనికి బెల్లం కలపడంతో ఐరన్ శాతం పెరిగి మహిళల రుతుక్రమ సమస్య నివారణ, గొంతు నొప్పి తగ్గిస్తుందని వైద్యులు వివరిస్తున్నారు.

పల్లి పిండి

పల్లిపిండి శరీర ఎదుగుదలలో అత్యంత ప్రధానమైనది. అధిక ప్రోటీన్లతో పాటు రుచికరంగా ఉంటాయి. చాలామంది ఇష్టంగా తింటారు. దీనికి బెల్లం జోడించడంతో పోషకాలు లభిస్తాయి.

పోషకాలు పుష్కలం


డాక్టర్ బెతం నర్సింహస్వామి, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్



బతుకమ్మ పండుగకు తయారు చేసే సత్తుపిండిలో వ్యాధి నిరోధక శక్తి పెంచే పోషకాలు ఉంటాయి. రుచికరంగా ఉండే సత్తుపిండి పిల్లలకు ప్రోటీన్లు అందిస్తాయి. కండరాల పటిష్ఠత, ఎముకల గట్టితనం, పిల్లల ఎదుగుదల... ఇలా అనేక ఉపయోగాలున్నాయి. సంప్రదాయ పిండి వంటలను ప్రతిఒక్కరూ తినాలి. బతుకమ్మ ఆరోగ్యాన్ని పంచే ప్రత్యేకమైన పండుగ.

జాతి వైరం విడిచి..

- పిల్లి పిల్లను సాకుతున్న తల్లి కోడి
- మాతృ ప్రేమను పంచుతున్న కోడి



నెక్కొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా జంతువుల మధ్య వైరం ఉండడం సహజం. ఆహారం మొదలు ప్రతీ విషయంలో ఒక జాతి జంతువులు మరో జాతి జంతువులతో పొట్లాటకు దిగుతుంటాయి. కోడి పిల్లలను పిల్లులు వెంటాడి, వేటాడి తింటుంటాయి. కానీ వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బీసీ కాలనీకి చెందిన పొట్లపల్లి వీరస్వామి ఇంట్లో ఉంటున్న పిల్లి తల్లి రెండు నెలల కిందట చనిపోయింది. అప్పటి నుంచి కోడి తన పిల్లలతో పాటు పిల్లి పిల్లను సాకుతోంది. రాత్రి సమయంలో పిల్లి కోడి వద్దనే నిద్రిస్తోంది. జాతి వైరం మరిచి పిల్లి పిల్లను తల్లి కోడి సాకుతూ మాతృ ప్రేమను చాటుకుంటోంది. ఈ విషయంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క ఓటుకు రిజర్వేషన్ కేటాయింపు..!

ఆశాలపల్లి గ్రామంలో ఎస్సీకి రిజర్వు

సంగెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఒక్కరు మాత్రమే ఉన్నారు. పోటీ చేద్దామన్నా ప్రత్యర్థి కూడా ఆ సామాజిక వర్గం నుంచి లేకపోవడం గమనార్హం. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఆశాలపెల్లి గ్రామం సర్పంచ్ రిజర్వేషన్ల కింద ఎస్సీ మహిళకు కేటాయించారు. కానీ, అక్కడ ఎస్సీ ఓటర్లు ఒక కుటుంబం మాత్రమే ఉంది. మన్నెం మల్లమ్మ అనే మహిళకు ఇక్కడి ఓటు హక్కు కలిగి ఉండగా, భర్త వెంకటయ్య ఇటీవల చెరువులో పడి మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా, వారి వివాహాలు సైతం చేశారు. మల్లమ్మ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇక దీనిపై గ్రామస్థులు సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక్క ఓటు మాత్రమే ఉన్న వర్గానికి ఎలా రిజర్వేషన్ కేటాయిస్తారని, దీన్ని రద్దు చేయాలని కోరారు. ఇక ఇదే మండలంలోని వంజరపల్లి గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎవ్వరూ లేకపోయినా, సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. దీంతో గ్రామస్థులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పండుగల వేళ సమ్మెలో టైలర్ వర్కర్లు

- కూలీ రేట్లు పెంచాలని డిమాండ్
- డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతి



డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట గుమికూడిన టైలర్ వర్కర్లు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ముందు హనుమకొండలోని టైలర్ వర్కర్లు శనివారం సమ్మె చేపట్టారు. రెండేళ్లకోసారి వర్కర్ల కూలీ రేట్లను పెంచడం ఆనవాయితీగా వస్తుండగా ఈ యేడు టైలర్ షాపుల యాజమాన్యాలు వర్కర్ల కూలీ రేట్లను పెంచలేదు. కూలీరేట్లను పెంచాల్సిందిగా నాలుగు నెలల నుంచి యాజమాన్యాలను వేడుకుంటున్నా పెంచడం లేదని వర్కర్లు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించారు. డిప్యూటీ కమిషనర్ ఇరు వర్గాలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేసి సయోధ్య చేకూర్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

కాగా, అన్ని పండుగలకంటే బతుకమ్మ, దసరా పండుగలకు అందరు కొత్త దుస్తులు ధరించడం సంప్రదాయంగా వస్తోంది. టైలర్లకు కూడా ఈ పండుగల సమయంలో విపరీతమైన గిరాకీ ఉంటుంది. టైలర్ షాపుల యాజమాన్యాలు షర్టుకు రూ.700, ప్యాంటుకు రూ.900 తీసుకుంటూ తమకు మాత్రం షర్టుకు రూ.174, ప్యాంటుకు రూ.280 మాత్రమే చెల్లిస్తున్నారని వర్కర్లు వాపోతున్నారు. రెండేళ్ల కిందట షర్టుకు రూ.19, ప్యాంటుకు రూ.31 పెంచామని, ఈ యేడు కూడా అదే రేట్లను మళ్లీ పెంచుతామని చెబుతున్నా.. వర్కర్లు వినిపించుకోవడం లేదని యజమానులు తెలిపారు. తమకు కూడా మెటీరియల్‌కు, షాపుల అద్దెలు పెరిగాయని, గిరాకీ కూడా తక్కువైందని అంటున్నారు. రేట్లు ఎక్కువగా పెంచితే తమకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా కూర్చొని మాట్లాడుకుందామని వర్కర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. సమ్మె వల్ల యాజమాన్యాలు, వర్కర్లు ఇరు వర్గాలు నష్టపోతారని, వర్కర్లు గుర్తించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

పర్యాటక ప్రాంతాలకు నెలవు.. వరంగల్

- ఆర్‌డీవో రమేష్ రాథోడ్
- హరిత కాకతీయలో పర్యాటక ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్‌డీవో రమేష్ రాథోడ్



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చరిత్రను, సంస్కృతిని తెలిపే గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్న ప్రదేశం ఉమ్మడి వరంగల్ జిల్లా అని హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి సూచికగా ఎదుగుతుందని అన్నారు. రామప్ప, లక్నవరం చెరువులు, మేడారం, వేయిస్తంభాల ఆలయాలు, ఖిలా వరంగల్ లాంటి పర్యాటక ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ.. టూరిజం పొటెన్షియల్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధిపర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పర్యాటక ఆకర్షణలు పెంచడానికి, దేశ విదేశీ పర్యాటకులను వరంగల్‌కు రప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మిస్‌వరల్డ్‌లో పాల్గొన్న సుందరీమణులను నగరానికి తీసుకు రావడం వల్ల జిల్లా కీర్తి విశ్వవ్యాప్తమైందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పర్యాటక ఉత్సవాల్లో భాగంగా తాడూరి రేణుక శిష్య బృందం నిర్వహించిన నృత్యాలు అలరించాయి. పర్యాటక ప్రాంతాలను తెలిపే గీతంతోపాటు బతుకమ్మ ప్రత్యేక గీతానికి కళా బృందం చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు హరిత కాకతీయ మేనేజర్ శ్రీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, కుమారస్వామి, ధన్‌రాజ్, కుసుమ సూర్యకిరణ్, లోకేశ్వర్, చిరంజీవి, శరత్, సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదం.. సీతాఫలం..

- ఒత్తిడిని తగ్గించి, నిద్రను మెరుగుపరిచే ఔషధం
- రోగ నిరోధక శక్తిని పెంచే మధురఫలం
- పేదోడి ఆపిల్‌గా దీనికి పేరు..
- నగరంలో ఇప్పటికే ప్రారంభమైన అమ్మకాలు



గ్రామాల నుంచి అమ్మకానికి తీసుకొచ్చిన సీతాఫలాలు

మామునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు అందించే అద్భుతమైన ప్రసాదం పండ్లు. ఆరోగ్యానికి అంతకు మంచిన ఔషధాలు ఉండవు అంటే అతిశయోక్తి కాదు. సీజన్ వారీగా లభించే పండ్లలో సీతాఫలం ఒకటి. వాటికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. బాగా పండిన సీతాఫలం లోపల తియ్యని గుజ్జుతో నల్లని విత్తనాలతో మధురమైన రుచిని కలిగి ఉంటుంది. సహజంగా పండిన సీతాఫలాల రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే.. శీతాకాలంలో మాత్రమే కాసే సీతాఫలం కోసం ఏడాది మెత్తం ఎదురు చూసే వారున్నారు. మామిడి పండ్లకు ఏమాత్రం తీసిపోని క్రేజ్ సీతాఫలాలది. కేవలం రుచికే కాదు.. ఆరోగ్యాన్ని చేకూర్చడంలో కూడా సీతాఫలం ఓ మెట్టు పైనే ఉంటుంది. సీతాఫలం తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మం మెరుస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుంది.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

పేదోడికి అందుబాటులో ఉండి ఉత్తమ పోషక విలువలు కలిగిన ఫలం సీతాఫలం. దీనికి పేదోడి ఆపిల్ అనికుడా పేరొచ్చింది. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఇందులోని పోషకాలు సహాయపడుతాయి. దీనిలో ఉండే బి6 విటమిన్‌తో శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం పొందవచ్చు. ఎసిడిటీని తగ్గిస్తుంది. వీటిలో కెరొటినాయిడ్స్, విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు, వనాయిడ్స్ ఎక్కువ మొత్తంలో ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అంతేకాక చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. జ్వరం ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. అధిక బరువుతో బాధపడేవారు రోజూ ఒక సీతాఫలాన్ని తినడంద్వారా త్వరగా సన్నబడుతారని నిపుణులు చెపుతున్నారు.

ధర తక్కువే..



శీతాకాలంలో మాత్రమే లభించే సీతాఫలాలను గ్రామీణ ప్రాంతాలనుంచి తీసుకువచ్చి పట్టణ శివారు ప్రాంతాల్లో అమ్ముతుంటారు. ఇంకా సీజన్ ఆరంభం కాకముందే ఈ ఏడాది సీతాఫలం అమ్మకాలు చాలా తక్కువ ధరలకే లభిస్తున్నాయి. పట్టణ ప్రజలు, వీటి పోషక విలువలు తెలిసిన వారు ఇప్పటికే కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో సీతాఫలం రేటు రూ.15 నుంచి రూ.20 వరుకు అమ్ముతున్నారు. కిలోల చొప్పున కేజీకి రూ. 70 నుంచి రూ.85 రూపాయల వరకు అమ్ముతున్నారు. మిగతా పండ్లతో పోలిస్తే చాలా తక్కువ ధరకే లభించడం విశేషం.

పోషకాలు పుష్కలం..

సీతాఫలాల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని ఇష్టపడనివారు ఉండరు. ఇందులో ఉండే విటమిన్-సీ, విటమిన్ బి6, ఫైబర్ కాల్షియం, ఆంటీ ఆక్సిడెంట్లు, పీచు పదర్థాలు, ఖనిజ లవణాలు, మెగ్నీషియం, మాంసకృత్తులు పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్తకణాలను ఉత్పత్తి చేస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలు తొలగించడంలో సహాయపడుతాయి.

29వ తేదీనే సద్దుల బతుకమ్మ

- శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ సంప్రదాయ పర్వం
- పండితుల ఏకాభిప్రాయం



మాట్లాడుతున్న సుదర్శనాచార్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ విషయంలో గందరగోళం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 29వ తేదీనే జరుపుకోవాలని కొందరు, 30న జరుపుకోవాలని మరికొందరు పండితులు ఏకాభిప్రాయానికి రాని నేపథ్యంలో శనివారం అనేక మంది ప్రముఖులు ఈ విషయంపై స్పందించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడిగా చెలామణిలో ఉన్న ఊకల్ నాగేంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు ప్రతిస్పందించారు. శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ విషయంలో సంప్రదాయ పర్వం కాబట్టి మెజార్టీ మహిళల అభిప్రాయమే ప్రధానమన్నారు. కచ్చితంగా సద్దుల బతుకమ్మను 29న సోమవారం జరుపుకోవడం ప్రాంతీయ ఆచారమని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ విషయంలో తిథి వార నక్షత్రం, యోగం, కరుణం లాంటి నియామకాలు ఉండవన్నారు. 6వ రోజు అరెంగా భావిస్తు బతుకమ్మను కొంతమంది ఆడరని, అదే క్రమంలో 9వ రోజు నిమజ్జనోత్సవం జరిగి తీరాలన్నది ఆయన స్పష్టం చేశారు. బతుకమ్మ విషయంలో ఎవరెన్ని చెప్పినా 9వ రోజు నిమజ్జనం చేయడం సనాతన సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు.

అలాగే ఎవరెన్ని చెప్పినా సంప్రదాయ నియమం ప్రకారం 29వ తేదీనే మహిళలు సద్దులు జరుపుకొని తీరాలని పండితులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి, వరంగల్‌లోని ఆకారపు గుడి ప్రధాన అర్చకుడు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లంకా శివకుమార్, రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షులు తాండ్ర నాగేంద్రశర్మ, మరో ప్రముఖ వేద పండితుడు గ్రేటర్ హైదరాబాద్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గన్ను సత్యనారాయణశర్మ, హనుమకొండలోని పద్మాక్షి ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకరశర్మ, ఐనవోలు ఆలయ వేద పండితుడు మధుశర్మ, వరంగల్ నగరంలోని ప్రముఖ జ్యోతిష్యకారుడు సుమన్ శర్మ, జనగామలోని శ్రీ వెంకటేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, సిద్ధాంతి సంపత్‌కుమారకృష్ణమాచార్యులు లాంటి అనేక మంది ప్రముఖులు బతుకమ్మ విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేదన్నారు. సోషల్ మీడియా ద్వారా ఎవరికి వారు సద్దుల బతుకమ్మ విషయంలో 29వ తేదీన జరుపుకోవాలని ప్రజలకు తెలియజెప్పారు. ఆదివారం హనుమకొండలోని బ్రాహ్మణ భవన్‌లో పండితులంతా సమావేశమై ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు సమావేశం అవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పరకాల పట్టణంలోని మునిసిపాలిటీ మెజార్టీ మహిళల, పండితుల అభిప్రాయం ప్రకారం 29న సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని కమిషనర్ పేరిట మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడటం గమనార్హం.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై బతుకమ్మకు బొట్టు పెట్టి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగినులు పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో వైభవంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారన్నారు. జిల్లాలోని మహిళలందరు ఈ సద్దుల బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ రాజేందర్, టీఎన్‌జీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి సోమయ్యతోపాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘా జేఏసీ నాయకులు, టీఎన్‌జీఓస్ నాయకులు పుల్లూరు వేణుగోపాల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు



బతుకమ్మ వేడుకల్లో టీఎన్జీవో నాయకులు



బతుకమ్మ వేడుకల్లో ఫైర్ గన్ పేల్చుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఈనెల 30న సద్దుల బతుకమ్మ

ప్రభుత్వం అధికారికంగా ప్రకటన

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మను ఈనెల 30వ తేదీన జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామక్రిష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగా ప్రభుత్వం ప్రకటించింది తెలిసిందే. ఈ మేరకు ఈనెల 30న సద్దుల బతుకమ్మ పర్వదినమని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఆ రోజు మహిళలు సద్దుల బతుకమ్మ జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆ ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు. కాగా, పండితులు, పంచాంగకర్తలు.. శాస్త్రం, సంప్రదాయం ప్రకారం ఈనెల 29నే సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని సూచించగా, ప్రభుత్వం 30న సద్దులు అని ఉత్తర్వులు విడుదల చేయడం విశేషం.



రెండోరోజూ మద్యం దరఖాస్తులు నిల్

కొత్త మద్యం పాలసీలో రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తులకు

ఫీజు పెంచినందుకా ? ముహుర్తం లేనందుకా ?

వరంగల్ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి రెండు రోజులైనప్పటికీ ఆబ్కారీ అధికారులు ఏర్పాటు చేసిన దరఖాస్తు కౌంటర్లు వెలవెలబోతున్నాయి. వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు. గతంలో టెండర్ ఫీజు రూ.2లక్షలు(నాన్ రిఫండబుల్)ను కొత్త మద్యం పాలసీలో రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తులకు వెనకాడుతున్నారా..? లేదా అదృష్టం దక్కించుకోవడానికి మంచి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారా? అనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ప్రతీసారి దరఖాస్తుల స్వీకరణ ముగుస్తున్న తరుణంలో అత్యధికంగా దరఖాస్తులు వస్తుంటాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో వస్తాయా..? రూ.2లక్షలు ఉన్న ఫీజు రూ.3లక్షలకు పెంచినందుకు వెనకాడతారా? అనేది వేచి చూడాలి.

శాకాంబరిగా రుద్రేశ్వరీ అమ్మవారు

6వ రోజుకు చేరిన శరన్నవరాత్రి వేడుకలు



శాకాంబరి పూజల్లో పాల్గొన్న భక్తులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనేక ప్రాంతాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు జరుగుతున్నాయి. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో నిర్వహిస్తున్న రుద్రేశ్వరి దేవి శరన్నవరాత్రి వేడుకలు 6వ రోజుకు చేరుకున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో శనివారం భవాని మాతగా అలంకరింపజేశారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికురాలు బొమ్మిరెడ్డిపల్లి గాయత్రిదేవి, కృష్ణవేణిలు అందించిన 21 రకాల కూరగాయలతో అమ్మవారిని శాకాంబరిదేవీగా అలంకరించారు. వందలాది భక్తులకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ వారు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కుండె అరుణ రాజ్‌కుమార్ శిష్యబృందంచే కూచిపూడి సంప్రదాయాల నృత్య ప్రదర్శన నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఈవో డి.అనిల్ కుమార్ పర్యవేక్షించారు.

మహాలక్ష్మి అలంకరణలో దుర్గామాత

వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. పుష్పాలంకరణలు, అభిషేకాలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు. శనివారం హనుమకొండ 56వ డివిజన్‌లోని విష్ణుపురి కాలనీలోని మండపంలో దుర్గామాతను మహాలక్ష్మిగా అలంకరించారు. రుత్వికులు ప్రయాగ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహాలక్ష్మీపూజ భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు - స్రవంతి దంపతులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దుర్గామాతను కొలిచారు. డివిజన్‌లోని దేవరాజ్ కాలనీలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మహిళలు కోలాటంతో భక్తి పాటలు పాడారు. వడ్డేపల్లిలోని సీతారామచంద్రస్వామి గుడిలో కటకం ప్రసాద్ ఆధ్వర్యంలో దుర్గామాత వేడుకలు నిర్వహిస్తున్నారు.



కడిపికొండలో శాకాంబరి అలంకరణలో అమ్మవారు

కడక్ షార్ట్ ఫిల్మ్ వెబ్ సిరీస్ విడుదల

వడ్డేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కడక్ షార్ట్‌ఫిల్మ్ వెబ్ సిరీస్ వాల్‌పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షార్ట్‌ఫిల్మ్‌లను సైతం ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సమావేశంలో షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు సనత్‌కుమార్, ఎడిటర్ కందగట్ల వికాస్, నటులు జంగా రఘువీర్‌యాదవ్, నాగబెల్లి అరుణ్‌కుమార్, లావణ్య, చంద్రశేఖర్, కేపీ రావల్‌తో పాటు జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న పాల్గొన్నారు.

'పంచ పరివర్తన్' ద్వారా దేశ హితం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం. దేవేందర్

హసన్‌పర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అన్ని వర్గాల వారు ఐకమత్యంగా ఉండాలనే లక్ష్యంతోనే పంచ పరివర్తన్‌కి ఆర్ఎస్ఎస్ శ్రీకారం చుట్టిందని హిందూ జాగరణ మంచ్ అఖిల భారతీయ సంఘటన మంత్రి దేవేందర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హసన్‌పర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. సామాజిక సమరత, పర్యావరణం, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ పౌర నియమాలు అనే ఐదు విషయాలను సమాజంలో ప్రతి పౌరుడు తెలుసుకొని వాటి ఆచరణకు కృషి చేయాలన్నారు. వీటి ద్వారా సమాజంలో సమూలమైన మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వారాల సంఘం జిల్లా కోశాధికారి పావుశెట్టి సాంబయ్య, ఆర్ఎస్ఎస్ విభాగ్ అధ్యక్షులు ప్రొఫెసర్ చిలకమారి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోనే ఉద్యోగ అవకాశాలు

ఎస్వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెరుగైన విద్యతోనే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయని ఎస్వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారం ఎస్వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 26 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. నైపుణ్యం కలిగిన విద్యను అందించడంలో ఎస్వీఎస్ విద్య సంస్థలు ఎప్పుడు ముందుంటాయని అన్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ రినాల్ట్ నిసాన్ అనే కంపెనీలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 26 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఇందులో 13 మంది ట్రిపుల్‌ఈ విద్యార్థులు 11 మంది ఈసీఈ విభాగం విద్యార్థులు, ఇద్దరు మెకానికల్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఏకే.రాథోడ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సీహెచ్.సుశాంత్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నియామక పత్రాలను ఇస్తున్న తిరుమల్‌రావు

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

- ఆయన సేవలు కొనియాడిన వక్తలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

రెడ్డికాలనీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో శనివారం రెడ్డికాలనీలోని సంఘం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సభ్యులతో ఏకశిల పార్కు ర్యాలీగా చేరుకొని అక్కడి నుంచి సుబేదారిలోని ఫారెస్ట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించిన మహా నాయకుడని తెలిపారు. ఆయన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి జేఏసీ నాయకులు బైద్యం రాజగోపాల్, బత్తుల రమేశ్‌బాబు, గుర్రపు రమేశ్, నరేంద్ర బాబు, మహేందర్, మహేందర్, సురేశ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాజు, నరేశ్, నవీన్‌కుమార్, సారంగపాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి: కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని హనుమకొండ పద్మశాలీ పరపతి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ ఫారెస్టు ఆఫీసు జంక్షన్ వద్ద నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి భారత పద్మశాలి సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం పూల మాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నేతలు చందా మల్లయ్య, బిల్లా రవీందర్, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట సోమిడి 62వ డివిజన్, కాజీపేట చౌరస్తాలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రపు కోటేశ్వర్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు.



బీఆర్ఎస్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, పార్టీ నాయకులు

రాంనగర్: కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకొని శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో ఆయన చిత్రపటానికి టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మదుసూధన్, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్‌లాల్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పరిపాలన విభాగం భవన సముదాయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ గుణశేఖర్, అడిషినల్ డీసీపీలు రవి, సురేష్‌కుమార్, ప్రభాకర్‌రావు, బాలస్వామి, శ్రీనివాస్‌తోపాటు ఏసీపీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

హనుమకొండ టౌన్: హనుమకొండ బాలసముద్రంలోనీ బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ చీఫ్ విప్, పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినికాంత్, డివిజన్ అధ్యక్షులు చందర్, రాజు, మనోజ్, సదాంత్, కోటేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, విక్రం తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోపి కౌన్సిల్ హాల్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఇంచార్జీ ఎస్ఈ బి.మహేందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో పలాస రమేష్, ఇన్‌చార్జి సిటి ప్లానర్ రవీంద్ర రాడేకర్, అకౌంట్స్ అధికారి శివలింగం, డిప్యూటీ కమిషనర్‌లు రవీందర్, సమ్మయ్య, హెచ్‌వో లక్ష్మారెడ్డి, పాటు బల్దియా ఉద్యోగులు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకుని శనివారం కేయూ బీసీసెల్ నేతృత్వంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, పాలక మండలి సభ్యులు చిర్రా రాజు, డైరెక్టర్ బి.సతీశ్, డీన్లు ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, వరలక్ష్మి, ఆకుతోట శ్రీనివాసులు, కరుణాకర్‌రావు, జె.శ్రీనివాస్, తాటి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

మడికొండ : మడికొండలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బిల్ల రవీందర్, కామని మల్లేష్, నల్ల సురేష్, కేటిక సదానందం, వంగ రమేష్, పొట్లబత్తిని సారంగపాణి, నామని శివ, చిదురాల వెంకటేశ్వర్లు, ఆమంచ శ్రీనివాస్, నల్ల హేమంత్, కన్నె రాజేష్, గుర్రపు రమేష్, బిల్ల రాజ్‌కుమార్, నల్ల వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



కమిషనరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

బీసీ భవన్‌కు 1000 గజాల స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యేను కోరిన పద్మశాలి పరపతి సంఘాల జేఏసీ

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ భవన్‌కు 1000 గజాల స్థలం కేటాయించాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని పద్మశాలీ పరపతి సంఘాల జేఏసీ నాయకులు శనివారం కోరారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకుని బాలసముద్రంలోని ఏకశిలాపార్కు నుంచి సుబేదారిలోని ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వేడుకలలో పద్మశాలీ జేఏసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ పరపతి సంఘాల కన్వీనర్ వైద్యం రాజగోపాల్, అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు ఈగ మల్లేశం, మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు, భద్రకాళి దేవస్థానం డైరెక్టర్ బింగి సతీష్, కమలాపురం మార్కెట్ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సి రవీందర్, కమలాపురం సంఘం అధ్యక్షులు బొప్ప శివశంకర్, తౌ పద్మశాలి సంఘం నాయకులు గడ్డం భాస్కర్, గడ్డం కేశవమూర్తితో పాటు పెద్ద సంఖ్యల పద్మశాలి పరపతి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ జీవితం స్ఫూర్తిదాయకం

వరంగల్ ఎంపీ కడియం కావ్య

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం, ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం ఉద్యమించిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, పద్మశాలీ సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, కలెక్టర్, పద్మశాలి సంఘం నాయకులు

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కావ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమంలో లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివన్నారు. ఎన్నో దశాబ్దాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి కులగణనను రాష్ట్రంలో నిర్వహించేందుకు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బీసీ భవన్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ చందా మల్లయ్య బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, అధికారులు, పద్మశాలి సంఘం నాయకులు గడ్డం కేశవమూర్తి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ బస్‌స్టేషన్ కిటకిట

సెలవుల కారణంగా ఇళ్లకు బయలుదేరిన జనం



ప్రయాణికులతో రద్దీగా ఉన్న హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా సెలవులు రావడంతో హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణం ప్రయాణికులతో శనివారం రద్దీ ఏర్పడింది. పలు రూట్లల్లో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక బస్‌స్టేషన్ ప్రాంగణంలో గంటల తరబడి పడిగాపులు కాశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ ప్రాంగణం వరద నీటిలో మునగడంతో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఉప్పల్ వరకే నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని కంఠాత్మకూరు మాటువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బస్సులను రూట్ మార్చి నడుపుతున్నట్లు తెలిపారు. కటాక్షపూర్ మత్తడి పెరగడంతో సాయంత్రం సమయంలో బస్సులను తాత్కాలికంగా నిలిపి వేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. హనుమకొండ బస్టేషన్ నుంచి ఇతర రూట్లల్లో అన్ని సర్వీస్‌లు నడిపిస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయాణికులు సహకరించాలని ఆర్ఎం పేర్కొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

వడ్డేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 57వ డివిజన్ వికాస్ నగర్‌లో ఇటీవల వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుంచి వేంకటేశ్వర స్వామి, భూదేవి, శ్రీదేవితో పాటు ద్వారపాలకుల రాతి విగ్రహాన్ని వికాస్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పులి వీరారెడ్డి ఆధ్వర్యంలో తీసుకొచ్చారు. శనివారం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి మేళతాళాలు ,సన్నాయి మేళాల మధ్య భక్తులు భజన కీర్తనలు ఆలాపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మండడి యాదగిరి రెడ్డి, పంచవేణి గోపాల్‌రావు, అల్లం మల్లికార్జున్ రావు, తోట భిక్షపతి, చదువు వెంకటరమణారెడ్డి, నైనకంటి జనార్దన్‌రెడ్డి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని లష్కర్‌బజార్, పబ్లిక్‌గార్డెన్ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

మత్తడి పోస్తున్న పెద్ద చెరువు

హసన్‌పర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో హసన్‌పర్తి పెద్ద చెరువు పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో శనివారం పెద్ద చెరువు మత్తడి పడడంతో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ప్రత్యేకంగా గంగ పూజ చేశారు. ముదిరాజ్ కులస్తులు, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, బయ్య సదానందంతో పాటు పలువురు మత్స్య కార్మికులు చెరువు కట్ట వద్ద అలుగు పోస్తున్న మత్తడి వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

వడ్డేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ 59వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి తేళ్ల సుగుణ ఆధ్వర్యంలో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్ జంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చిత్రపటానికి బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకం చేశారు. తొలుత బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేతిడి దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పూరెళ్ల రవికిరణ్, కాంగ్రెస్ శ్రేణులు మండల సమ్మయ్య, బున్స నవీన్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తేళ్ల కిశోర్, జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, తమ్మల శోభారాణి, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, గొట్టి మహేందర్, సౌమ్య, కవిత పాల్గొన్నారు.



సీఎం చిత్రటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు



కోలాటం ఆడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తదితరులు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకల్లో భాగంగా శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఘనంగా మహిళా విద్యుత్ అధికారుల, సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి సందడిగా బతుకమ్మలతో ఆడి పాడారు. ఈ సందర్భంగా సీఎం వరుణ్‌రెడ్డి, ఆయన సతీమణి మున్సిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా విద్యుత్ అధికారులతో కలిసి చహత్ బతుకమ్మ కోలాటం ఆడారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ పసుపునూటి రాజ్‌కుమార్ కుటుంబానికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య చేతుల మీదుగా మిత్రులు ఆర్థికసాయన్ని శనివారం అందజేశారు. వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు, మిత్రులు దాతలు ఇచ్చి విరాళం మొత్తం రూ.75వేలు అందించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, రమేశ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటస్వామి, రంజిత్, శ్రీనివాస్, రాజేష్, చలపతి, నాగయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి కరూర్



విజయ్ రోడ్ షోకు భారీగా తరలివచ్చిన జనం



గాయపడిన బాలుడు



తొక్కిసలాటలో గాయపడిన మహిళలను ఆస్పత్రిలోకి తీసుకువెళ్తున్న సిబ్బంది

(మొదటిపేజీ తరువాయి)

పిల్లలు, 17 మంది వరకు మహిళలు ఉన్నారు. 12మంది పరిస్థితి విషమంగా ఉందని... మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. తమిళ నటుడు విజయ్ టీవీకే పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించారు. గత మూడు వారాలుగా ప్రతి శని, ఆదివారాల్లో 'ర్యాలీ'లు నిర్వహిస్తున్నారు. శనివారం... నామక్కల్, కరూర్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు నామక్కల్ రావాల్సిన విజయ్... మూడు గంటలు ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 3 గంటలకు కరూర్‌లోని వేలుచామిపురం వద్దకు విజయ్ వస్తారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ... ఉదయం 11 గంటల నుంచే కరూర్ వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. తమ అభిమాన (కథా)నాయకుడిని చూసేందుకు యువకులతోపాటు... పిల్లలు, మహిళలూ భారీగా తరలి వచ్చారు. ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా గంటలకొద్దీ వేచి చూశారు. చివరికి... నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటల తర్వాత విజయ్ అక్కడికి చేరుకున్నారు. తన సభల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సు పైకి ఎక్కి విజయ్ ప్రసంగం ప్రారంభించగానే... అభిమానులు ఉద్రూతలూగిపోయారు. ఆయన ప్రసంగం ముగియడానికి కొద్దిసేపటి ముందే తొక్కిసలాట మొదలైంది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అప్పటికే నీరసించిన జనంలో కొందరు స్పృహతప్పి పడిపోయారు. ఇది గమనించిన విజయ్ టీమ్ అప్రమత్తమైంది. విజయ్ కూడా తన ప్రసంగాన్ని ఆపివేసి... బస్సు పైనుంచే వాటర్ బాటిళ్లు విసిరేశారు. విజయ్ అక్కడి నుంచి బస్సులో బయలుదేరగానే... పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉదయం నుంచి ఎండలో ఉండి... మాడిపోయిన జనం ఒక్కసారిగా అక్కడి నుంచి కదిలారు. విజయ్‌ని స్పష్టంగా చూడాలని గోడలు, చెట్లు ఎక్కిన వాళ్లు కిందికి దూకారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. అసలే ఇరుకు రోడ్డు... చీకటి... అటు జన ప్రవాహం, ఇటు ఒకరిమీద ఒకరు పడటంతో తొక్కిసలాట మొదలైంది. పెను విషాదానికి ఇదే కారణమైంది.

హాహాకారాలు... ఆర్తనాదాలు

తొక్కిసలాట సమయంలో పోలీసులూ అసహాయులుగా మారిపోయారు. పరిస్థితిని అదుపులోకి తేవడం వారికి అసాధ్యంగా మారింది. చీకట్లో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. తొక్కిసలాటలో చిక్కుకున్న జనం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయారు. 'సాయం చేయండి... ప్లీజ్... పోలీస్' అంటూ ఆర్తనాదాలు చేశారు. చాలామంది అక్కడే స్పృహ కోల్పోయారు. దారులన్నీ జనసంద్రంగా మారడంతో అంబులెన్స్‌లు కూడా వేగంగా చేరుకోలేకపోయాయి.

కన్నీటి సంద్రంలా కరూర్ ప్రభుత్వాస్పత్రి

క్షతగాత్రులను తరలించేందుకు సమారు 50 అంబులెన్స్‌లను ఉపయోగించారు. క్షతగాత్రులు, మృతదేహాలు, బాధిత కుటుంబీకుల రోదనలతో కరూర్ ప్రభుత్వాసుపత్రి శోకస ముద్రంలా మారింది. ఒక్కో అంబులెన్సులో నలుగురైదుగురు క్షతగాత్రులను కూడా తీసుకొచ్చారు. ఇక్కడ 80 మందికి పైగా క్షతగాత్రులు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది క్షతగాత్రులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

విచారణకు ఆదేశం...

ఈ విషాదంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. అలాగే... ఈ ఘటనపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించారు. ఆదివారం ఉదయం కరూర్ వెళ్లాలని భావించినప్పటికీ... శనివారం రాత్రికే ప్రత్యేక విమానంలో అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషాదంపై విచారణకు ఆదేశించారు. ఇక... స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తన దుబాయ్ పర్యటనను రద్దు చేసుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా కరూర్ చేరుకున్నారు.

నా గుండె బద్దలైంది: విజయ్

కరూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న నటుడు విజయ్.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయన దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. "నా గుండె బద్దలైపోయింది. భరించలేని బాధతో విలవిలలాడుతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని విజయ్ పేర్కొన్నారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి


కరూర్ విషాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు గవర్నర్ రవి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులు కూడా బాధితులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అదుపు చేయలేకనే.. విషాదాలు

(సెంట్రల్ డెస్క్)

ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు.. జూన్‌లో బెంగళూరులో ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజయోత్సవ కార్యక్రమం నేపథ్యంలో తొక్కిసలాట జరిగి 11 మంది చనిపోయారు.. ఇప్పుడు తమిళనాడులో విజయ్ రాజకీయ సభలో తొక్కిసలాటలో 38 మంది వరకు మృతి చెందారు.. వీటన్నింటికీ కారణం తక్కువ స్థలంలో ఎక్కువ మంది గుమిగూడటం, ఎవరికి వారు తామే ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించడం.. అన్నింటికన్నా ముఖ్యంగా గుంపును కట్టడి (క్రౌడ్ మేనేజ్‌మెంట్) చేయలేకపోవడమే. మన దేశంలో రైల్వేస్టేషన్లు, బస్టాండులు, మార్కెట్లు, సినిమా హాళ్లు వంటివి ఎప్పుడూ కిక్కిరిసే కనిపిస్తాయి. ఇక జాతరలు, వేడుకల సమయంలో జనం గుమిగూడటమూ సాధారణమే. దానికితోడు సినీ నటుల కార్యక్రమాలు, రాజకీయ సభలు, ర్యాలీలకు భారీగా జనం పోటెత్తుతుంటారు. అలాంటి చోట్ల తొక్కిసలాట జరగకుండా జనాన్ని కట్టడి చేయడమే కీలకం. తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం నుంచి ఆధునిక సాంకేతికతను వినియోగించడం దాకా ఇందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ రీసోర్సెస్ ఇనిస్టిట్యూట్ ఇండియా నివేదిక ప్రకారం.. ఏ ప్రదేశంలోనైనా ప్రతి చదరపు మీటరుకు నలుగురు వ్యక్తులు ఉంటే అది కిక్కిరిసిన పరిస్థితి. అదే ఆరుగురి చొప్పున ఉంటే ప్రమాదకర పరిస్థితి. తొక్కిసలాటకు అవకాశం ఎక్కువ. ప్రస్తుతం హెచ్‌డీ కెమెరాలు, అవి చిత్రీకరించే దృశ్యాల ఆధారంగా గుమిగూడిన జనం పరిస్థితిని విశ్లేషించే సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడ ఎక్కువ జనం గుమిగూడారు? గుంపులో జనం ఎటువైపు కదులుతున్నారు? తొక్కిసలాట జరిగే పరిస్థితి నెలకొందా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. జనాన్ని నియంత్రించేలా, మరోవైపు మళ్లించేలా క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇక భారీగా గుమిగూడిన జనం మధ్య అక్కడక్కడా ఖాళీ ప్రదేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని.. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే తొక్కిసలాట జరగకుండా ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. జనం గుమిగూడిన ప్రాంతానికి సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు వస్తే.. వారిని చూడటానికి అంతా ఒక్కసారిగా ఎగబడి తొక్కిసలాటకు దారితీస్తుంది. అలాంటి సమయంలో కచ్చితమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. జనం కిక్కిరిసిపోయే పరిస్థితి ఏర్పడితే ముందుగానే జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కల్పించడమూ కీలకం.

లోకం తీరు





శనివారం రోడ్ షోలో మాట్లాడుతున్న విజయ్

ప్రభంజనం... ఆంక్షలు... వివాదాలు!

ప్రేక్షకులకు, ప్రజలకు విజయ్‌గా సుపరిచితుడైన ఆయన పూర్తి పేరు... జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్! తమిళనాట 'ఇలయ దళపతి'గా పేరు తెచ్చుకున్నారు. తమిళనాట విజయ్ రాజకీయ రంగ ప్రవేశం పెను సంచలనం సృష్టించింది. గత ఏడాది 'తమిళ వెట్రి కళగం' (తమిళ విజయం పార్టీ) ఏర్పాటు చేశారు. అక్టోబరు 27న విల్లుపురంలో తొలి రాజకీయ సభకు భారీగా జనం తరలి వచ్చారు. ఆ తర్వాత... నిర్వహించిన సభల్లోనూ ఇదే పరిస్థితి. సభలకు వచ్చే జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. దీంతో విజయ్ ప్రచారానికి పలు నిబంధనలు విధించారు. అయితే దీనిని సవాల్ చేస్తూ ఆయన పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం పోలీసుల నిబంధనల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అన్ని పార్టీల నేతల ప్రచారానికి ఒకే విధమైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది.



వాంగ్‌చుక్‌కు పాక్‌తో సంబంధాలు: లద్దాఖ్ డీజీపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలున్నాయని.. దీనిపై దర్యాప్తు అధికారులు విచారణ జరుపుతున్నారని డీజీపీ ఎస్డీ సింగ్ జమ్వాల్ తెలిపారు. వాంగ్‌చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్న పాక్ గూఢచారి (పీఐఓ)ని ఇటీవలే అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వాంగ్‌చుక్ గతంలో పాక్, బంగ్లాదేశ్‌లలో పర్యటించారన్నారు. శనివారం లేహ్‌లో జరిగిన మీడియా సమావేశంలో లద్దాఖ్ డీజీపీ జమ్వాల్ మాట్లాడుతూ.. 'లేహ్‌లో అల్లర్ల వెనక వాంగ్‌చుక్ కీలక వ్యక్తి. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఓ పాక్ గూఢచారిని ఇటీవలే అరెస్టు చేశాం. అతడు వాంగ్‌చుక్‌తో సంప్రదింపులు జరిపాడు. దీనికి సంబంధించిన రికార్డులున్నాయి. ఆయన వ్యవహార శైలి అనేక అనుమానాలకు తావిస్తోంది. వీటిపై దర్యాప్తు జరుపుతున్నాం' అని వివరించారు.

ప్రపంచ ఉగ్రవాద కేంద్రం పాకిస్థాన్: జైశంకర్

న్యూయార్క్, సెప్టెంబరు 27: ఉగ్రవాదాన్ని అధికార విధానంగా కలిగిన పొరుగుదేశం(పాకిస్థాన్) ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా నిలిచిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా చూడాలని ఆయన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తూ చెప్పారు. ఉగ్రవాద మూలాలను ఉమ్మడిగా పెకిలించి వేయాలని ఆయన ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పహల్గాంలో ఉగ్రవాదులు పాశవిక దాడి జరిపారని, ప్రతిగా భారత్ పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందని చెప్పారు. గాజాలో శాంతి నెలకొనాలని, దీని కోసం భారత్ సహకరిస్తుందన్నారు. ఇదిలా ఉండగా, ఆపరేషన్ సిందూర్ వేళ కాల్పుల విమరణ విషయంలో మూడో దేశం ప్రమేయం లేదని.. మూడో వ్యక్తి ప్రమేయం అంతకన్నా లేదని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి పటేల్ గహ్లోత్ కీలక ప్రకటన చేశారు. "మే 9వ తేదీ వరకు భారత్‌పై కాల్పులకు పాల్పడుతూ.. పాక్ బెదిరింపు ధోరణిని ప్రదర్శించింది. కానీ, మే 10న భారత్‌తో పాక్ సైన్యం కాళ్లబేరానికి వచ్చింది. అయితే.. పాక్ ప్రధాని..తమ దేశంలో ధ్వంసమైన రన్‌వేలు తమ విజయమని భావిస్తే.. వారు ఆనందించవచ్చు" అని ఎద్దేవా చేశారు.

అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతి?

- ఇథనాల్ తయారీకి వినియోగించే అవకాశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చల్లో.. ఇథనాల్ ఉత్పత్తి కోసం ఆ దేశం నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసే అవకాశాలను భారతదేశం పరిశీలిస్తోంది. అమెరికా నుంచి వచ్చిన ఈ తాజా ప్రతిపాదనల మేరకు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని చేసుకునే లక్ష్యంతో చర్చలు జరుగుతున్నాయి. తదుపరి చర్చలకు తేదీ, వేదిక ఇంకా ఖరారు కానప్పటికీ, నిర్దేశిత గడువులోగా వాణిజ్య ఒప్పందం చేసుకునే లక్ష్యంతో ఇరుపక్షాలూ చర్చల్లో పురోగతి కొనసాగిస్తున్నాయని ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. రష్యా నుంచి భారత్ ముడిచమురును కొనుగోలు చేసే అంశమే తాజా వాణిజ్య చర్చల్లో ప్రధాన అవరోధంగా ఉందని అమెరికా యంత్రాంగం చెబుతోంది. కాగా, రష్యా నుంచి చమురు దిగుమతులు ఈనెలలో సుమారు రోజుకు 2 లక్షల బ్యారెళ్లకు పెరగనున్నట్టు భావిస్తున్నారు.

ఎప్‌స్టీన్‌తో మస్క్ సహా పలువురికి సంబంధాలు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: లైంగిక నేరస్థుడు, వ్యాపార వేత్త దివంగత జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, బ్రిటన్ రాజకుమారుడు అండ్రూ, స్టీవ్ బానన్ సహా పలువురికి సంబంధాలు ఉన్నాయని అమెరికా చట్టసభకు చెందిన డెమొక్రాట్స్‌తో కూడిన స్థాయీ సంఘం తాజాగా విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. 'ఎప్‌స్టీన్ ఫైల్స్' ఫైల్స్ పేరుతో విడుదల చేసిన నివేదికలో ఎప్‌స్టీన్‌తో పలువురు ప్రముఖులకు ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, సమావేశాలు, విమాన ప్రయాణ వివరాలు, ఆర్థిక అంశాలను పేర్కొన్నారు. "ఎప్‌స్టీన్ ఎస్టేట్ అందించిన మూడో దఫా పలు నివేదికలను పరిశీలించిన తర్వాత ఈ పాక్షిక నివేదికను రూపొందించాం. దీనిలో ఫోన్ సందేశాలు, విమానాల బుకింగ్ వివరాలు, ఆర్థిక లావాదేవీలు, ఎప్‌స్టీన్ దైనందిన చర్య వంటివి ఉన్నాయి." అని పేర్కొన్నారు. ముఖ్యంగా 2014, డిసెంబరులో మస్క్.. ఓ ప్రైవేటు ఐలాండ్‌కు ఎప్‌స్టీన్‌ను ఆహ్వానించినట్టు ఉందని తెలిపారు.

గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలి

- హమాస్ ఆయుధాలను వీడాలి
- అమెరికా 21 సూత్రాల శాంతి ప్రణాళిక

వాషింగ్టన్, సెప్టెంబరు 27: గాజా యుద్ధానికి ముగింపు పలికేందుకు, భవిష్యత్తులో ఒక దేశంగా పాలస్తీనా ఏర్పాటయ్యేందుకు వీలుగా అమెరికా 21 సూత్రాల శాంతి ప్రణాళికను ప్రతిపాదించింది. గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలగడం, పాలస్తీనియన్లను గాజాలో ఉండేందుకు ప్రోత్సహించడం, హమాస్ ఆయుధాలు వీడడం, బందీలను విడుదల చేయడం, వంటి అంశాలు ఆ ప్రణాళికలో ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశాల సందర్భంగా అమెరికా ఈ ప్రణాళికను కొన్ని అరబ్, ముస్లిం దేశాల ముందు ఉంచింది. పాలస్తీనియన్లను గాజా స్ట్రిప్‌లో ఉండనివ్వాలనే ప్రతిపాదన.. ట్రంప్ వైఖరిలో మార్పును సూచిస్తుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. గాజాను స్వాధీనం చేసుకుని.. పాలస్తీనియన్లను తరలిస్తానని ఫిబ్రవరిలో ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా, 'ద్వి దేశ పరిష్కారా'న్ని ఎప్పుడూ సమర్థించని ట్రంప్.. భవిష్యత్తులో పాలస్తీనా ఒక దేశంగా ఏర్పడేందుకు ఆలోచన చేయడం కూడా గమనార్హం. ఈ నేపథ్యంలో నెతన్యాహుతో సోమవారం జరగనున్న ట్రంప్ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, గాజాలోని జనావాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 44 మంది మరణించారు.

మోదీ విధానాలు భేష్: పుతిన్

మాస్కో, సెప్టెంబరు 27: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారత దేశం చెప్పుకోదగిన రీతిలో ఆర్థిక ప్రగతి సాధిస్తోందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. ఎలాంటి విదేశీ ఒత్తిళ్లకు లొంగకుండా స్వతంత్ర విధానాలను అవలంబిస్తోందని కొనియాడారు. ఇటీవల మోదీతో ఫోన్‌లో మాట్లాడిన పుతిన్ ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ సంపూర్ణ స్వతంత్ర, సార్వభౌమ విధానాలను అమలు చేస్తోంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఆర్థిక రంగంలో చాలా మంచి ఫలితాలను సాధిస్తోంది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలోనూ అత్యధిక ఆర్థిక వృద్ధి రేటును నమోదు చేస్తోంది" అని పేర్కొన్నారు.

ఇక 'స్వదేశీ' 4జీ!

- స్వదేశీ టెక్నాలజీతో బీఎస్ఎన్ఎల్ సేవలు
- ఒడిశాలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- 37,500 కోట్లతో 97,500 మొబైల్ టవర్లు

ఝార్సుగూడ, సెప్టెంబరు 27: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో ఈ సేవలను ప్రారంభించారు. అలాగే రూ.37,500 కోట్ల వ్యయంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లను కూడా ఆయన ప్రారంభించారు. దీంతో టెలికాం పరికరాలను సొంతంగా ఉత్పత్తి చేసే చైనా, డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియాల సరసన భారత్ చోటు దక్కించుకుంది. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనదని, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ కలలకు ప్రతిరూపమైన డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. దీంతో 26,700కు పైగా గ్రామాల్లో 20 లక్షల మందికిపైగా కొత్త వినియోగదారులకు 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. అదేవిధంగా డిజిటల్ భారత్ నిధి ద్వారా 30వేల గ్రామాలను అనుసంధానించే లక్ష్యంతో 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో పాటు ఒడిశాలో రూ.60వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. 8ఐఐటీల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.

- రూ.37,500 కోట్ల వ్యయంతో 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లు ఏర్పాటు. వీటిలో చాలవరకూ సౌర శక్తితో పనిచేసేవి కావడంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ టెలికం సైట్‌ల క్లస్టర్‌గా గుర్తింపు. 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా దాదాపు 30వేల గ్రామాలకు 4జీ సేవలు.
- క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్ కావడంతో భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసే అవకాశం.

సహకరించిన టెక్ దిగ్గజాలు

- స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు టెక్ దిగ్గజాలైన టీసీఎస్, సీ-డాట్, తేజస్ నెట్‌వర్క్ లిమిటెట్ కీలక పాత్ర పోషించాయి.
- టీసీఎస్ - డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ
- తేజస్ నెట్‌వర్క్ - రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్ఏఎన్)



ఒడిశాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

ప్రజలను దోచుకున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా దోచుకుందని మోదీ ఆరోపించారు. అల్పాదాయ వర్గాలను కూడా వదలకుండా వారిపైనా పన్నుల భారం మోపిందని మండిపడ్డారు. ఒడిశాలోని ఝార్సుగూడలో శనివారం నిర్వహించిన 'నమో యువ సమాబేశ్'లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో ప్రబలంగా ఉన్న దోపిడీ సంస్కృతి నుంచి బీజేపీ రక్షించిందని అన్నారు. ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్ని కూడా కాంగ్రెస్ వదిలిపెట్టలేదని విమర్శించారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆదాయాన్ని, పొదుపును రెట్టింపు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం రెండు సెమీ కండక్టర్ యూనిట్లను మంజూరు చేసిందని, ఆర్థిక కారిడార్ కోసం కూడా ప్రణాళికలు ఉన్నాయన్నారు.

సరిహద్దులకు 'అనంత శస్త్ర' శక్తి

- దేశీయ క్షిపణుల కొనుగోలుకు 30 వేల కోట్లతో టెండర్ నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: పాకిస్థాన్, చైనా సరిహద్దుల వెంబడి రక్షణ వ్యవస్థను మన సైన్యం మరింత బలోపేతం చేస్తోంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 'అనంత శస్త్ర' క్షిపణి వ్యవస్థతో గగనతల రక్షణ శక్తి సామర్థ్యాలను పటిష్ఠం చేయనుంది. సుమారు రూ. 30 వేల కోట్లతో ఆ క్షిపణి వ్యవస్థ కొనుగోలు చేయడానికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు టెండర్ నోటీసు జారీ చేసినట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ పేర్కొంది. భూ ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే ఈ క్షిపణి వ్యవస్థను డీఆర్‌డీవో తయారు చేసింది. గతంలో ఈ క్షిపణి వ్యవస్థను క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (క్యూఆర్ఎస్ఏఎం) అని పిలిచేవారు. తర్వాత దీనికి అనంత శస్త్రగా నామకరణం చేశారు. 5 నుంచి 6 రెజిమెంట్ల ఈ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసి సరిహద్దుల్లో మోహరించనున్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం వీటి సేకరణకు తమ ముందుకు వచ్చిన ప్రతిపాదనను డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ వెంటనే ఆమోదించింది. కదులుతున్నపుడు కూడా శత్రువుల లక్ష్యాలను ఛేదించడం అనంత శస్త్ర ప్రత్యేకత. దీనిని చాలా వేగంగా ప్రయోగించవచ్చు. సుమారు 30 కిలో మీటర్ల పరిధిలోని లక్ష్యాలను ధ్వంసం చేయగలదు. ప్రస్తుతం ఆర్మీ వద్దనున్న ఆకాశ్‌తీర్, మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్ఎస్ఏఎం)లకు తోడుగా అనంత శస్త్ర ఆర్మీ అమ్ములపొదిలో ఉంటుంది.

త్వరలో ఏఐతో 40% ఉద్యోగాలు భర్తీ..!

- ఓపెన్ ఏఐ సీఈవో ఆల్ట్‌మన్ వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: ప్రస్తుతం టెక్నాలజీ రంగాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) 2030 నాటికి సూపర్ ఇంటెలిజెన్స్ స్థాయికి చేరుకుంటుందని ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. త్వరలోనే ఏఐ 40 శాతం ఉద్యోగాలను భర్తీ చేయగలదని భావిస్తున్నానని చెప్పారు. ఈ ఏడాది యాక్సెల్ స్ప్రింగర్ అవార్డు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్‌కే పరిమితమైన ఏఐ టెక్నాలజీ నేడు ప్రతి పనిలోనూ భాగమైందన్నారు. ఏఐ త్వరలోనే మానవ పరిధికి మించిన ఆవిష్కరణలు చేయగలదని చెప్పారు. '2030 నాటికి మనం చేయలేని పనులను చేసే అసాధారణ సాంకేతికత మన వద్ద ఉంటుందని నమ్ముతున్నాను' అని ఆల్ట్‌మన్ వెల్లడించారు. టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందడం శుభపరిణామమే అయినప్పటికీ.. ఇది ఉద్యోగాల తొలగింపునకు దారితీయొచ్చని ఆయన పేర్కొన్నారు. కొన్నిరంగాల్లో పూర్తిగా కొత్త రకం పనులు పుట్టుకొస్తాయని, మరికొన్ని పనులు అదృశ్యమవుతాయని చెప్పారు. ఏది వచ్చినా దాన్ని స్వీకరించి నేర్చుకోవడం ముఖ్యమని అన్నారు.

యాక్సెంచర్‌లో 3 నెలల్లో 11,000 ఉద్యోగాల కోత

- మరిన్ని కోతలుంటాయన్న సీఈవో



న్యూఢిల్లీ, సెప్టెంబరు 27: ఐటీ, కన్సల్టింగ్ సేవల దిగ్గజం యాక్సెంచర్ గత మూడు నెలల్లో 11,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఏఐ వినియోగం పెరగడం, కార్పొరేట్ సంస్థల నుంచి సేవల డిమాండ్ తగ్గడం వల్ల మానవ వనరులను తగ్గించుకుంటున్నామని శనివారం యాక్సెంచర్ సీఈవో జూలీ స్వీట్ ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని తొలగింపులు ఉంటాయని తెలిపారు. తొలగించే ఉద్యోగుల పరిహారం కోసం 865 మిలియన్ డాలర్ల మొత్తాన్ని కేటాయించామని వెల్లడించారు. తమకు అవసరమైన నైపుణ్యాలను వారికి నేర్పించడం గిట్టుబాటు కాని వ్యవహారం అని నిర్ధారణ అయిన చోటే తొలగింపులు చేపడుతున్నామని తెలిపారు. తమ క్లయింట్లకు అవసరమైన ఏఐ ఆధార సేవలు సత్వరమే అందించే విధంగా తమ మానవ వనరులను వేగంగా తీర్చిదిద్దుకుంటున్నట్లు చెప్పారు. మానవ వనరుల పునర్వ్యవస్థీకరణ కారణంగా కంపెనీకి బిలియన్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉద్యోగులను తొలగించినప్పటికీ యాక్సెంచర్ లాభాలు గత ఏడాదితో పోలిస్తే ఏడు శాతం పెరిగాయి.

వదలని వాన

- కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లో 13 సెంటీమీటర్ల వర్షం
- కూలిన ఇళ్లు.. ప్రమాదాల్లో ఇద్దరి మృతి
- మహబూబాబాద్‌లో ఒకరి గల్లంతు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రమ్మీద కమ్ముకున్న మాయదారి మబ్బు వదలడం లేదు. కురుస్తున్న చినుకుకూ విరామం ఉండటం లేదు. శరద్కాలంలో తేటనీటితో కళకళలాడాల్సిన కాలువలు మహోగ్రంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగులు పోస్తున్నాయి. కొన్ని చోట్ల కట్టలు తెగుతున్నాయి. వేసిన పంటలు మట్టిపాలవుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద పోటెత్తుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల శనివారం కూడా వర్షాలు పడ్డాయి. కొత్తగూడెం జిల్లా చర్లలో 13.7సెం.మీ, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 13సెం.మీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 41 మండలాల్లో 6 నుంచి 11 సెం.మీ మధ్య వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. పెద్దాపూర్ జాతీయ రహదారి వద్ద రెస్టారెంట్లు, హోటళ్లు నీట మునిగాయి. మెదక్ జిల్లా ఏడుపాయల క్షేత్రంలో ఆలయం ముందున్న ప్రసాదం కౌంటర్ షెడ్డు, క్యూలైన్ ఐరన్ బారీకేడ్లు మంజీరా ప్రవాహంలో కొట్టుకుపోయాయి. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై నందివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని పలుగ్రామాల్లో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. భద్రాచలం ఉచిత అన్నదాన సత్రంలోకి నీరు చేరింది. సిద్దిపేట జిల్లాలో చేర్యాల జలదిగ్బంధమైంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ శివారులోని మున్నేరు వాగులో చేపలవేటకు వెళ్లి డోర్నకల్‌కు చెందిన బందెల వెంకటేశ్వర్లు (43) గల్లంతయ్యాడు. భూపాలపల్లి జిల్లా కటారం మండలం ములుగుపల్లి-అంకుసాపూర్ మధ్య పొంగిపొర్లుతున్న చిన్నవాగును బైక్ మీద దాటేందుకు రాజు అనే యువకుడు ప్రయత్నిస్తూ వాహనంతో సహా ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈత రావడంతో ఒడ్డుకు చేరాడు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం అనుగొండ గ్రామంలో ఓ పెంకుటిల్లు కూలిపోయింది. శిథిలాలు మీద పడి ఆదిత్య అనే 12ఏళ్ల బాలుడు మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి సమీపంలో ఎస్సారెస్పీ ఉప కెనాల్‌లో మేకలకాపరి దూరు కృష్ణయ్య ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు.

3జిల్లాలకు రెడ్ అలర్ట్

రాష్ట్రవ్యాప్తంగా ఆది, సోమవారాల్లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.



అంబర్‌పేటలోని అంబేడ్కర్‌నగర్ నుంచి బాధితులను పడవలో తరలిస్తున్న సిబ్బంది



మూసీ ఉధృతితో నీట మునిగిన చాదర్‌ఘాట్‌లోని మూసానగర్ ప్రాంతం

కళ్లు మూసి తెరిచేలోగా..

గంధంగూడ నుంచి నాగోలుదాకా పరిస్థితి ఆగమాగం.. వరదతో పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర అల్లకల్లోలం

హైదరాబాద్ సిటీ/చాదర్‌ఘాట్/అఫ్జల్‌గంజ్/ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూసీకి వరదొచ్చింది. ఆ వరద కట్టలు తెంచుకుంది. గంధంగూడ నుంచి నాగోలు దాకా గట్టున, ఆ సమీపంలో ఉన్న వేల సంఖ్యలో ఇళ్లను వరద ముంచెత్తింది. ఆ వరద తీవ్రతకు తీరానికి అనుకొని ఉన్న ఇళ్లలోని జనానికి తేరుకునే సమయమే లేకపోయింది. చేతికందిన వస్తువులతో పిల్లలనెత్తుకొని.. కట్టుబట్టలతో జనం ఇళ్లలోంచి రోడ్ల మీదకొచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. లంగర్‌హౌస్ వద్ద బాపూఘాట్ వంతెనను తాకుతున్నట్లుగా ప్రవహిస్తూ భయపెట్టిన మూసీ.. చాదర్‌ఘాట్‌లోని కాజ్‌వే బ్రిడ్జ్‌పై నుంచి 6 అడుగుల ఎత్తులో.. మూసారంబాగ్ వంతెనపై నుంచి 10 అడుగుల ఎత్తులో పోటెత్తింది. గత కొన్ని దశాబ్దాల్లో కనీవినీ ఎరుగని రీతిలో మూసీ మహోగ్రరూపమిది. వికారాబాద్, తాండూరులో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి 30వేల క్యూసెక్కుల నీరు వదులుతుండటంతో శుక్రవారం సాయంత్రం మొదలైన మూసీ వరద శనివారానికి మహోగ్రరూపం దాల్చింది. ఒకరంగా 1908 నాటి ప్రళయాన్ని గుర్తుకు తెచ్చింది. శుక్రవారం రాత్రి నుంచే లంగర్‌హౌజ్ నుంచి జియాగూడ, పురానాపూల్, చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్, మూసారంబాగ్ ప్రాంతాల్లోని నదీతరంలో ఉధృతి పెరిగింది. మూసానగర్, రసూల్‌పుర, వినాయకవీధిలోని దాదాపు వెయ్యి ఇళ్లలోకి వరద ప్రవహించడంతో బాధితులు ఇళ్లను వీడి బయటకొచ్చారు. చాలామందిని సహాయక సిబ్బంది బోట్ల సాయంతో బయటకు తీసుకొచ్చాయి. అధికారులు ముందే అప్రమత్తం చేసి ఉంటే ఇళ్లలోని అవసరమైన వస్తువులనైనా తీసుకొని బయటకొచ్చే అవకాశం ఉండేదని, ఇప్పుడు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు. చాదర్‌ఘాట్, మూసారంబాగ్ వంతెనలపై రాకపోకలు నిలిచిపోయాయి. గౌరెల్లి, పురానాపూల్ బ్రిడ్జిపై రాకపోకలు స్తంభించిపోయాయి. అంబర్‌పేటలోని అంబేడ్కర్‌నగర్‌లో ఇళ్లలో చిక్కుకున్నవారిని బోట్లలో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో గాంధీ సమాధి ప్రాంతాన్ని వరద ముంచెత్తింది. లంగర్‌హౌస్, కార్వాన్ సహా మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గౌరెల్లి-ప్రతాపసింగారం రోడ్డులో వాహనాలను నిలిపివేశారు.



నార్సింగ్ సర్వీస్‌రోడ్డుపైకి చేరిన వరద

డ్రోన్‌తో ఆహార ప్యాకెట్లు

మూసారంబాగ్ లోలెవల్ బ్రిడ్జికి అనుకొని హై లెవల్ బ్రిడ్జి పనులు చేపట్టారు. శుక్రవారం రాత్రి వచ్చిన వరదతో నిర్మాణ సామగ్రి పూర్తిగా కొట్టుకుపోయింది. జేసీబీ మునిగిపోయింది. డీసీఎం బోల్తా పడింది. మూసారంబాగ్ బ్రిడ్జి సమాంతర రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డులో పార్క్ చేసిన ప్రైవేటు బస్సులు, రిపేరింగ్‌కు వచ్చిన కార్లు వరదలో మునిగిపోయాయి. మూసారాంబాగ్ బ్రిడ్జికి సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు పూర్తిగా మునిగిపోయింది. చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జికి ఇరువైపుల మూసానగర్, రసూల్‌పుర, వినాయక వీధిలోని వందల ఇళ్లు మునిగాయి. అక్కడి నుంచి దాదాపు 1100 మందిని ఆరు పునరావాస కేంద్రాలకు తరలించారు. రసూల్‌పురలోని ఓ భవనంలో చిక్కుకున్న నలుగురిని బయటికి తీసుకురావడానికి సహాయక బృందాలు ప్రయత్నించినా వారు బయటకు వచ్చేందుకు నిరాకరించారు. తమకు ఆహారం, తాగునీరు, మొబైల్ చార్జింగ్ కోసం పవర్ బ్యాంక్‌లను అందజేయాలని కోరారు. సిబ్బంది వారికి డ్రోన్ ద్వారా ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. గోల్నాక డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్, ఫాతీమానగర్, న్యూకృష్ణానగర్, ఓల్డ్‌కృష్ణానగర్, అంబేడ్కర్‌నగర్ బస్తీలలోని ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వారిని కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ పాఠశాలలకు తరలించి భోజన వసతి కల్పించారు. అంబేడ్కర్‌నగర్ బస్తీలోని వారికి సహాయక సబ్బంది బోట్లలో వెళ్లి ఆహార పొట్లాలు అందజేశారు.



ఎంజీబీఎస్‌ను వరద ముంచెత్తడంతో ప్రయాణికులను తరలిస్తున్న హైడ్రా సిబ్బంది

అంతా 20 నిమిషాల్లోనే..

ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్, పద్మానగర్ కాలనీల్లో సుమారు వెయ్యికి పైగా ఇళ్లు మూసీ వరద ఉధృతికి మునిగిపోయాయి. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఇళ్లలోకి వరద రావడంతో 20 నిమిషాల్లోనే ఇళ్లు మునిగిపోయాయని, సామాన్లన్నీ వదిలేసి ప్రాణభయంతో బయటకు పరుగులు తీశామని.. రాత్రంతా నిద్ర లేకుండా గడిపామని స్థానికులు ఆవేదనగా చెప్పారు. తమ కూతురు ఇటీవలే ప్రసవించిందని.. సాయంత్రం ఒక్కసారిగా ఇంట్లోకి వరద పోటెత్తడంతో పచ్చిబాలింతరాలైన కుమార్తెను, చంటిబిడ్డను తీసుకొని బయటకొచ్చానని.. కాసేపటికే ఇల్లు పూర్తిగా మునిగిపోయిందని అలీమా బేగం అనే మహిళ పేర్కొంది.

మునిగిన పురానాపూల్ శ్మశానవాటిక

వరద ఉధృతితో పురానాపూల్ హిందూ శ్మశానవాటికలోని 12 ఘాట్లు నీటమునిగాయి. ప్రవాహానికి కట్టెలు, ఆయిల్, ఇతర సామగ్రి కొట్టుకుపోయాయి. అంతిమ యాత్ర వాహనాలు వరదలో మునిగిపోయాయి. ఒక వాహనం మూసీ ఉధృతికి కాలువలో కొట్టుకుపోయిందని శ్మశానవాటిక నిర్వాహకులు తెలిపారు. శనివారం కొన్ని మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకొచ్చినా అంతిమ సంస్కారాలు చేయలేని పరిస్థితి నెలకొంది.

వరదలో చిక్కుకున్న పూజారి కుటుంబం

పురానాపూల్ వద్ద మూసీనది ఒడ్డులో ఉన్న శివాలయం వరదలో మునిగింది. ఆలయం పైఅంతస్తులో ఉన్న పూజారి కుటుంబం బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో చిక్కుకుపోయింది. వరద తగ్గేంతవరకు బయటికి రావద్దని హైడ్రా అధికారులు వారికి సూచించారు.

ఎంజీబీఎస్‌ను ముంచేసిన వరద

ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌ను ఎన్నడులేని విధంగా మూసీ వరద ముంచేసింది. నీటి ఉధృతి పెరగడంతో ఎంజీబీఎస్ నుంచి బస్సుల రాకపోకలు ఆర్టీసీ తాత్కాలికంగా నిలిపివేసింది. బస్‌స్టేషన్‌లోని ప్రయాణికులను తాళ్లసాయంతో బయటకు తీసుకొచ్చారు. ఎంజీబీఎస్‌లో ప్లాట్‌ఫారం 29 నుంచి 42 వరకు మూసీవరదలో మునిగిపోయాయి. ఎంజీబీఎస్ నుంచి రాకపోకలు సాగిస్తున్న 2500కు పైగా సర్వీసులు నగరంలోని పలు ప్రాంతాలను జిల్లాలకు నడుపుతున్నట్లు రంగారెడ్డి ఆర్ఎం శ్రీలత తెలిపారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి నడుపుతున్నారు. వరంగల్, హనుమకొండ వైపు వెళ్లే బస్సులు ఉప్పల్ క్రాస్‌రోడ్ నుంచి, సూర్యాపేట, నల్లగొండ, విజయవాడ వైపు వెళ్లే బస్సులను ఎల్బీనగర్ నుంచి నడుపుతున్నారు. మహబూబ్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపునకు వెళ్లే సర్వీసులు ఆరాంఘర్ నుంచి నడుపుతున్నారు. బస్సుల సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్ల (040-69440000, 040-23450033)లో సంప్రదించాలన్నారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గితే బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చెత్త తొలగించి బస్సుల రాకపోకలు ఆదివారం నుంచి పునరుద్ధరిస్తామని చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

దయచేసి టికెట్ రేట్లు పెంచకండి సార్



ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపాలని, అందు కోసం ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఫిల్మ్ ఛాంబర్‌ను, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌ను పిలిచి చర్చించాలని సీనియర్ నటుడు ఆర్.నారాయణమూర్తి కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సామాన్యుడికి కూడా వినోదాన్ని పంచేది కేవలం సినిమా మాత్రమే. అలాంటి సినిమా టికెట్ ధరలు పెంచితే సామాన్యుడు ఇబ్బంది పడతాడు. రేట్లు పెంచడం వలన చిన్న నిర్మాతలు కూడా నష్టపోతున్నారు. దయచేసి టికెట్ రేట్లు పెంచకండి సార్. టికెట్ ధరలు పెంచను, మిడ్ నైట్ షోలను అనుమతించను అని అసెంబ్లీలో చెప్పిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సెల్యూట్ చేస్తున్నా. అదే మాట మీద నిలబడాలని కోరుతున్నా' అన్నారు.



కావాల్సినంత వినోదం

కిరణ్ అబ్బవరం

'ఈ దీపావళికి థియేటర్లకు వచ్చే అన్ని వర్గాల ప్రేక్షకులకు 'కె-ర్యాంప్' సినిమా కావాల్సినంత వినోదాన్ని పంచుతుంది. అందుకు నేను హామీ ఇస్తున్నాను' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం ప్రెస్ మీట్ నిర్వహించింది. దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ 'కె-ర్యాంప్ అంటే బూతు మాట కాదు. కె-ర్యాంప్ అంటే కిరణ్ అబ్బవరం ర్యాంప్. దాన్ని దృష్టిలో పెట్టుకునే కథ రాశాను' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ సినిమా చేస్తున్నప్పుడు 'జైన్స్ నానితో ఇండస్ట్రీకి మరో త్రివిక్రమ్, హరీశ్ శంకర్ దొరికినట్లే' అని నరేశ్ నాతో అన్నారు. ఈ దీపావళికి ఎన్ని సినిమాలు విడుదలవుతున్నా.. 'కె-ర్యాంప్' విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. కార్యక్రమంలో కథానాయిక యుక్తి తరేజా, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్, ప్రొడక్షన్ డిజైనర్ బ్రహ్మ కడలి తదితరులు మాట్లాడారు.

శక్తిమంతమైన పాత్రలో...



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. శనివారం ఈ సినిమా నుంచి మంచు మోహన్‌బాబు ఫస్ట్‌లుక్ పోస్టర్లను విడుదల చేశారు మేకర్స్. ఆయన ఇందులో 'శికంజ మాలిక్' అనే విలన్ పాత్రను పోషిస్తున్నారు. ఓ పోస్టర్‌లో షర్ట్ లేకుండా గన్, కత్తి, సిగార్ పట్టుకుని సీరియస్ లుక్‌లో ఉన్నారు. ఇంకో పోస్టర్‌లో గన్ పట్టుకుని సిగార్ కాలుస్తున్న లుక్ ఆయన పాత్ర చాలా శక్తిమంతంగా ఉండబోతోందని తెలిపేలా ఉంది. ఈ లుక్స్ అదిరిపోయాయంటూ, వింటేజ్ మోహన్‌బాబును చూస్తున్నట్లు ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. ఇందులో నాని జడల్ అనే పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న 'ది ప్యారడైజ్' సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: సీహెచ్ సాయి, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.



అలరించే అమ్మ పాట

వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే తెరకెక్కించిన చిత్రం 'కానిస్టేబుల్'. జాగృతి మూవీ మేకర్స్ బేనర్‌పై బలగం జగదీశ్ నిర్మించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రంలోని 'తల్లిలేని ఓ దేవుడా ఈ తల్లి ఘోష చూడరా' అంటూ సాగే గీతాన్ని ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు. ఈ పాటను రామారావు రచించగా ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ ఆలపించడం విశేషం. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'నా గత చిత్రాలకు భిన్నంగా ఇందులో నా పాత్ర ఉంటుంది. చక్కటి డ్రామా, వినోదం, భావోద్వేగాలు వంటి అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని చెప్పారు. ఆర్యన్ సుభాన్ మాట్లాడుతూ 'ట్రైలర్‌కి వస్తున్న స్పందన చిత్రంపై మా నమ్మకాన్ని మరింత పెంచింది' అని అన్నారు. నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ 'అక్టోబరు 10న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. నైజాంలో ఏషియన్ ఫిల్మ్స్ రిలీజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని చెప్పారు.

థ్రిల్లర్ సరస్వతి

పలు సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. తాజాగా ఆమె దర్శకత్వం, నిర్మాణం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే తన సోదరి పూజ శరత్‌కుమార్‌తో కలసి దోస డైరీస్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారు. శనివారం ఈ బేనర్‌పై తెరకెక్కనున్న తొలి చిత్రం 'సరస్వతి'ని ప్రకటించారు. ఇందులో ఆమె ప్రధాన పాత్ర పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. క్షణక్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది. కచ్చితంగా ఘన విజయం సాధిస్తుంది. త్వరలోనే ఇతర వివరాలు తెలియజేస్తాను' అని అన్నారు. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాశ్‌రాజ్, ప్రియమణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



మదర్ డెయిరీ ఎన్నికల్లో.. కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ

» మూడు డైరెక్టర్ పదవుల్లో రెండు బీఆర్ఎస్ కైవసం

» కాంగ్రెస్ బలపరిచిన వారిలో ఒకరు మాత్రమే గెలుపు



మదర్ డెయిరీ ఎన్నికల్లో గెలుపొందిన ముగ్గురు డైరెక్టర్లు

హయత్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ-రంగారెడ్డి జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మదర్ డెయిరీ పాలకవర్గంలోని మూడు డైరెక్టర్ పదవులకు జరిగిన ఎన్నికల్లో రెండింటిలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఒక్క డైరెక్టర్ పదవి మాత్రమే అధికార పార్టీకి దక్కింది. శనివారం నగరంలోని హయత్‌నగర్ ఎస్‌వీ కన్వెన్షన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రెండు జనరల్ స్థానాల్లో బీఆర్ఎస్ బలపరిచిన రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి (154 ఓట్లు) సందిల భాస్కర్‌గౌడ్ (240 ఓట్లు) గెలుపొందారు. ఇక మరో స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించగా.. కాంగ్రెస్ బలపరిచిన కర్నాటి జయశ్రీ (176 ఓట్లు) గెలుపొందారు. కాగా, మూడు స్థానాలకుగాను బీఆర్ఎస్ రెండింట్లో గెలుపొంది సత్తా చాటగా.. కాంగ్రెస్ నాయకుల అంతర్గత పోరుతోనే ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఓటమి పాలైనట్లు భావిస్తున్నారు. ఎన్నికల అనంతరం కొందరు రైతులు మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని, తాము ఎలా జీవించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ పదవి నుంచి మధుసూదన్‌రెడ్డి దిగిపోవాలని డిమాండ్ చేశారు.

పేదలందరికీ ఇళ్లు కట్టించడమే ప్రభుత్వ లక్ష్యం

» ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ/కనగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): "పేదల కంట కన్నీరొస్తే నేను తట్టుకోలేను. గత పాతికేళ్లుగా వేలాది మందిని ఆదుకుంటూ వారికి అండగా నిలిచాను" అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కనగల్ మండలం తేలకంటిగూడెంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పాతికేళ్ల క్రితం సునీత అనే మహిళకు తాను చేసిన ఆర్థిక సాయాన్ని ఆమె గుర్తుచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులివ్వడం తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తేలకంటిగూడెంలో పది రోజుల్లోగా చౌకధరల దుకాణం ఏర్పాటు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నల్లగొండలో యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా రూ.42.50 కోట్లతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు.

సింగరేణి కార్మికులకు బోనస్ బొనాంజా..

» రేపు సంస్థ కార్మికుల ఖాతాల్లో జమ

కొత్తగూడెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఈసారి అదిరిపోయేలా బోనస్ అందనుంది. సోమవారం వీరి ఖాతాల్లో బోనస్ జమకానుంది. సింగరేణిలో 41 వేల మంది కార్మికులు ఉండగా బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,95,610 వరకు రానుంది. గతేడాది సగటున ఒక్కో కార్మికుడికి రూ.1,87,321 బోనస్ చెల్లించగా.. ఈసారి అదనంగా రూ.8,289 బోనస్ లభించనుంది. సింగరేణిలో పనిచేస్తున్న మరో 30వేల మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ ప్రకటించారు. గతేడాదికన్నా ఇది రూ.500 ఎక్కువ. కాగా సంస్థలో పనిచేస్తున్న వారిలో 16 మందికి అత్యధికంగా బోనస్‌గా రూ.3,00,790 నుంచి 3,27,018 వరకు, మరో నలుగురికి రూ.2,97,920 నుంచి రూ.2,99,865 వరకు లభించనుంది. వీరిలో అత్యధికంగా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన టింబర్‌యార్డ్ వర్క్‌మెన్ సుద్దమళ్ల శ్రీనివాస్‌కు రూ.3,27,018 అందనుంది. ఇక కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న మరో పది మందికి రూ.2,45,314 నుంచి రూ.2,63,252 వరకు బోనస్ దక్కనుంది. వీరిలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌కు అత్యధికంగా రూ.2,63,252 బోనస్ అందనుంది.

కింగ్‌కోఠిలో పిడియాట్రిక్ ప్రత్యేక విభాగం

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చిన్నపిల్లల వైద్యాన్ని వికేంద్రీకరించాలని సర్కారు నిర్ణయించింది. ప్రస్తుతం పిడియాట్రిక్ వైద్యమంతా నీలోఫర్ ఆస్పత్రిలోనే అందుతుండడంతో ఆ ఆస్పత్రిపై విపరీతమైన భారం పడుతోంది. ఆ భారాన్ని తగ్గించాలని భావిస్తోన్న ప్రభుత్వం.. కింగ్‌కోఠిలోని ఆస్పత్రి ప్రాంగణంలో ప్రత్యేక పిడియాట్రిక్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కింగ్‌కోఠి ఆస్పత్రిలో పిడియాట్రిక్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లను.. అడ్డుకునే వారి భరతం పడతాం: ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో 9 విడుదల చేయడం హర్షణీయమని, పోరాటాల ఫలితంగానే ఈ రిజర్వేషన్లను సాధించుకున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఈ రిజర్వేషన్లను ఎవరు వ్యతిరేకించినా తీవ్ర పరిణామాలు తప్పవని, వారి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. రాజకీయ కోణంలో వీటిని చూడవద్దని.. అగ్రవర్ణాలు వ్యతిరేకించవద్దన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 42 శాతం బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ, న్యాయబద్ధమైనవని అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

వరద ముంపు బాధితులను ఆదుకోవాలి

» హైదరాబాద్ కలెక్టర్‌కు సేవా సంస్థల ప్రతినిధుల లేఖ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా హిమాయత్‌సాగర్ నుంచి వరద నీటిని వదిలేశారని పలు పౌర, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు వారు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు లేఖ రాశారు. ఒక్కసారిగా నీటిని వదలడంతో చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, కమల్‌నగర్, మూసానగర్, వినాయక్ వీధి ప్రాంతాల ప్రజలు ముంపునకు గురికావడమే కాక ఆర్థికంగా నష్టపోయారని లేఖలో రాశారు. ఈ ప్రాంతాల్లోని బాధితులందరికీ పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఇకపై రిజర్వాయర్ల గేట్లు ఎత్తే ముందే ప్రజలను అప్రమత్తం చేసే బాధ్యతను హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు తీసుకోవాలని లేఖలో కోరారు.

పర్యాటక సంస్థలో నిధుల దుర్వినియోగం

» ఇద్దరు అధికారుల సస్పెన్షన్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి):పర్యాటక సంస్థలో మూడేళ్లుగా రూ.5 కోట్లకు పైగా నిధులను దారిమళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సంస్థలోని ఫైనాన్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల సహకారంతో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తన వ్యక్తిగత ఖాతాకు రూ.1.25 కోట్లకు పైగా సంస్థ నిధులను మళ్లించినట్టు, ఇతర విభాగాల్లో కూడా పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో స్పష్టమైంది. దీంతో ఫైనాన్స్ విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తూ సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి ఆదేశాలు జారీ చేశారు. మరికొంత మంది అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

పార్టీలో సమస్యలు పరిష్కరిస్తా: నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన వయస్సు 75 ఏళ్లు నిండడంతో పార్టీ జాతీయ కార్యదర్శి పదవి నుంచి తప్పుకొన్నానని సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ తెలిపారు. చండీగఢ్‌లో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో 75 ఏళ్లు నిండిన వారు పార్టీలో పదవుల నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. పార్టీ జాతీయ కార్యదర్శి రాజాకు మాత్రం వయస్సు నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారని తెలిపారు. ఇకపై తాను సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తానని చెప్పారు. పార్టీలో అంతర్గత సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించేందుకు కంట్రోల్ కమిషన్ పనిచేస్తుందని తెలిపారు.



జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న సీఎం కుటుంబ సభ్యులు

అలంపూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదో శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. సీఎం సతీమణి గీత, ఇతర కుటుంబ సభ్యులు జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి కుంకుమార్చన చేశారు. బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకాల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈవో దీప్తి రెడ్డి, ధర్మకర్తలు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

బడి పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

» సర్కారు స్కూళ్లలో శౌచాలయాల ప్రక్షాళన

» కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



బర్కత్‌పుర చమాన్ వద్ద టాయిలెట్ క్లీనింగ్ మెషీన్ ఆటోలను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి

బర్కత్‌పుర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సర్కారు బడిలో చదివే పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పుర చమాన్ వద్ద స్వచ్ఛ విద్యాలయ టాయిలెట్ క్లీనింగ్ మెషీన్ ఆటోలను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లను శుభ్రం చేయడానికి క్లీనింగ్ మెషీన్లతో కూడిన ఆటోలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ యంత్రాల వల్ల టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంటాయని తద్వారా విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఈ నెల 29న అంబర్‌పేట మునిసిపల్ గ్రౌండ్ లో బతుకమ్మ వేడుకలు, 30న మేరా దేశ్ పహలే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలు ఉపయోగపడతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటికే 20 క్లీనింగ్ ఆటోలు ఉన్నాయని, కొత్తగా మరో 11 ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి రోజు 480 పాఠశాలల్లో టాయిలెట్ల క్లీనింగ్ జరుగుతోందని చెప్పారు.

42% జీవో ఎలా ఇస్తారు?

» ప్రస్తుత పంచాయతీరాజ్ చట్టం కింద రిజర్వేషన్లు 50 శాతం మించరాదు

» సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం లేదు

» చేసేదేదో చట్ట ప్రకారం ఉండాలి

» జీవో 9ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లలో ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు

» స్టే ఇవ్వకుండానే విచారణ 8కి వాయిదా

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో 9కు చట్టబద్ధత ఉందా? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని 285(ఏ) సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని పరిమితి విధిస్తూ స్పష్టమైన నిబంధన ఉందని గుర్తు చేసింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే పరిమితిని తొలగిస్తూ శాసనసభ ఏకగ్రీవంగా చట్ట సవరణ చేసినప్పటికీ దానికి గవర్నర్ ఆమోదం ఇంకా పొందలేదని ప్రస్తావించింది. సవరణకు గవర్నర్ ఆమోదం లేకుండా కేవలం బిల్లు ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో ఎలా ఇస్తారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించిపోతాయని, ఇది సుప్రీంకోర్టు తీర్పులతో పాటు పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకమని పేర్కొంటూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన బి.మాధవరెడ్డి, ఎస్.రమేశ్ తదితరులు హైకోర్టు శనివారం రెండు హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, జె.ప్రభాకర్ వాదనలు వినిపించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించరాదని కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, వికాస్ కిషన్‌రావు గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుల్లో సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చిందని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ చట్టం, సుప్రీంకోర్టు తీర్పులు అమలులో ఉండగా ప్రభుత్వం జీవో 9 జారీచేయడం చెల్లదని పేర్కొన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని కోరారు. తమిళనాడులో 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇస్తూ దానిని 9వ షెడ్యూల్‌లో చేర్చారని, దానిపై కూడా సుప్రీంకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని ప్రస్తావించారు. రాష్ట్రాలు పంపిన బిల్లులను మూడు నెలల్లో రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, తమకు గడువు ఎలా విధిస్తారని ప్రశ్నిస్తూ రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు రిఫరెన్స్ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులకు గవర్నర్ మూడు నెలల్లో ఆమోదం తెలిపాల్సిందే అని అనుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పంపిన సవరణ బిల్లుకు ఇంకా మూడు నెలలు కాలేదని ప్రస్తావించారు. హైకోర్టుకు సెలవులు ఉన్న రోజు చూసి జీవో ఇచ్చారని ఆరోపించారు.

అసెంబ్లీకి అధికారముంది

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదించారు. గవర్నర్ ఆమోదం ముఖ్యం కాదని, శాసన అధికారం అసెంబ్లీకి ఉందా లేదా? అన్నదే ముఖ్యమని చెప్పారు. చట్ట సవరణ చేసే అధికారం రాష్ట్ర అసెంబ్లీకి కచ్చితంగా ఉందని, జీవో జారీ చేయడంలో ఎలాంటి చట్టవ్యతిరేక చర్య లేదని తెలిపారు. బీసీల వెనకబాటుతనాన్ని అంచనా వేయడానికి డెడికేటెడ్ కమిషన్ వేసి, లెక్కలు తీసిన తర్వాతే శాస్త్రీయంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న బిల్లులను శాసనసభలో ఎవరూ వ్యతిరేకించలేదని, ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందాయని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి సూచనలు అందుకునేందుకు కనీస సమయం ఇవ్వాలని కోరారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం ప్రభుత్వానికి అంత అత్యవసరం ఏముందని.. ఎలక్షన్లు వాయిదా వేసి, చట్టప్రకారం అన్ని అడ్డంకులు తొలగిన తర్వాత నిర్వహించుకోవచ్చని సూచించింది. దసరా సెలవుల తర్వాత వరకైనా ఎన్నికలు వాయిదా వేసే అంశంపై ప్రభుత్వం నుంచి సూచన తీసుకోవాలని ఏజీని కోరింది. రాష్ట్రప్రభుత్వం సమ్మతి తెలిపితే ఎన్ని రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది? అని ధర్మాసనం రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) తరఫు సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌ను ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపిన తర్వాత ఒకటి రెండురోజుల్లో నోటిఫికేషన్ ఇస్తామని ఎస్ఈసీ న్యాయవాది తెలిపారు. అన్ని వర్గాల వాదనలు విన్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎస్ఈసీకి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చినా బీసీ రిజర్వేషన్ల పెంపుపై దాఖలైన ఈ పిటిషన్లు సర్వైవ్ అవుతాయని, వీటిపై విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టంచేసింది. నోటిఫికేషన్ కంటే ముందే ఈ పిటిషన్లు దాఖలయ్యాయి కాబట్టి నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా మెరిట్‌పై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దసరా సెలవుల తర్వాత ఈ పిటిషన్లు రెగ్యులర్ రోస్టర్ కలిగిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు రానున్నాయి. కాగా ప్రస్తుతానికి ఎలక్షన్ నోటిఫికేషన్ పై గానీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9పై గానీ హైకోర్టు ఎలాంటి స్టే విధించలేదు.

బీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే కుట్రను సాగనివ్వం

● జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్27(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలనే వారి కుట్రలను సాగనివ్వబోమని, బీసీ వ్యతిరేకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కోర్టుల్లో పిటీషన్‌లను విరమించుకోవాలని కోరారు. 22 నెలలుగా ప్రభుత్వంతో పోరాడి 42 శాతం రిజర్వేషన్లు తెచ్చుకుంటే దానిని ఓర్వలేని వారు న్యాయస్థానాలకు వెళ్లి అడ్డుకునే యత్నం సమంజసం కాదన్నారు.

కేటీపీఎస్ విస్తరణకు సహకరిస్తాం

» కేంద్ర విద్యుత్ సహాయ మంత్రి హామీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) విస్తరణకు సహకరిస్తామని కేంద్ర విద్యుత్ సహాయ మంత్రి శ్రీపాద్ యశోనాయక్ హామీ ఇచ్చారు. కేటీపీఎస్‌లో రెండు 800 మెగావాట్ల యూనిట్ల స్థాపనకు అవసరమైన పర్యావరణ అనుమతులను కూడా సులభతరం చేస్తామని చెప్పారు. అలాగే బొగ్గు కేటాయింపులకు కేంద్రం అవసరమైన మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ రఘురాంరెడ్డికి కేంద్ర మంత్రి శ్రీపాద్ యశోనాయక్ లేఖ రాశారు.

స్థానిక ఎన్నికలపై ముందుకే!

న్యాయ సలహాతో నేడో రేపో షెడ్యూల్

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. బీసీ రిజర్వేషన్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విషయంలో జీవోపై స్టే ఇవ్వకుండా చట్టప్రకారం ముందుకెళ్లాలని న్యాయస్థానం పేర్కొన్న నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలకే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఆదివారం న్యాయ నిపుణులతో చర్చించి ముందుకెళ్లాలని భావిస్తోంది. దాంతో నేడో, రేపో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తును ముమ్మరం చేసింది. ప్రభుత్వం పచ్చ జెండా ఊపగానే ఎన్నికల ఈసీ షెడ్యూల్ విడుదల చేస్తుంది. మరోవైపు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ఊపందుకుంది. తాజాగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు చేశారు. బీసీలకు 13 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పోస్టులను కేటాయించారు. ఈ మేరకు శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎస్టీలకు నాలుగు, ఎస్సీలకు 6 స్థానాలు కేటాయించారు. జనరల్‌కు 8 ఉన్నాయి. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ డైరెక్టర్, స్టేట్ ఎలక్షన్ అథారిటీ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సిద్దిపేట, సూర్యాపేట్, వికారాబాద్, జిల్లాలు బీసీ పురుషుడు/మహిళ కు కేటాయించగా మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూలు, నిజామాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి బీసీ మహిళలకు కేటాయించారు. ఆదిలాబాద్, జగిత్యాల, నారాయణపేట, పెద్దపల్లి జిల్లాలను మహిళలకు, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్ జిల్లాలు అన్ రిజర్వ్‌డ్ పురుషులు లేదా స్త్రీలకు కేటాయించారు. ములుగు, నల్గొండ జిల్లాలు ఎస్టీ మహిళలకు, ఖమ్మం, వరంగల్‌లు ఎస్టీ పురుషుడు లేదా స్త్రీకి, హనుమకొండ, జనగామ, రంగారెడ్డిలు ఎస్సీ మహిళలకు, జోగులాంబ గద్వాల్, రాజన్నసిరిసిల్ల, సంగారెడ్డిలు ఎస్సీ పురుషుడు లేదా స్త్రీలకు కేటాయించారు.

పండుగలు చూసి తేదీలు ఖరారు

దసరా, దీపావళి పండుగలు, వాటికి సంబంధించిన వరుస సెలవులను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ తేదీలు ఖరారు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. వరుస సెలవుల వల్ల ఓటర్లు తమ సొంత ఊర్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉండటం వల్ల ఓటింగ్ శాతంపై సెలవుల ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపైన ఉన్నతాధికారులు లోతుగా చర్చించారు. అత్యధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనేలా ఎన్నికల తేదీలను ఖరారు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఎస్ఈసీ శనివారం కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ హాజరయ్యారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఎన్నికల డ్యూటీ!

» అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టిన ఆర్డర్

» నిర్మల్ జిల్లాలో విచిత్రం

దిలావర్‌పూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో స్థానిక ఎన్నికల విధులకు సంబంధించి అధికారుల నిర్లక్ష్యం చర్చనీయాంశమైంది. ఏడాదిన్నర క్రితం పదవీ విరమణ చేసిన ఓ విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఎన్నికల డ్యూటీ ఆర్డర్ జారీ చేశారు. పి.లక్ష్మణ్ అనే ఉపాధ్యాయుడు దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసి 18 నెలల క్రితమే రిటైర్ అయ్యారు. అయితే, తాజాగా ఈ విశ్రాంత ఉపాధ్యాయుడికి ఆర్డర్ నంబర్ 05/2024, తేదీ 26.09.2025తో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల్లో ఆయనను వార్డు మెంబర్స్, సర్పంచ్ ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నియమించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆశ్చర్యానికి గురైన లక్ష్మణ్, తాను ఉద్యోగ విరమణ చేసి ఇన్ని రోజులు అవుతున్నా అధికారులు డ్యూటీ వేయడంపై విస్మయం వ్యక్తం చేశారు.

ఏసీబీ వలలో టీపీవో, టెక్నికల్ అసిస్టెంట్

» మేడ్చల్-మల్కాజిగిరి, మంచిర్యాల జిల్లాల్లో ఘటనలు



లంచం తీసుకుంటూ పట్టుబడిన టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్

మేడ్చల్‌టౌన్/ కన్నెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న పనుల కోసం తమ వద్దకు వచ్చే సామాన్యులు మొదలు వెంచర్లు వేసి ఇళ్లస్థలాలు విక్రయించే రియాల్టీ సంస్థల యజమానులనూ అధికార యంత్రాగం లంచం కోసం వేధిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎల్లపేట మునిసిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ప్రహరీ, గేట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని లంచం అడిగిన టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) రాధాకృష్ణ.. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్ర వాసి ఒకరు ఈజీఎస్ పథకం కింద కేటాయించిన క్యాటిల్ షెడ్ నిధుల మంజూరునకు లంచం అడిగిన టెక్నికల్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్ ఏసీబీ అధికారుల వలలో చిక్కుకున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏసీబీ డీఎస్పీ జి.శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు ఎల్లపేట పరిధిలోని గంగస్థాన్ హెచ్ఎండీఏ వెంచర్ ప్రహరీ గోడ, గేటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని టీపీఓ రాధాకృష్ణ రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. అడ్వాన్సుగా రూ.లక్ష చెల్లించిన వెంచర్ యజమానులు.. తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కొంపల్లి సమీపంలోని రాయచందాని షాపింగ్ మాల్ వద్ద ఏసీబీ అధికారుల సూచన మేరకు శనివారం రాధాకృష్ణకు వెంచర్ యజమానులు రూ.3.5 లక్షలు చెల్లించారు. అక్కడే జి.శ్రీధర్ సారథ్యంలో అక్కడే మాటు వేసిన ఏసీబీ సిబ్బంది.. రాధాకృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక ఈజీఎస్ పథకం కింద మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్ర రైతు ఒకరికి క్యాటిల్ షెడ్ మంజూరైంది. దీని నిర్మాణ బిల్లు మంజూరు కోసం రూ.10 వేలు లంచమివ్వాల్సిందేనని రైతును ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధిత రైతు.. వారి సూచన మేరకు శనివారం టెక్నికల్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్‌కు బాధిత రైతు రూ. 10 వేలు నగదు అందజేశాడు. ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో దుర్గా ప్రసాద్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనకు తొలి దఫా బిల్లు కోసం రూ.6,000 ఇచ్చానన్న బాధితుడు.. మళ్లీ రూ.10వేలు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించక తప్పలేదని వాపోయాడు.

స్పోర్ట్స్

వరంగల్ ● ఆదివారం 28 సెప్టెంబరు 2025

వెస్టిండీస్‌కు నేపాల్ షాక్

తొలి టీ20లో 19 పరుగులతో గెలుపు

షార్జా: పసికూన నేపాల్ జట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో పెను సంచలనం సృష్టించింది. బలమైన వెస్టిండీస్‌కు షాకిచ్చింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్ 19 పరుగులతో విండీస్‌ను చిత్తుచేసింది. దీంతో ఐసీసీ సభ్య దేశంపై తొలి గెలుపును అందుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట నేపాల్ 20 ఓవర్లలో 148/8 స్కోరు చేసింది. కెప్టెన్ రోహిత్ పౌడెల్ (38), కుశాల్ మల్లా (30), గుల్షన్ ఝా (22) సత్తా చాటారు. హోల్డర్ 4, నవీన్ బిదిశీ 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 129/9 స్కోరుకే పరిమితమైంది. నవీన్ బిదిశీ (22) టాప్ స్కోరర్. అమీర్ (19), ఫాబియన్ (19), కెప్టెన్ అకీల్ హొసేన్ (18), కార్టీ (16), అకీమ్ (15) రాణించినా.. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకోవడంతో విండీస్‌కు పరాభవం తప్పలేదు. కుశాల్ 2 వికెట్లు తీశాడు. రోహిత్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

వరల్డ్ రికార్డు ముంగిట అభిషేక్

భారత్-పాక్ ఫైనల్లో అభిషేక్ శర్మ ప్రపంచ రికార్డు సాధించే అవకాశముంది. అతనిప్పటికే టీ20ల్లో వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో 30 ప్లస్ స్కోర్లు సాధించి రోహిత్, రిజ్వాన్ సరసన చేరాడు. ఫైనల్ మ్యాచ్‌లో కూడా అభిషేక్ 30 ప్లస్ స్కోరు చేస్తే ప్రపంచ రికార్డు అవుతుంది.

నక్వీ ఇస్తే..ట్రోఫీ తీసుకుంటారా?

దుబాయ్: ఆసియాకప్ ఫైనల్లో గెలిచిన జట్టుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నక్వీనే ట్రోఫీ అందిస్తాడు. ఎందుకంటే అతనే ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్. ఈనేపథ్యంలో ఒకవేళ భారత్ విజేతగా నిలిస్తే ఏసీసీ చైర్మన్ హోదాలో నక్వీ చేతుల మీదుగా కెప్టెన్ సూర్యకుమార్ కప్‌ను తీసుకుంటాడా? నక్వీకి షేక్‌హ్యాండ్ ఇస్తాడా? అనే చర్చ జరుగుతోంది. భారత్‌తో పాటు బీసీసీఐని కూడా బాహాటంగా విమర్శించే నక్వీ పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగానూ కొనసాగుతున్నాడు.

కెప్టెన్ల ఫొటోషూట్ రద్దు

ఏదైనా టోర్నీ ఫైనల్‌కు ముందు ఇరు జట్ల కెప్టెన్లు ట్రోఫీతో ఫొటో దిగడం పరిపాటి. అయితే ఈసారి ఫొటోషూట్‌ను రద్దు చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. పాక్‌తో వేదిక పంచుకునేందుకు భారత జట్టు నిరాకరించినట్టు సమాచారం.

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



'పాకిస్థాన్ మాకు పోటీయే కాదు..' అని భారత కెప్టెన్ సూర్యకుమార్ ధీమాగా చెప్పాడు. అయినా.. యుద్ధభూమిలోనే కాదు, క్రికెట్ మైదానంలోనూ ఆ జట్టును చిత్తుగా ఓడిస్తే తనివితీరా చూసి ఆనందించాలన్నది అభిమానుల ఆకాంక్ష. అందుకే పాక్‌తో ఆడే ప్రతీ మ్యాచ్‌నూ వారు భావోద్వేగంతో తిలకిస్తుంటారు. పైగా ఈసారి కరచాలన వివాదం, రెచ్చగొట్టే చేష్టల వ్యవహారం సరేసరి..
ఈ నేపథ్యంలో ఆదివారం ఇరు జట్ల మధ్యే ఆఖరి సమరం జరుగబోతోంది. ఈ కీలక మ్యాచ్‌లోనూ 'ఫైనల్' పంచ్ తమదే అవ్వాలని టీమిండియా భావిస్తోంది. అటు గతమెలా ఉన్నా ఈసారి మాత్రం ప్రత్యర్థికి చాన్స్ ఇవ్వకూడదని పాక్ కసితో ఉంది.

మూడోసారీ మోతెక్కించాలి!

ఆసియాకప్

నేడు పాక్‌తో భారత్ టైటిల్ ఫైట్

తీవ్ర ఒత్తిడిలో దాయాది ● హార్దిక్ ఆడేనా?

దుబాయ్: దాదాపు ఏకపక్ష మ్యాచ్‌లతో.. అక్కడక్కడా ఉత్కంఠభరిత క్షణాలతో సాగిన ఆసియాకప్ ఆఖరి అంకానికి చేరుకుంది. 41 ఏళ్ల టోర్నీ చరిత్రలో భారత్-పాక్ జట్లు తొలిసారి ఫైనల్లో తలపడబోతున్నాయి. దీంతో ఆదివారం జరిగే ఈ హైవోల్టేజి సమరంపై ఆసక్తి రెట్టింపయ్యింది. టోర్నీలో భారత్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఓటమనేదే లేకుండా తుది పోరుకు అర్హత సాధించగా, అటు పాక్ ఓడిన రెండు మ్యాచ్‌లు భారత్ పైనే కావడం గమనార్హం. ఏదిఏమైనా ఆపరేషన్ సింధూర్ ప్రభావం ఈ ఆసియాకప్‌పై గట్టిగానే పడిందని చెప్పవచ్చు. కరచాలనం నిరాకరణతో పాటు గ్రూప్ మ్యాచ్‌లో పాక్‌ను ఓడించాక కెప్టెన్ సూర్య తమ విజయాన్ని సైనికులకు అంకితమిచ్చాడు. దీనికి ప్రతిగా అన్నట్టు సూపర్-4 మ్యాచ్‌లో ఫర్హాన్ గన్‌ఫైర్ సంబరాలు, రౌఫ్ 6-0 సంకేతాలు భారత అభిమానుల భావోద్వేగాలను రెచ్చగొట్టినట్టయ్యింది. ఇరు బోర్డుల పరస్పర ఫిర్యాదులతో ఐసీసీ జరిమానాలు కూడా విధించింది. వ్యవహారం ఇంతవరకూ వచ్చాక ఫైనల్లో ఆ ప్రభావం ఎలా ఉండబోతున్నదనే సందేహం అందరిలో నెలకొంది. ఓవరాల్‌గా టీ20ల్లో ఆడిన 15 మ్యాచ్‌ల్లో భారత్ 11-3తో పాక్‌పై స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఓ మ్యాచ్ టైగా ముగిసింది. అదే ఆసియా కప్‌లో ఆడిన ఐదు టీ20 మ్యాచ్‌ల్లోనూ 4-1తో భారత్‌దే పైచేయి.

గాయాలతో ఆందోళన

ఫైనల్‌కు ముందు భారత్‌ను గాయాల బెడద వేధిస్తోంది. శ్రీలంకతో మ్యాచ్‌లో హార్దిక్ తొడకండరాలు పట్టేయడంతో ఒక్క ఓవర్‌కే పరిమితమై మైదానం వీడాడు. దీంతో ఫైనల్లో అతడు బరిలోకి దిగడం సందేహంగా మారింది. ఆదివారం ఉదయం పాండ్యాపై ఓ అంచనాకు రానున్నట్టు బౌలింగ్ కోచ్ మోర్కెల్ తెలిపాడు. అభిషేక్ సైతం కండరాల నొప్పితో శ్రీలంక ఇన్నింగ్స్ పదో ఓవర్‌లో గ్రౌండ్‌ను వీడి తిరిగి రాలేదు. అయితే తను బాగానే ఉన్నట్టు మోర్కెల్ ప్రకటించడం సానుకూలాంశం కానుంది. ఎందుకంటే అభిషేక్ భీకర ఫామ్‌ను చూసే పాక్ జట్టు భయపడుతోంది. భారత్ కూడా అతడి మెరుపు ఆరంభాలపైనే అతిగా ఆధారపడింది. గిల్, కెప్టెన్ సూర్య అంచనాలను అందుకోలేకపోతున్నారు. ఒకవేళ అభిషేక్ విఫలమైతే పరిస్థితి ఏమిటనేది జట్టు ఆలోచించాల్సిన విషయం. లంకపై శాంసన్, తిలక్‌లకు మాత్రం తగిన మ్యాచ్ ప్రాక్టీస్ లభించింది. ఇద్దరూ స్వేచ్ఛగా ఆడగలిగారు. మరోవైపు బౌలింగ్‌లో మరింత ప్రభావం చూపాల్సిన అవసరం ఉంది. ఇప్పటిదాకా ఆడిన మ్యాచ్‌ల్లో భారత బౌలర్లు 60 వికెట్లకు 41 మాత్రమే తీయగలిగారు. యూఏఈ, బంగ్లా జట్లను మాత్రమే ఆలౌట్ చేయగలిగారు. స్పిన్నర్ కుల్దీప్ 13 వికెట్లతో నిలకడగా రాణిస్తున్నా అతడికి సహకారం కరువైంది. స్పిన్ పిచ్‌లపైనా వరుణ్ ఐదు, అక్షర్ నాలుగు వికెట్లతో సరిపెట్టుకున్నారు. అటు పేసర్ బుమ్రా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీసినా అతడి నుంచి జట్టు మరింతగా ఆశిస్తోంది. ఫైనల్లో తన సత్తాకు తగ్గట్టు రాణిస్తే పాక్‌ను కట్టడి చేయవచ్చు. దూబే స్థానంలో అర్ష్‌దీప్‌నే కొనసాగిస్తారా? అనేది వేచిచూడాల్సిందే.

బ్యాటింగ్‌లో రాణిస్తేనే..

పాకిస్థాన్ బ్యాటింగ్ ఆర్డర్‌లో నిలకడైన బ్యాటర్ కనిపించడం లేదు. బుమ్రాను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్ ఫర్హాన్ కాస్త మినహాయింపు. సయీమ్ అయూబ్ 6 మ్యాచ్‌ల్లో 23 పరుగులే చేయగా ఇందులో 4 డకౌట్లున్నాయి. తలత్, కెప్టెన్ సల్మాన్ స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడుతున్నారు. చివర్లో షహీన్ అఫ్రీది బ్యాటింగ్ మెరుపులే ఆ జట్టుకు కీలక పరుగులు అందిస్తున్నాయి. అయితే పేసర్లు షహీన్, రౌఫ్ ఆకట్టుకుంటున్నారు. వీరు భారత టాపార్డర్‌ను ఆరంభంలోనే దెబ్బతీస్తే లో స్కోరింగ్ మ్యాచ్‌కు అవకాశం ఉంటుంది. సయీమ్ బౌలింగ్‌లో మాత్రం రాణిస్తూ 8 వికెట్లు తీయగలిగాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, హార్దిక్, అక్షర్, కుల్దీప్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్/దూబే.

పాకిస్థాన్: ఫర్హాన్, ఫఖర్ జమాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), తలత్, మహ్మద్ హారిస్, నవాజ్, సుఫియాన్, షహీన్ అఫ్రీది, హారిస్ రౌఫ్.



వావ్.. శీతల్

పారా ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణంతో చరిత్ర

మొత్తం 3 పతకాలతో అదరగొట్టిన కశ్మీర్ ఆర్చర్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): భారత ఆర్చర్ శీతల్ దేవి చరిత్ర సృష్టించింది. ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో ఆమె పసిడి పతకం కొల్లగొట్టింది. తద్వారా ఈ టోర్నీ కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచిన చేతులు లేని తొలి మహిళా ఆర్చర్‌గా శీతల్ రికార్డు నెలకొల్పింది. 18 ఏళ్ల శీతల్ హోరాహోరీ ఫైనల్లో 146-143తో వరల్డ్ నెం.1 ఆర్చర్ ఒజ్నూర్ క్యూర్ గిర్డీ (టర్కీ)ని చిత్తుచేసి ప్రపంచ టైటిల్ అందుకుంది. అంతేకాదు..మిక్స్‌డ్, మహిళల టీమ్ విభాగాల్లోనూ పతకాలు సాధించి మొత్తం మూడు మెడల్స్‌తో అదరగొట్టింది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన శీతల్ పాదాలు, భుజం ఉపయోగించి బాణాలు సంధిస్తుంది. టోర్నీలో చేతులు లేకుండా పోటీపడుతున్న ఏకైక ఆర్చర్ దేవినే కావడం విశేషం. పారా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో గతంలో చేతులులేని ఆర్చర్ పతకం గెలవడం పురుషుల విభాగంలో చోటుచేసుకుంది. ఇక, తాజా టోర్నీ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్ తోమన్ కుమార్ పసిడి పతకంతో మెరిశాడు. ఫైనల్లో భారత్‌కే చెందిన రాకేశ్ కుమార్ పోటీ నుంచి వైదొలగడంతో తోమన్‌కు స్వర్ణం దక్కింది. పసిడితో చరిత్ర సృష్టించిన శీతల్.. తోమన్ జతగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం అందుకుంది. కాంపౌండ్ మహిళల టీమ్ కేటగిరీ ఫైనల్లో ఓటమి చవిచూసిన శీతల్/సరిత జోడీ రజతంతో సరిపెట్టుకుంది.



దీప్తికి రజతం

ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో తెలంగాణకు చెందిన దీప్తి జీవాంజి రజతంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల 400 మీటర్ల టీ20 విభాగం రేసులో దీప్తి 55.16 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాకు చెందిన 22 ఏళ్ల దీప్తి గతేడాది ఈ టోర్నీలో విజేతగా నిలిచింది. కానీ, ఈసారి రజతానికే పరిమితమైంది. ఇక, నిరుడు రన్నరప్‌గా నిలిచిన టర్కీ రేసర్ ఐసెల్ ఆండర్ 54.96 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం సొంతం చేసుకొంది. కాగా, పురుషుల హైజంప్ టీ63 కేటగిరీలో విజేతగా నిలిచిన శైలేష్ కుమార్ ఈ టోర్నీలో భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించాడు. భారత్‌కే చెందిన వరుణ్ సింగ్ భాటి కాంస్యం దక్కించుకొన్నాడు. 1.91 మీటర్ల ఎత్తు దూకిన శైలేష్ చాంపియన్‌షిప్స్ ఆసియా రికార్డును బద్దలుకొట్టాడు. భాటి, ఎజ్రా ఫ్రెంచ్ (అమెరికా) 1.85 మీటర్లతో సమంగా నిలిచారు. కానీ, కౌంట్‌బ్యాక్‌లో ఎజ్రాకు రజతం, భాటికి కాంస్యం దక్కాయి.

అల్‌కాబీ ప్రపంచ రికార్డు: యూఏఈ అథ్లెట్ తెగ్రా అల్ కాబీ మహిళల 100 మీ టీ71 ఫ్రేమ్ రన్నింగ్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 19.89 సెకన్లలో రేస్‌ను పూర్తి చేసిన అల్‌కాబీ..ఈ ఏడాది బెల్లా మార్కస్ (లిథువేనియా-20.08 సె) రికార్డును అధిగమించింది.

రష్మిక జోడీకి స్వర్ణం

షూటింగ్ జూ. వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు టాప్-2తో అదరగొట్టగా.. స్కీట్‌లో రైజా ఢిల్లాన్ రజతం సాధించింది. శనివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సహచర భారత జోడీల మధ్య జరిగిన ఫైనల్లో రష్మిక సెహగల్-కపిల్ జంట 16-10తో వన్షిక చౌదరి-ఆంథోనీ జొనాథన్ జంటపై గెలిచి స్వర్ణం సాధించింది. మహిళల స్కీట్ ఫైనల్లో ఢిల్లాన్ రజతంతో సరిపెట్టుకొంది. మాన్సీ రఘువంశీ కాంస్యం దక్కించుకొంది. దీంతో భారత్ మూడు స్వర్ణాలు సహా 11 పతకాలతో అగ్రస్థానంలో ఉంది.

'శాఫ్' విజేత భారత్

కొలంబో: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 చాంపియన్‌షిప్‌ను భారత్ గెల్చుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో యువ భారత్ 4-1తో పెనాల్టీ షూటౌట్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి ఇరుజట్ల స్కోర్లు 2-2తో సమంగా ఉన్నాయి. కాగా, ఈ టైటిల్ నెగ్గడం భారత్‌కిది ఏడోసారి.

బిజినెస్ ప్లస్

ఇరాక్‌లో 'అపోలో' వైద్య సేవలు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్ తన వైద్య సేవలను ఇరాక్‌కు విస్తరిస్తోంది. ఇందుకోసం ఆ దేశానికి చెందిన అంతర్గత మంత్రిత్వ శాఖతో ఒక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా అపోలో హాస్పిటల్స్. ఇరాక్ అంతర్గత భద్రతా దళాల హాస్పిటల్ నిర్వహణ చేపట్టడంతో పాటు ఆ దేశ భద్రతా దళాలు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అత్యాధునిక వైద్య సేవలు అందిస్తుందని అపోలో జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు. కాగా 'హీల్ ఇన్ ఇండియా, హీల్ బై ఇండియా, హీల్ ఫ్రమ్ ఇండియా' అనే తమ నినాదంలో భాగంగా తమ వైద్య సేవలను ఇరాక్‌కు విస్తరిస్తున్నట్టు అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు.

ఎన్‌టీపీసీ రూ.3,248 కోట్ల తుది డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.3,248 కోట్ల తుది డివిడెండ్‌ను అందించింది. ఎన్‌టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్.. విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్‌కు ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు. కాగా గత ఏడాది నవంబరులో రూ.2,424 కోట్లు, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో రూ.2,424 కోట్ల మధ్యంతర డివిడెండ్స్‌ను అందించింది. దీంతో గడచిన ఆర్థిక సంవత్సరంలో ఎన్‌టీపీసీ మొత్తం రూ.8,096 కోట్ల డివిడెండ్‌ను చెల్లించినట్లయింది.

ఎన్‌పీఎస్ మరింత ఆకర్షణీయం

పూర్తి ఈక్విటీ పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ● అక్టోబరు నుంచే అమలు



వచ్చే నెల 1 నుంచి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ఈ మార్పుల్లో భాగంగా మదుపరులకు పెట్టుబడుల విషయంలో అనేక ఐచ్ఛికాలు, వెసులుబాట్లు లభించబోతున్నాయి. ఈ మార్పులు, చేర్పులు ఏమిటో ఒక లుక్కేద్దాం.

ప్రభుత్వేతర ఉద్యోగుల రిటైర్‌మెంట్ ప్రయోజనాల కోసం 2009లో ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ పథకం అనేక మంది ఆదరణ చూరగొంది. ప్రైవేటు రంగంతో పాటు స్వయం ఉపాధిలో ఉన్న అనేక మంది వృత్తి నిపుణులకూ ఈ పథకం చక్కటి రిటైర్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా మారిందంటే ఆశ్చర్యం లేదు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ పథకంలో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తోంది. అక్టోబరు 1 నుంచి ఈ పథకంలో అనేక మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. అవేమిటంటే?

ఈక్విటీ పెట్టుబడుల ఆప్షన్

ప్రస్తుత ఎన్‌పీఎస్ నిబంధనల ప్రకారం మదుపరులు తమ వయసు ఆధారంగా 25 నుంచి 75 శాతం పెట్టుబడులను ఈక్విటీ షేర్లలో పెట్టుబడి పెట్టే ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. అక్టోబరు 1 నుంచి ఎన్‌పీఎస్‌లోని ప్రభుత్వేతర ఉద్యోగులు తమ వయసుతో సంబంధం లేకుండా మల్టిపుల్ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎంఎస్ఎఫ్) ద్వారా 100 శాతం ఈక్విటీ పెట్టుబడి ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. రిటైర్‌మెంట్ తర్వాత ఆర్థిక భద్రతకు ఢోకా లేని మదుపరులకు మాత్రమే ఈ ఆప్షన్ మేలు చేస్తుంది. మార్కెట్ ఆటుపోట్లకు తట్టుకోలేని స్థిర ఆదాయం కోరుకునే మదుపరులు ఈ ఆప్షన్ జోలికి పోకపోవడమే మంచిది.

ఎంఎస్ఎఫ్ అంటే?

ఇప్పటి వరకు ఒక పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్ (ప్రాన్) కింద ఒక స్కీమ్‌ను మాత్రమే అనుమతించేవారు. అక్టోబరు 1 నుంచి కొత్తగా ఎంఎస్ఎఫ్ అమల్లోకి వస్తోంది. దీంతో ఇక ఒకే సమయంలో వివిధ సెంట్రల్ రికార్డ్ ఏజెన్సీ (సీఆర్ఏ)ల ద్వారా ఒకే 'ప్రాన్'తో మన పెట్టుబడి స్కీమ్‌లను నిర్వహించుకోవచ్చు. దీని వల్ల మదుపరులకు తమ పెట్టుబడుల నిర్వహణకు సంబంధించి మరింత వెసులుబాటు, చాయిస్‌లు ఏర్పడతాయి.

ఇతర ప్రతిపాదిత మార్పులు

అక్టోబరు 1 నుంచి ఎన్‌పీఎస్ పెట్టుబడుల ఎగ్జిట్, విత్‌డ్రాయల్స్ మరింత సులభతరం కానున్నాయి. దీనికి సంబంధించి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఇటీవల మారిన నిబంధనలతో ఒక ముసాయిదా పత్రం కూడా విడుదల చేసింది.

ప్రభుత్వేతర ఉద్యోగుల ఎగ్జిట్

ఇప్పటి వరకు 60 ఏళ్ల వయసు లేదా ఎక్కువ కాలం ఎన్‌పీఎస్‌లో ఉన్న ప్రభుత్వేతర ఉద్యోగులకు మాత్రమే ఎగ్జిట్ ఆప్షన్ ఉంది. అక్టోబరు 1 నుంచి ఎన్‌పీఎస్‌లో 15 ఏళ్లు పూర్తయిన ప్రభుత్వేతర ఉద్యోగులూ ఎగ్జిట్ ఆప్షన్ ఎంచుకోవచ్చు. మధ్యలో నగదు అవసరమైన ఖాతాదారులకు ఈ మార్పు ఎంతో మేలు చేయనుంది.


విత్‌డ్రాయల్స్

మారిన కొత్త నిబంధనల ప్రకారం రిటైర్‌మెంట్ నాటికి ఎన్‌పీఎస్‌లో పోగైన మొత్తం రూ.5 లక్షలకు మించి ఉంటే, అందులో 60 శాతాన్ని, రూ.5 లక్షల లోపు ఉంటే పూర్తి మొత్తాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. జమ అయిన మొత్తం రూ.2.5 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉండి మధ్యలోనే వెనక్కి తీసుకోవాలనుకుంటే మాత్రం పోగైన మొత్తంలో 80 శాతంతో యాన్యుటీ కొనుగోలుతో మిగతా మొత్తం వెనక్కి తీసుకోవచ్చు. ఒకవేళ ఖాతాదారులు చనిపోతే మాత్రం వారి వారసులు రూ.2.5 లక్షల మొత్తాన్ని పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు.

'అండమాన్'లో ఆయిల్ ఇండియాకు జాక్‌పాట్

గ్యాస్ నిక్షేపాలు కనుగొన్న సంస్థ

295 మీటర్ల లోతులోనే సహజవాయువు జాడ



న్యూఢిల్లీ: అండమాన్ తీర ప్రాంత సముద్ర గర్భంలోనూ సహజ వాయువు (గ్యాస్) నిక్షేపాలు బయట పడుతున్నాయి. అండమాన్ దీవుల తూర్పు ప్రాంతంలో తీరానికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రంలో ప్రభుత్వ రంగ కంపెనీ ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్)కి సహజ వాయువు నిక్షేపాల జాడ లభించింది. ఈ ప్రాంతంలో తవ్విన ఒక అన్వేషణాత్మక బావిలో 295 మీటర్ల లోతులో గ్యాస్ నిక్షేపాల జాడ లభించినట్టు ఓఐఎల్ వెల్లడించింది. అయితే ఈ బావి నుంచి రోజుకు ఎంత మొత్తంలో గ్యాస్ లభించే అవకాశం ఉందనే విషయంపై కంపెనీ ఇంకా ఒక అంచనాకు రాలేదు. నిర్ణీత 2,650 మీటర్లు తవ్వితే గానీ దీనిపై ఒక అంచనాకు రాలేమని అధికార వర్గాలు చెప్పాయి. ఆంధ్రప్రదేశ్, కాకినాడలోని లేబొరేటరీలో జరిపిన పరీక్షలో ఈ గ్యాస్‌లో 87 శాతం వరకు మిథేన్ ఉన్నట్టు తేలినట్టు ఆయిల్ ఇండియా తెలిపింది.

భారీగానే నిక్షేపాలు

అండమాన్ దీవులకు సమీపంలో మయన్మార్, ఇండోనేషియా తీరాల్లో ఇప్పటికే భారీ చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. దీంతో అండమాన్, నికోబార్ దీవులు, వాటి తీర ప్రాంతంలోనూ భారీగానే చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఇటీవల వెలువడిన 'ఇండియా హైడ్రోకార్బన్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీ' నివేదిక ప్రకారం చూసినా, ఈ ప్రాంతంలో దాదాపు 37.1 కోట్ల టన్నుల చమురుకు సమానమైన చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఓఐఎల్ కంపెనీలు రూ.3,200 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత సముద్ర జలాల్లో చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ ప్రారంభించాయి. కాగా కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి కూడా అండమాన్ ప్రాంతంలో భారీగానే చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే.

భారత వృద్ధికి అమెరికా సుంకాలే పెద్ద ముప్పు: క్రిసిల్

కోల్‌కతా: భారత ఆర్థిక వృద్ధికి అమెరికా విధించిన భారీ సుంకాలే పెద్దముప్పుగా పరిణమించే ప్రమాదముందని క్రిసిల్ ఇంటలిజెన్స్ హెచ్చరించింది. డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు.. దేశీయ ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు రెండింటిపైనా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఒక నివేదికలో వెల్లడించింది. అయితే ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, వడ్డీ రేట్ల తగ్గింపు కారణంగా దేశీయ వినియోగం మాత్రం వృద్ధికి తోడ్పాటునందిస్తుందని అంచనా వేసింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గవచ్చని అంచనా వేస్తున్నట్లు క్రిసిల్ వెల్లడించింది.

● పండగ సీజన్‌లో ద్విచక్ర వాహనాలకు రికార్డు స్థాయిలో డిమాండ్ పెరిగిందని హీరో మోటోకార్ప్ వెల్లడించింది. జీఎస్‌టీ తగ్గింపుతో 100 సీసీ, 125 సీసీ విభాగంలో వాహనాలను కొనుగోలు చేసేందుకు కస్టమర్లు మక్కువ చూపుతున్నట్లు తెలిపింది.

● ఇమేజింగ్ టెక్నాలజీ సంస్థ ఓఎం సిస్టమ్.. భారత మార్కెట్లోకి ఓఎం-5 మార్క్-2 ఇంటర్‌చేంజబుల్ లెన్స్ కెమెరా, ఎం.జుకో డిజిటల్ ఈడీ 50-200 ఎంఎం ఎఫ్2.8 ఐఎస్ ప్రొ లెన్స్ కెమెరాలను విడుదల చేసింది. వీటి ధరలు వరుసగా రూ.1,39,990, రూ.3,29,990గా ఉన్నాయి.

● మహీంద్రా ట్రాక్టర్స్.. మార్కెట్లోకి సరికొత్త మహీంద్రా యువో టెక్ ప్లస్ 475 డీఐ ట్రాక్టర్‌ను తీసుకువచ్చింది. రైతుల వ్యవసాయ, వ్యవసాయేతర అవసరాలు తీర్చే విధంగా ఈ 42 హెచ్‌పీ ట్రాక్టర్‌ను రూపొందించింది. ఈ ట్రాక్టర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మహీంద్రా ట్రాక్టర్స్ డీలర్‌షిప్స్‌లో అందుబాటులో ఉండనుంది.

● అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో సాగుతుందని పీఎల్ క్యాపిటల్ వెల్లడించింది. విధానపరమైన సంస్కరణలు, ప్రభుత్వ పెట్టుబడులు, ద్రవ్యోల్బణం, ఈక్విటీ మార్కెట్ల ఔట్‌లుక్ సానుకూలంగా ఉండటం వృద్ధికి కలిసొచ్చే అవకాశాలని తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,15,480 ▲	1,05,850 ▲	1,56,000 ▲
విజయవాడ	1,18,500 ▲	1,11,500 ▲	1,43,000 ▲
విశాఖపట్నం	1,15,470 ▼	1,05,850 ▲	1,59,000 ▲
రాజమండ్రి	1,15,470 ▲	1,05,850 ▲	1,47,100 ▲
ప్రొద్దుటూరు	1,19,000 ▲	1,09,480 ▲	1,47,500 ▲
ముంబై	1,13,262 ▼	1,03,748 ▼	1,38,100 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ

హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	558	విశాఖపట్నం	530

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	117
వరంగల్	105	గుంటూరు	120
కరీంనగర్	105	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	95
కర్నూలు	105	నెల్లూరు	100
విశాఖపట్నం	122	అనంతపురం	100
గోదావరి	117		

ఒకట్రెండు రోజుల్లో గ్రూప్-2 తుది జాబితా!

» ఏర్పాట్లు పూర్తిచేసిన టీజీపీఎస్సీ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-2 సర్వీసు పోస్టుల తుది జాబితా విడుదలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సిద్ధమైంది. సాధ్యమైనంత త్వరగా ఫలితాలు వెల్లడించాలని కసరత్తు చేస్తోంది. గ్రూప్-2లో వివిధ ప్రభుత్వ శాఖల్లో 783 ఉద్యోగాల భర్తీ కోసం ఇప్పటికే ధృవీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది. అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, మెరిట్, తదితర విషయాలు పరిగణనలోకి తీసుకుని ఒకట్రెండు రోజుల్లో తుది జాబితా ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల పోస్టుల తుది జాబితాను కమిషన్ శనివారం విడుదల చేసింది. మొత్తం 181 పోస్టుల్లో 176 పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల తుది జాబితా వెబ్‌సైట్లో ఉంచామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.

తుమ్మిడిహెట్టిపై వచ్చే నెల్లో మహారాష్ట్రకు సీఎం

» 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి కసరత్తు షురూ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి వీలుగా సమ్మతి కోసం అక్టోబరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ కానున్నారు. 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం వల్ల కలిగే ముంపుపై ఇప్పటికే పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనం నిర్వహించింది. 1,467 ఎకరాలు ఎకరాలు ముంపునకు గురవుతాయని లెక్కతేల్చింది. దాంతో ఆ నివేదిక ఆధారంగా మహారాష్ట్ర సీఎంను కలిసి.. 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలపాలని సీఎం రేవంత్ కోరే అవకాశం ఉంది. 2013 భూసేకరణ చట్టం అనుసరించి నిర్వాసితులకు గరిష్ఠ పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎకరానికి రూ.25 లక్షల దాకా పరిహారానికి ప్రభుత్వం సమ్మతి తెలిపే అవకాశాలు ఉన్నాయి.

తెలంగాణపై కేంద్రం కక్ష కట్టింది

» పరిశ్రమలను ఇతర రాష్ట్రాలకు పంపుతోంది: దుద్దిళ్ల

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతినిచ్చే విషయంలో కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రాకుండా వివక్ష చూపుతోందని ఆరోపించారు. తెలంగాణ ఐటీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో శనివారం హైటెక్ సిటీలో నిర్వహించిన 'పిచ్ టు ప్రైస్'లో ఆయన పాల్గొన్నారు. వినూత్న ఆవిష్కరణలతో ఆకట్టుకున్న స్టార్టప్ కంపెనీలకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ఇటీవలే ఓ ప్రముఖ సెమీ కండక్టర్ల కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధమైంది. వారు కోరిన విధంగా భూముల కేటాయింపునకూ ప్రభుత్వం అనుమతించింది. ఇలా అన్ని అర్హతలున్న రాష్ట్రాన్ని విస్మరించి.. ఆ కంపెనీని బీజేపీ పాలిత ప్రాంతం అసోంలో పెట్టేలా కేంద్రం ప్రోత్సహించింది. ఇలాగే, మరో చిప్ కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధమైతే.. కేంద్రంలో బీజేపీకి మద్దతుగా ఉన్నందున ఏపీకీ ఆ ప్రాజెక్టు కేటాయించింది" అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని అనుకూలతలు తెలంగాణకు ఉన్నాయని, ఇక్కడి పారిశ్రామిక విధానాలతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. కాగా, ఈ కార్యక్రమానికి మంత్రి మెట్రోలో ప్రయాణించి వచ్చారు. ఎల్బీనగర్ నుంచి రాయదుర్గం వరకు రోడ్డు మార్గంలో రావాలంటే.. 3 గంటల సమయం పడుతుందని, మెట్రోలో మాత్రం ఎలాంటి సమస్య లేకుండా వేగంగా వచ్చేశానని శ్రీధర్‌బాబు అన్నారు.

బలహీన వర్గాల నోటికాడి ముద్ద లాగొద్దు!

» బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోకు వ్యతిరేకంగా న్యాయపరమైన సమస్యలు సృష్టించి బలహీన వర్గాల నోటి కాడి ముద్ద లాగొద్దని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా వచ్చిన రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. గతంలో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కేంద్రం 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఎవరు వ్యతిరేకించలేదని అన్నారు. ఒకవేళ రాష్ట్రాలు పంపిన ప్రతిపాదనలు.. గవర్నర్, రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉంటే ఆ ప్రతిపాదనల్ని అమలు చేసుకోవచ్చని, ఇటీవల తమిళనాడు కోర్టు తీర్పు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు.

ఓట్ చోరీతోనే మూడోసారి ప్రధానిగా మోదీ

» ఈటల భారీ విజయానికి అదే కారణం: మహేశ్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీతోనే మూడోసారి మోదీ అధికారంలోకి వచ్చారని.. ఓట్ చోరీ జరిగిందని 80 శాతం ప్రజలు నమ్ముతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు.. గ్రామగ్రామాన ఓట్ చోరీ జరిగిందని నమ్ముతున్న వారి నుంచి సంతకాల సేకరణ చేపడుతున్నట్టు తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. బీజేపీ ఓటు చోరీకి పాల్పడిందనే విషయాన్ని రాహుల్ గాంధీ ఆధారాలతో బహిర్గతం చేశారన్నారు. ఓట్ చోరీతోనే తెలంగాణలో బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచారని పాదయాత్రలోనే వెల్లడించినట్టు గుర్తు చేశారు. ఈటల రాజేందర్ 3 లక్షల ఓట్ల మెజారిటీ గెలుపు వెనక ఓట్ చోరీ జరిగిందన్నారు. ఓట్ చోరీపై రాహుల్ సంధించిన ప్రశ్నలకు బీజేపీ నేతలు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొవడానికి ముఖం చెల్లక బాకీ కార్డు పేరుతో కేటీఆర్ కొత్త డ్రామా మొదలుపెట్టారని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య ధ్వజమెత్తారు. సోనియమ్మ మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఇస్తే సీఎంగా కేసీఆర్ అప్పుల పాలు చేశారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే అల్టిమేటంతో కదిలిన పీసీబీ

» అరబిందో ఫార్మాలో తనిఖీలు.. నీటి నమూనాల సేకరణ

జడ్చర్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'కాలుష్యాన్ని విడుదల చేస్తున్న అరబిందో ఫార్మాపై చర్యలు తీసుకుంటారా, లేదంటే ఆ పరిశ్రమను తగలబెట్టమంటారా' అంటూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఇచ్చిన అల్టిమేటంతో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు కదిలివచ్చారు. శనివారం జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ నరేందర్ ఆధ్వర్యంలోని బృందం అరబిందో ఫార్మాలో తనిఖీలు నిర్వహించింది. తాము రావడానికి ముందు పరిశ్రమలో కలుషిత నీటిని నిల్వ చేసే ట్యాంకులు శుభ్రం చేసి ఉంచడాన్ని అధికారులు గమనించారు. కలుషిత నీటిని పరిశ్రమ బయటకు వదులుతుండడాన్ని గుర్తించారు. పరిశ్రమలో నుంచి నీటిని వదిలేందుకు ఉన్న 8 ఔట్‌లెట్ల వద్ద నీటి నమూనాలను సేకరించారు. తనిఖీల్లో గుర్తించిన వాస్తవ పరిస్థితులపై తెలంగాణ పీసీబీ సభ్య కార్యదర్శి రవినాయక్‌కు నివేదిక ఇస్తామని నరేందర్ తెలిపారు. కాగా, పీసీబీ అధికారులు ఇచ్చే నివేదికలో వాస్తవాలు లేకుంటే అన్నంత పనిచేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. పీసీబీ తనిఖీలు చేపట్టడంతో పరిశ్రమను తగలబెడతానన్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నానని చెప్పారు.

నంబర్ ప్లేట్ల మార్పుపై ఆందోళన వద్దు

» బిగింపునకు గడువు విధించలేదు: రవాణా శాఖ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నంబరు ప్లేట్ల మార్పుపై వాహనదారులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేశారు. పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్(హెచ్ఎస్ఆర్‌పీ)లు బిగించేందుకు ఎలాంటి గడువు విధించలేదని వెల్లడించారు. సెప్టెంబరు 30లోగా హెచ్ఎస్ఆర్‌పీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని.. లేదంటే ఆర్టీఏ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని అధికారులు తెలిపారు. వాహనాలకు నంబరు ప్లేట్ల మార్పు అంశం ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉందని, ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని పేర్కొన్నారు.

కమీషన్లు రావనే బీఆర్ఎస్ హయాంలో ఇళ్లు కట్టలేదు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా.. మా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంది : మంత్రి పొంగులేటి

సికింద్రాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కమీషన్లు రావనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వలేదని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. భారీగా కమీషన్లు దండుకోవచ్చనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఏడాదికి లక్ష ఇళ్లు నిర్మించి ఇచ్చినా, ఈ పాటికి పది లక్షల ఇళ్లు పేదలకు దక్కేవని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత బాగా లేకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని రసూల్‌పురా జోపిడి సంఘంలో రూ.22.32 కోట్లతో 5 బ్లాక్‌లుగా నిర్మించిన 288డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి పొంగులేటి శనివారం ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అర్బన్ ప్రాంతాల్లో పెండింగులో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేస్తామని తెలిపారు. సొంత స్థలాలు కలిగిన వారికి ఇళ్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో శుభవార్త చెబుతుందన్నారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రసూల్‌పురాలో గతంలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు నిధుల కొరతతో పెండింగ్‌లో ఉండగా, తమ ప్రభుత్వం నిధులు కేటాయించి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిందని వెల్లడించారు. ప్రజలు ఎంతో ఆశగా ఇళ్ల కోసం ఎదురు చూసినా కూడా బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని, ప్రస్తుతం గృహప్రవేశాలు సైతం జరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఇళ్ల నిర్మాణం ఎలా చేపట్టాలనే విషయమై ముఖ్యమంత్రితో, మంత్రి పొంగులేటితో కలిసి తాను చర్చిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో ఎంపీ ఈటల మాట్లాడి కంటోన్మెంట్ స్థలాలు కేటాయిస్తే వేలాది మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లతోపాటు కొత్తగా తాము రేషన్ కార్డులు ఇస్తున్నామని చెప్పారు.



సికింద్రాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీని ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం తదితరులు

పదేళ్ల పాలకులు.. నమ్మక ద్రోహులు

(మొదటిపేజీ తరువాయి)



మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి.. ఇటీవల గ్రూప్-1 అధికారులుగా ఎంపికైన 562 మందికి సీఎం నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి సాధించలేని విజయాన్ని తాము సాధిస్తున్నామన్న అక్కసుతో, కడుపులో విషం పెట్టుకుని ఫలితాలను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన దాకా.. అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఒక్కో పోస్టుకు రూ.2 కోట్లు, రూ.3 కోట్లు తీసుకుని ఉద్యోగాలిచ్చామంటూ ఆరోపించారని, లక్షల రూపాయలు ఖర్చుచేసి పెద్ద పెద్ద న్యాయవాదులను నియమించుకున్నారని చెప్పారు. నియామకాలు పూర్తయితే తమకు వ్యాపారం ఉండదన్న దురుద్దేశంతో అశోక్‌నగర్‌లోని కొన్ని కోచింగ్ సెంటర్లు ప్రతిపక్షాలకు మద్దతుగా నిలిచాయని విమర్శించారు. అయితే.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. తనకు గ్రూప్-1 అభ్యర్థుల భవిష్యత్తు మాత్రమే కనిపించిందన్నారు.

ఇట్లుంటది తెలంగాణ..

"కొంతమంది అప్పుడప్పుడు తెలంగాణ ఎక్కడున్నది? తెలంగాణ ఎట్లుంటది? అని అడుగుతున్నరు. వారందరికీ ఇక్కడి నుంచే చెబుతున్నా. తెలంగాణ ఇక్కడే ఉంది.. ఇట్లుంటది తెలంగాణ. ఇదే తెలంగాణ స్ఫూర్తి, తెలంగాణ చైతన్యం, తెలంగాణ భవిష్యత్తు" అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ గడ్డపై ప్రజలను మోసగించినోళ్లు చరిత్రలో కలిసిపోయారని చెప్పారు. అయినా.. కొంత మంది తాము కారణజన్ములమని, తమ కుటుంబమే తెలంగాణ అని భావించారని పరోక్షంగా కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చివరికి వారు తెలంగాణ చరిత్రలో నమ్మకద్రోహులుగా నిలిచిపోయారన్నారు. పదేళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించకుండా బాధ్యతారహితంగా వ్యవహరించారని, శ్రీకాంతచారి, యాదయ్య, ఇషాన్‌రెడ్డి లాంటి వాళ్ల త్యాగాలను అపహాస్యం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఆర్ఎంపీ వైద్యులను టీజీపీఎస్సీలో సభ్యులుగా నియమించారని, దానిని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని రేవంత్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 లాంటి రాష్ట్ర ఉన్నత ఉద్యోగులను నియమించే కమిషన్‌లో చిన్నపాటి ఉద్యోగులు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అందుకే గ్రూప్-1 ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, జిరాక్స్ సెంటర్‌లో బయటపడ్డాయని అన్నారు. టీజీపీఎస్సీని యూపీఎస్సీ స్థాయిలో ప్రక్షాళన చేస్తామని తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేసి చూపించామన్నారు. డీజీపీగా పనిచేసిన వ్యక్తిని కమిషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తు చేశారు. గత 40 ఏళ్లలో సాధించని దానిని.. తాము కేవలం 19 నెలల్లోనే గ్రూప్-1 పూర్తిచేసి చూపించామన్నారు.

4 కోట్ల ప్రజల అభివృద్ధే లక్ష్యం కావాలి..

"ఇక నుంచి తెలంగాణ యంత్రాంగాన్ని నడిపించే బాధ్యత మీపై ఉంది. మనమంతా కలిసి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అవుదాం. దేశానికి కావాల్సింది గుజరాత్ మోడల్ కాదు.. తెలంగాణ మోడల్. మనమేంటో సత్తా చూపించాలి. నిన్నటివరకు మీరు నిరుద్యోగులు. రేపటి నుంచి ఆఫీసర్లు. అధికారులుగా బాధ్యతగా వ్యవహరించాలి. 4 కోట్ల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ఉండాలి" అని గ్రూప్-1 విజేతలనుద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. ఉద్యోగం సాధించిన వారికి, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు నిర్మాణం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. "మీ భవిష్యత్తు కోసం శ్రమించిన తల్లిదండ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత మీదే. మీకోసం వారి జీవితాన్ని త్యాగం చేశారు. తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే మీ జీతాల్లో నుంచి 10శాతం కట్ చేసి.. వారి ఖాతాల్లో వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో చట్టం తేబోతున్నాం" అని సీఎం అన్నారు. అనంతరం గ్రూప్-1 విజేతలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారంతా సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మీ పట్టుదలతోనే మా కల సాకారమైంది" అని పలువురు తీవ్ర భావోద్వేగంతో అన్నారు. సమావేశం తర్వాత సీఎం వెలుపలికి వస్తున్నప్పుడు కొందరు తల్లిదండ్రులు సీఎంను కలిసి పాదాభివందనం చేయబోగా.. ఆయన అడ్డుకున్నారు.

ఐటీఐలలో ఏటీసీ కేంద్రాలు ప్రారంభం

మహబూబ్‌నగర్/అల్వాల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఐటీఐలతోపాటు హైదరాబాద్ నగరంలోని అల్వాల్ ఐటీఐలో శనివారం అధునాతన సాంకేతిక కేంద్రాలు (ఏటీసీలు) ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్లేపల్లిలోని ఐటీఐ ప్రాంగణం నుంచి వర్చువల్‌గా వీటిని ప్రారంభించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో, నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో, అమ్రాబాద్ మండలం మన్ననూరులో, వనపర్తిలోని నాగవరం శివారులో ఉన్న ఐటీఐలలో ఈ కేంద్రాలను ప్రారంభించగా.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. మరోవైపు అల్వాల్ ఐటీఐ ప్రాంగణంలో టాటా టెక్నాలజీస్ సహకారంతో రూ.6.76 కోట్లతో నిర్మించిన ఏటీసీని ప్రారంభించారు.



ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం నమూనా

భావి నగరికి పునాది నేడు

» శంకుస్థాపన చేయనున్న సీఎం

హైదరాబాద్/సిటీ/ఇబ్రహీంపట్నం/కందుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జంట నగరాలకు పోటెత్తుతున్న జనాభాను కట్టడి చేయడంతో పాటు నగరాలపై ఒత్తిడిని తగ్గించడానికి ఉద్దేశించిన ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ఆదివారం పునాది రాయి పడనుంది. ఇందులో భాగంగా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10:30 గంటలకు రేవంత్‌రెడ్డి.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డితోపాటు అధికారులు పాల్గొననున్నారు. 7.20 ఎకరాల్లో ఈ భవనాన్ని నిర్మించడానికి ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి సమీపంలోనే దీనిని నిర్మిస్తున్నారు. ఈ కార్యాలయం ద్వారా ఫ్యూచర్‌సిటీ పరిధిలో భవనాలు, లేఔట్లు, పారిశ్రామిక అనుమతులన్నీ ఒకే చోట జాప్యం లేకుండా సింగిల్ విండో విధానంలో ఇవ్వనున్నారు. 36మంది రెగ్యులర్, 54 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్రభుత్వం అథారిటీని ఏర్పాటు చేయనుంది. అదేవిధంగా ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డును అనుసంధానం చేస్తూ రూ.4,621 కోట్లతో 41.5కి.మీ. మేర నిర్మించనున్న రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకూ సీఎం శంకుస్థాపన చేస్తారు. ఓఆర్ఆర్ రావిర్యాల(టాటా ఇంటర్‌ఛేంజ్) నుంచి ఫ్యూచర్ సిటీ మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆమన్‌గల్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు(రతన్‌టాటా రోడ్డు) వరకు 300అడుగులతో ఈ రోడ్డు నిర్మించనున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై రేపటి నుంచి విచారణ

» 29, 1 తేదీల్లో నలుగురిపై విచారణ

» పండుగ తర్వాత మరో నలుగురిపై..

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై విచారణకు ముహూర్తం కుదిరింది. విచారణ తేదీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం శాసనసభ కార్యదర్శి షెడ్యూల్‌ను విడుదల చేశారు. సెప్టెంబరు 29, అక్టోబరు 1 తేదీల్లో నలుగురు ఎమ్మెల్యేలను విచారిస్తారు. రెండు రోజుల సమయం కాలె యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌లకు కేటాయించారు. మిగతా నలుగురిని దసరా పండుగ తర్వాత అక్టోబరు ఐదో తేదీలోపు విచారించే అవకాశం ఉందని స్పీకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఇరు వర్గాల వాదనలు స్పీకర్ వింటారు. ఒక్కో ఎమ్మెల్యేకు గంట సమయం కేటాయించారు. పిటిషనర్లుగా కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిలు ఉండగా, ప్రతివాదులుగా ఆ నలుగురు ఎమ్మెల్యేలున్నారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వగా, 8 మంది వివరణ ఇచ్చారు. వారిలో నలుగురిని సోమ, బుధవారాల్లో విచారించనున్నారు. దసరా తర్వాత మూడు, నాలుగు తేదీల్లో మిగిలిన నలుగురిని విచారిస్తారు. బార్బడోస్‌లో జరుగుతున్న కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో పాల్గొనేందుకు అక్టోబరు ఆరున స్పీకర్ ప్రసాద్ కుమార్ బయల్దేరి వెళ్లనున్నారు. అకోబరు 23 వరకూ విదేశాల్లోనే ఉంటారు. ఈ నేపథ్యంలో అక్టోబరు ఐదులోపు అనర్హత పిటిషన్‌కు వివరణ ఇచ్చిన 8 మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేయాలని స్పీకర్ భావిస్తున్నారు. విచారణలో వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించుకోవాలని ఇరువర్గాలను స్పీకర్ కార్యాలయం కోరింది. న్యాయవాదులను నియమించుకున్నట్లుగా టీఆర్ఎస్ ఎల్పీ ప్రతినిధి శుక్రవారం స్పీకర్ కార్యాలయానికి లేఖ కూడా ఇచ్చినట్లు సమాచారం. సోమవారం విచారణ ప్రారంభం కానుంది. బీఆర్ఎస్ టిక్కెట్టుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, సంజయ్ కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ పిటిషన్ ఇచ్చింది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ సుప్రీంకోర్టునూ ఆశ్రయించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు విచారణ ప్రక్రియను ప్రారంభించిన స్పీకర్ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మందీ తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు కూడా వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఈ నాలుగు రోజులు కేవలం విచారణ నడుస్తుందని, నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్ మరికొంత సమయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

పర్యాటకంలో పెట్టుబడులు పెట్టండి

రక్షణ కల్పిస్తాం.. లాభాలు తెప్పించే బాధ్యత తీసుకుంటాం.. ప్రభుత్వాలే మారాయి.. విధానాలు కాదు: రేవంత్

» రూ.15,279 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం పర్యాటకానికి గమ్యస్థానంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో అనేక పర్యాటక కేంద్రాలు, పురాతన, వారసత్వ కట్టడాలు, ఆలయాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకరంగ పెట్టుబడిదారులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఆ పెట్టుబడులకు తమ ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని, లాభాలు తెప్పించే బాధ్యత కూడా తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించిన 'పర్యాటక సదస్సు'కు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో పర్యాటకరంగ విధానమంటూ లేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. న్యూయార్క్‌లో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, కొన్ని దేశాల్లో ఈఫిల్ టవర్, డిస్నీ వరల్డ్ వంటి పర్యాటక కేంద్రాలున్నట్లు.. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో చార్మినార్, గోల్కొండ కోట, రామోజీ ఫిల్మ్‌సిటీ వంటి పర్యాటక కేంద్రాలున్నాయని అన్నారు. వీటితోపాటు అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులు, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, అలంపూర్ శక్తిపీఠం ఉన్నాయన్నారు.



'పర్యాటక సదస్సు'లో సీఎం రేవంత్, భట్టి, జూపల్లి తదితరులు

ప్రపంచంతో పోటీ పడాలనుకుంటున్నాం..

తెలంగాణలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజంతోపాటు మెడికల్ టూరిజం కూడా అభివృద్ధి చెందుతోందని సీఎం రేవంత్ అన్నారు. ఆసియా దేశాలు, మధ్య ప్రాచ్య దేశాల నుంచి ప్రజలు వైద్యసేవల కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడాలన్నదే తమ ఉద్దేశమన్నారు. "గతంలో ఓవైపు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుండగా.. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించాం. అంటే హైదరాబాద్ ఎంత భద్రంగా ఉంటుందో గమనించాలి. అత్యంత భద్రమైన నగరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శాంతిభద్రతలు, పెట్టుబడుల రక్షణ, పర్యాటకుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని సీఎం భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయే తప్ప.. విధానాలు మారలేదని చెప్పారు. "1994 నుంచి 2004 వరకు చంద్రబాబు ప్రభుత్వం, 2004 నుంచి 2014 వరకు రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, 2014 నుంచి 2023 వరకు చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం, ఇప్పుడు నా ప్రభుత్వం ఉన్నాయి. మేమెప్పుడూ మా పాలసీలను మార్చుకోలేదు" అని అన్నారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో 30 పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.15,279 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీంతో 19,520 మందికి ప్రత్యక్షంగా, మొత్తం సుమారు 50వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది. ఇందులో రూ.7,081 కోట్లతో 14 పీపీపీ ప్రాజెక్టులు, రూ.8,198 కోట్ల వ్యయంతో ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉపాసన కొణిదెల

ప్రకృతితో మమేకమయ్యే పండుగే బతుకమ్మ

» ఢిల్లీ సీఎం రేఖా గుప్తా.. రామజస్ కాలేజీలో వేడుకలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాతృత్వం, ప్రకృతితో మమేకమయ్యే పండుగ బతుకమ్మ అని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా వ్యాఖ్యానించారు. ఇది కేవలం పూల పండుగే కాదని.. జీవన సౌందర్యానికి ప్రతీక అని అన్నారు. శనివారం ఢిల్లీలోని రామజస్ కాలేజీలో తెలుగు విద్యార్థి సంఘం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో రేఖాగుప్తా, సీఎస్ఆర్ అపోలో హాస్పిటల్స్ వైస్‌చైర్మన్ ఉపాసన కొణిదెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం రేఖా గుప్తా మాట్లాడుతూ ఢిల్లీలో స్థిరపడిన తెలుగు సమాజం.. తమ కష్టం, ప్రతిభతో నగరాన్ని తీర్చిదిద్ది ఇక్కడి సంస్కృతికి కొత్త రంగులు అద్దిందని కొనియాడారు. ఇక్కడికి వచ్చిన వేలాది మంది విద్యార్థుల ఉత్సాహం, వారి భాగస్వామ్యం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

'పీఎం ధన-ధాన్య'లో 4 జిల్లాలకు చోటు

» కేంద్ర నిర్ణయంపై మంత్రి తుమ్మల హర్షం



హైదరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన'లో రాష్ట్రంలోని నారాయణపేట, గద్వాల, జనగామ, నాగర్‌కర్నూల్ జిల్లాలను ఎంపిక చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ని కలిసి, ఈ పథకంలో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరిన విషయాన్ని తుమ్మల గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి కృతజతలు తెలుపుతూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్పాదకత పెంపు, పంటల మార్పిడి, నీటి పారుదల, నిల్వ, ఉత్పత్తుల విలువ పెంచేలా ప్రాసెసింగ్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే ఈ పథకం చరిత్రాత్మక మార్పు తెచ్చేదిగా పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 4 జిల్లాల్లో రూ.960 కోట్ల వార్షిక వ్యయంతో ఆరేళ్ల పాటు అమలు చేయబోతున్నారని చెప్పారు. ధన-ధాన్య కృషి యోజన.. 36 కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం అవుతుందన్నారు. కేవలం వర్షాధార, తక్కువ ఉత్పాదకత చూపుతున్న ప్రాంత రైతులకు లాభం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమంతో పాటు దేశవ్యాప్తంగా ఆహార భద్రత, ఉపాధి అవకాశాల పెంపునకు తోడ్పడుతుందన్నారు.

మా బిల్లులు చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలి

» ఎన్నికల సంఘానికి తెలంగాణ సర్పంచుల జేఏసీ వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): గతంలో గ్రామాల అభివృద్ధి కోసం తాము సొంతంగా ఖర్చుపెట్టిన పెండింగ్ బిల్లులు మంజూరు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ నేతృత్వంలో బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందించింది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.